గురువారం 21-9-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 181

'ప్రాజెక్టులను నిర్మిస్తం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

టీన్ డిప్రెషన్



ఇంటి ప్రేమే అసలు వైద్యం

సమాజంలో టీనేజ్ పిల్లల్లో డిప్రెషన్ పెరిగిందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఆత్మహత్యలు తార్కాణాలుగా నిలుస్తూనే ఉన్నాయి. కాని తల్లిదండ్రులు మేల్కొనడం లేదు. టీనేజ్‌లో ఉన్న పిల్లల మూడ్స్‌ను గమనించి వారిని అక్కున చేర్చుకోవాల్సింది మొదట తల్లిదండ్రులే. వైద్యం మొదలవ్వాల్సింది ఇంటి నుంచే. డిప్రెషన్ సూచనలు కనిపించే పిల్లల్ని ఎలా కాపాడుకోవాలి? తెలుసుకుందాం.

ఏదో భయం. ఆందోళన. తల్లిదండ్రుల అంచనాకు తగినట్టు లేనని భయం. మార్కులు తగినన్ని తేలేకపోతున్నానని భయం. పాఠాలంటే భయం. పరీక్షలంటే భయం. ఒంటరిగా ఉండాలంటే భయం. స్నేహితులు లేరని భయం. స్నేహితులతో స్నేహం చెడుతుందేమోనని భయం. ఎవరితో చెప్పుకోవాలో తెలియని భయం. ఎవరితోనూ చెప్పుకోలేనేమోనని భయం.

టీనేజ్ పిల్లలు ఎదిగీ ఎదగని లేత వయసు పిల్లలు. వారికి అన్నీ సందేహాలే. ఆందోళనలే. మన దేశంలో 13–17 ఏళ్ల మధ్య ఉన్న దాదాపు కోటిమంది టీనేజ్ పిల్లలు డిప్రెషన్ బారిన పడుతున్నారని ఒక అంచన. డిప్రెషన్‌లో భయం, ఆందోళన ఉంటాయి. ఈ వయసులో మొదలైన డిప్రెషన్ కొందరిని ముప్పైల్లో, నలభైల్లో ప్రవేశించే వరకు వెంటాడుతుంది. కొందరిని జీవితాంతం వెంటాడవచ్చు. ఇలాంటి స్థితిలో ఉన్న పిల్లలు చీమను కూడా భూతద్దంలో చూసి భయపడతారు. తమ సమస్యకు సమాధానం లేదేమో, ఎవరి నుంచీ దొరకదేమో అనిపించడమే డిప్రెషన్ అత్యంత ప్రమాదకరమైన స్థితి. సమస్యకు పరిష్కారం చావు అనిపించడం దీని పర్యవసానం. ఇంతవరకూ వచ్చే లోపు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల్ని కాపాడుకుంటే వారు ఆ స్థితిని దాటుతారు. లేదంటే అపాయంలో పడతారు.

కారణాలు

టీనేజ్ పిల్లల్లో డిప్రెషన్, యాంగ్జయిటీ రావడానికి కారణాలు ఇదమిత్థంగా తేల్చలేము. చదువుకు సంబంధించిన ఒత్తిడి, తల్లిదండ్రులతో బలమైన అనుబంధం మిస్ కావడం, ర్యాంకుల బరువు, భవిష్యత్తుపై బెంగ, రూపం గురించిన చింత, మెదడులో అసమతుల్యత... ఏమైనా కావచ్చు.

అసలు సమస్య

మనదేశంలో దాదాపు 4 వేల మంది సైకియాట్రిస్టులు, వెయ్యి మంది క్లినికల్ సైకాలజిస్టులు ఉన్నారు. వీరంతా పెద్ద ఆస్పత్రుల్లో లేదా సొంత క్లినిక్‌లలో ఉంటారు. టీనేజ్ పిల్లలకు వీరితో యాక్సెస్ ఉండదు. స్కూళ్లల్లో మానసిక సమస్యలు గమనించి భరోసా ఇచ్చే కౌన్సెలర్‌ల వ్యవస్థ ఇప్పటికీ ఏర్పడలేదు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లలకు తమకు మానసికంగా ఇబ్బంది ఉన్నట్టు గ్రహించడం కూడా తెలియదు. కనుక పిల్లలు ఆత్మహత్యలు చేసుకునే వరకూ వెళుతున్నారు.

మనదేశంలోని సీబీఎస్ఈ స్కూళ్లల్లో సర్వే చేస్తే చాలామంది పిల్లలు తమకు క్లోజ్ ఫ్రెండ్స్ లేరని చెప్పారు.

లక్షణాలు

ఉత్సాహం చూపకపోవడం, చిరాకు, కోపం, ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం, నిద్ర సరిగా ఉండకపోవడం, అలసట, ధ్యాస లేకపోవడం, సరిగా చదవలేక పోవడం...

ఏం చేయాలి?

ముందు తల్లిదండ్రులు, తదుపరి స్కూళ్లు శ్రద్ధ వహించాలి.

- తల్లిదండ్రులు టీనేజ్‌లో ఉన్న పిల్లలతో నిత్యం సంభాషణ జరపాలి. వారితో కూచుని వారు నిస్సంకోచంగా తమ సమస్యలు చెప్పుకోనివ్వాలి. వారు చెప్పేది కొట్టేయకుండా, బదులు తిట్టకుండా అర్థం చేసుకోవాలి. సమస్య మూలాల వరకూ వెళ్లాలి. వారికి చాలా ప్రేమను ఇస్తూ కౌన్సిలింగ్ చేయాలి. రెండు శాతం కంటే తక్కువ మంది పిల్లలకు మందులతో వైద్యం అవసరం కావచ్చు.
- తల్లిదండ్రులు పిల్లల శ్రద్ధ, శక్తిని అంచనా వేస్తూ వారికి లక్ష్యాలు ఇవ్వాలి. వారికి పూర్తిగా ఇష్టం లేని, వారు చేయలేని చదువులో ప్రవేశపెట్టరాదు. వారు గట్టి స్నేహితులు కలిగి ఉండేలా చూడాలి. ఆ స్నేహితులను ఇంటికి ఆహ్వానించి పిల్లలు వారితో గడిపేలా చేయాలి. పిల్లలను గాయపరిచే మాటలు తల్లిదండ్రులు మాట్లాడటం బొత్తిగా మానుకోవాలి. మేమున్నామన్న భరోసా ఇవ్వాలి.
- స్కూళ్లు విధిగా కౌన్సిలర్లను ఉంచాలి. తరగతి వారీగా, ప్రతి విద్యార్థిని మెంటల్ హెల్త్ విషయంలో అంచనా కట్టాలి. వారి సమస్యను అర్థం చేసుకుని టీచర్లకు, లెక్చరర్లకు అవగాహన కల్పించడమే కాక తల్లిదండ్రులకు సమస్య తెలపాలి.

వ్యాధి కుంగదీసినా... కళ గెలిపించింది

స్కూలు అకడమిక్ పరీక్షల్లో కాస్త వెనకబడితేనే కుంగిపోతుంటారు. పిల్లలు. అలాంటిది పదేళ్ల వయసులో తన శరీరం మీద తెల్లని మచ్చలు రావడం చూసిన ఆశా ఖత్రికి ఏమీ అర్థం కాలేదు. తన స్నేహితులు, చుట్టుపక్కల వారి శరీరం మీద అలాంటి మచ్చలు ఏవీ కనపడకపోవడంతో తను ఏదో ప్రత్యేకంగా ఉన్నట్లు భావించి.. అందరిలా తను లేదని చాలా బాధపడింది. తనకొచ్చిన బొల్లి మచ్చలు పోవడం లేదని తీవ్ర నిరాశకు లోనైంది. ఏది ప్రయత్నించినా తనకి ఎదురే వచ్చాయి. అయినా తన చిన్ననాటి అలవాటునే ఉజ్వల భవిష్యత్‌గా మార్చుకుని, సక్సెస్‌ఫుల్ బిజినెస్ ఉమన్‌గా ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది ముప్పైరెండేళ్ల ఆశాఖత్రి.



ఆశాఖత్రి





రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘర్‌కు చెందిన ఆశా ఖత్రి పదేళ్ల వయసులో ఉన్నప్పుడు మిగతా పిల్లల్లా కాకుండా ఒళ్లంతా తెల్లని మచ్చలతో కొంచెం అసాధారణంగా ఉండేది. తన రూపాన్ని చూసుకుని చిన్నారి ఆశా చాలా కుంగిపోయింది. అది గమనించిన తల్లిదండ్రులు, స్నేహితులు ఆమెను ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఆమెలో ధైర్యాన్ని నింపుతూ, వైద్యం చేయించేవారు. ఎంతోమంది డాక్టర్లకు చూపించినప్పటికీ పెద్ద మార్పు రాలేదు.

కుంగిపోయినప్పటికీ...

తన పరిస్థితి చూసుకుని ఎప్పుడూ బాధపడే ఆశ.. మందులు, హార్మోన్లలో మార్పుల వల్ల విపరీతమైన బరువు పెరిగిపోయింది. దీంతో సమాజంలో తిరగాలంటే చాలా బిడియంగా ఉండేది తనకు. అంగవైకల్యం ఉన్న అమ్మాయిలా అందరూ తనని చూసేవారు. ఇంత బాధలోనూ ధైర్యం తెచ్చుకుని ఎం.ఏ., బీఈడీ. చేసింది. చదువు పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమైంది. సంవత్సరాలపాటు కష్టపడినప్పటికి కాలం కలిసిరాక ఉద్యోగం రాలేదు. ఎవరి మీదా ఆధారపడకుండా తన కాళ్లమీద తనే నిలబడాలనకునే ఆశ.. ఏదో ఒకటి చేసి సంపాదించాలన్న కోరికతో రకరకాలుగా ప్రయత్నిస్తూ చివరికి క్రొచెట్‌ను ఎంచుకుంది.

అలవాటునే సంపాదనగా...

క్రొచెట్ టాయిస్‌ను తయారు చేసే కళ ఒక తరం నుంచి మరోతరానికి బదిలీ అవుతుంటుంది. ఆశ చిన్నప్పుడు అల్లికలతో బొమ్మలు తయారుచేసే క్రొచెట్‌కళను తన అమ్మ, అమ్మమ్మల దగ్గర నేర్చుకుంది. వివిధ రకాల బొమ్మలు చేస్తుండేది. ఆ అవాటే తన డెస్టినీ అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. అనేకప్రయత్నాలు విఫలం అయ్యి దిక్కుతోచని రోజులవి. అది 2021 నవంబర్. ఒకరోజు ఆశ...తన చుట్టాల పిల్లలు క్రొచెట్ టాయిస్‌తో ఆడడం చూసింది. క్రొచెట్ టాయిస్‌తో ఆ పిల్లలు ఎంతో సంతోషంగా ఉండడం గమనించిన ఆశ.. తను కూడా ఆ టాయిస్‌ను తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయించవచ్చన్న ఆలోచన వచ్చింది. అనుకున్న వెంటనే తనకు తెలిసిన క్రొచెట్ కళతో చిన్న ఆక్టోపస్‌ను తయారు చేసి అందరికి చూపించింది. అది చూసిన వారంతా చాలా బావుంది. క్యూట్‌గా ఉంది అని చెప్పడంతో.. మరికొన్ని టాయిస్ తయారు చేసి, ఎగ్జిబీషన్‌లో ప్రదర్శించింది. అక్కడ ఆ టాయిస్‌ను చూసిన వారంతా ఇష్టపడి కొనడం, ఆశకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

తన బొమ్మలకు వస్తోన్న ఆదరణను చూసి మరిన్ని టాయిస్‌ను రూపొందించి చిన్నచిన్న ఎగ్జిబిషన్‌లలో విక్రయించేది. అక్కడ వచ్చిన స్పందనతో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. తను తయారు చేసే టాయిస్‌ను ఇన్‌స్టాగ్రామ్, ఇంకా వెబ్‌సైట్ ఆశ.టాయిస్.స్టూడియో పేరిట విక్రయిస్తోంది. రెండువేలకుపైగా బొమ్మలు అమ్ముడయ్యాయి. ఆశ టాయిస్‌కు దేశవ్యాప్తంగా కస్టమర్లు ఉన్నారు. పిల్లలు ఆడుకునే బొమ్మల నుంచి ఇల్లు,ఆఫీసు అలంకరణకు వాడే వివిధ రకాల వస్తువులను తయారు చేసి విక్రయిస్తోంది. జైపూర్‌లో బాగా పాపులర్ అయిన ''టాటూ కేఫ్'' కు డ్రీమ్ క్యాచర్స్‌ను తయారు చేసి ఇవ్వడం విశేషం.

ఒకపక్క బొల్లి, మరోపక్క అధిక బరువు ఉన్నప్పటికీ... తన టాలెంట్‌తో అందమైన క్రొచెట్ టాయిస్‌ను రూపొందిస్తూ కస్టమర్ల మనసులు గెలుచుకుంటోంది ఆశాఖత్రి. దారులన్నీ మూసుకు పోయినప్పటికీ... ఏదో ఒకదారి తెరిచే ఉటుంది. ఓపిగ్గా ఆ దారిని వెతికి పట్టుకుంటే బంగారు భవిష్యత్‌కు మార్గం సుగమం అవుతుందనడానికి ఆశాఖత్రి ఉదాహరణగా నిలుస్తోంది.



మినీషా భరద్వాజ్

భయాన్ని వదిలించిన బొమ్మలు!

ప్రతి మనిషికి ఏదోఒక భయం ఉంటుంది. ఆ భయాన్ని జయించి ముందుకెళ్తుంటారు చాలామంది. మినీషా భరద్వాజ్ మాత్రం భయంతో ఇంట్లో గదికే పరిమితమైపోయింది. మినీషాకు ఉన్న 'అఘోరా ఫోబియా'తో... కొత్త వ్యక్తుల్ని కలిసినా, తెలియని ప్రాంతాలకు వెళ్లినా తెగ భయపడిపోయేది. గుంపుగా ఉన్న జనాలను చూసి ''అమ్మో అంతా నా వైపు చూస్తున్నారు'' అని వణికి పోయేది. చిన్నప్పటి నుంచి ఈ భయంతో పార్టీలు, ఫంక్షన్లకు ఎక్కడికీ వెళ్లనే లేదు. ఇక స్నేహితులు కూడా ఎవరు లేరు. జీవితాంతం ఇలానే ఉంటానేమో అనుకునే మినీషా..బొమ్మలు వేసే అలవాటు ద్వారా తన ఫోబియాను అధిగమించడమేగాక, ఆర్టిస్ట్‌గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. బొమ్మలు వేస్తూ తన భయాన్ని ఎలా పోగొట్టుకుందో తన మాటల్లోనే.....





మాది గురుగావ్. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా నా బాల్యమంతా డెహ్రాడూన్‌లో గడిచింది. చిన్నప్పటి నుంచి తెల్లని పేపర్ మీద పెన్సిల్‌తో రకరకాల బొమ్మలు గీసేదాన్ని. ఏడో తరగతిలో ఉండగా ఒక మ్యాగజీన్‌లో ఉన్న తెల్లటి పేపర్‌పై నటి రేఖ చిత్రాన్ని గీసాను. అప్పుడు మా అమ్మానాన్నలు నా టాలెంట్‌ను చూసి ఆశ్చర్యపోయారు. పదోతరగతి వరకు పెయింటింగ్స్ వేస్తూనే ఉన్నాను. ప్రతి నోట్‌బుక్ చివరి పేజీలో నా పెయింటింగ్ ఒకటి కచ్చితంగా ఉండేది. కొన్నిసార్లు పరీక్షపేపర్‌లో జవాబు తెలియని ప్రశ్నకు బాధపడుతోన్న అమ్మాయి చిత్రాన్ని గీసేదాన్ని. పదో తరగతిలో అంతర జిల్లా పోటీలలో పాల్గొని డెహ్రాడూన్ మొత్తంలోనే మొదటి బహుమతి అందుకున్నాను. అలా ఎక్కువ సమయం బొమ్మలు గీస్తూ ఉంటే అఘోరా ఫోబియా కూడా గుర్తు వచ్చేది కాదు.

ప్రత్యేకమైన కోర్సు చేయలేదు...

నేను చార్టర్డ్ అకౌంటెంట్ కావాలని అమ్మావాళ్లు సీఏ చదివించారు. కానీ నా మనస్సంతా ఆర్ట్‌మీదే ఉండేది. చదువు పూర్తి అయినప్పటికీ కార్పొరేట్ ప్రపంచంలో కాలుపెట్టలేదు. 1995 లో పెళ్లి అయ్యింది. ఆయన ఉద్యోగం దుబాయ్‌లో కావడంతో అక్కడికి వెళ్లిపోయాను. అక్కడ ఓ పబ్లిషింగ్ హౌస్‌లో ఉద్యోగం చేసేదాన్ని. ఒకసారి ఖాళీ సమయం దొరకడంతో..పేపర్ మీద బొమ్మను గీసాను. బొమ్మ పూర్తయ్యే సమయానికి మా ఆయన, ఆయన స్నేహితుడు వచ్చారు. ఆ బొమ్మను చూసి.. ''చాలా బావుంది. బొమ్మలు గీయడంలో మంచి ప్రతిభ ఉంది. ఎందుకు దాచుకుంటావు. బొమ్మలు గీసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యొచ్చు కదా...'' అని ప్రోత్సహించారు. అప్పటి నుంచి నాకెంతో ఇష్టమైన ఆర్ట్‌కు ప్రాణం పోస్తున్నాను.

చార్‌కోల్ పెన్సిల్స్‌తో..

ఆయన ప్రోత్సాహంతో స్కెచ్‌లు గీయడం మొదలు పెట్టాను. ఆయన ఒక ఆర్ట్‌గ్రూప్‌ను పరిచయం చేయడంతో అక్కడకు వెళ్లి స్కెచ్‌లు గీసేదాన్ని. కమ్యూనిటీకి వెళ్లిన రెండేళ్లలోనే 'జి ఆర్ట్ కమ్యూనిటీ' వాళ్లు నన్ను కలిసి ఆర్ట్‌ఎగ్జిబిషన్‌లో పాల్గొనమని ఆహ్వానించారు. ఆ ఎగ్జిబిషన్‌కు అంతర్జాతీయ ఆర్టిస్టులు వస్తున్నారు. మీరు ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించండి''అన్నారు. అది నాకు చాలా పెద్ద అవకాశం. కానీ ''అందరూ రంగులతో స్కెచ్‌లు గీస్తున్నారు. నేను మాత్రం పెన్సిల్, చార్‌కోల్‌తో గీస్తాను. నేను నిలబడగలనా'' అని నిర్వాహకులను అడిగాను. అందుకు వాళ్లు ... నువ్వుతప్ప ఎవరూ చార్ కోల్ వాడడం లేదు. అందరికంటే భిన్నంగా నీ స్కెచెస్ ఆకర్షిస్తాయి అని చెప్పి 'డేర్ టు డ్రీమ్' ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. అలా మొదలైన నా ప్రయాణం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. క్రమంగా వాటర్ కలర్స్ కూడా వేయడం ప్రారంభించాను. చార్‌కోల్ పెయింటింగ్స్‌కు అనేక అవార్డులు అందుకున్నాను. రోలెక్స్ టవర్‌పై నేను వేసిన పెయింటింగ్‌ను ఇప్పటికీప్రదర్శిస్తున్నారు. దీనికి గుర్తింపుగా 'పీపుల్స్ ఛాయిస్ అవార్డు' వచ్చింది. అబుదాబిలోని లువ్రే మ్యూజియంలో నా పెయింటింగ్స్ ఉన్నాయి.

ఏడు వేలమంది ముందు...

దుబాయ్ మాల్స్‌లో ఏడు వేల మంది ముందు చార్‌కోల్‌తో పెయింటింగ్ వేశాను. ఆ పెయింటింగ్ వెంటనే అమ్ముడు పోయింది. 'స్పెషల్ నీడ్ దుబాయ్ కేర్' తో కలిసి చికిత్స పొందుతోన్న పిల్లల కోసం 'లిటిల్ పికాసో'పేరిట పెయింటింగ్స్ వేసి వారికి సాయం చేశా. 2017లో గుర్‌గావ్ వచ్చేసి, ఇక్కడ పెయింటింగ్స్ నేర్పిస్తున్నాను. ఇండియా ఆర్ట్ కమ్యూనిటీ, ఇండియా స్పీకింగ్ ఆర్ట్ ఫౌండేషన్, వారి సాయంతో పెయింటింగ్ నేర్పిస్తున్నాను. దుబాయ్‌లో వేల మందికి నేర్పిన నేను, నా అనుభవాల ద్వారా నేర్చుకున్న ట్రిక్స్‌ను ఇక్కడి పిల్లలకు నేర్పిస్తున్నాను '' అలా నా భయాన్ని అధిగమించడంతో పాటు నా విద్యను అందరికీ నేర్పించగలగడం నాకెంతో సంతృప్తి కలిగిస్తోంది అని చెప్పింది మినీషా.

కొత్త దారి

సైన్స్ బడి

ఆస్క్ • డూ • లెర్న్ • రిపీట్

'సరిగా అర్థం చేసుకోవడం నుంచే ప్రతిభకు బీజాలు పడతాయి' అంటారు. 'నాకు అర్థం కాలేదు' అన్నంత మాత్రాన ఆ స్టూడెంట్ తెలివి తక్కువ అని కాదు. ఒక సబ్జెక్ట్ అర్థం కాకపోవడానికి, అవడానికి మధ్య ఏదో గ్యాప్ ఉండి ఉండవచ్చు. ఆ ఖాళీని పూరించగలిగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని 'స్టెమాన్‌స్టర్' ద్వారా నిరూపించింది బెంగళూరుకు చెందిన సైంటిస్ట్ సోనాలి గుప్తా...

ఆరోజు స్కూలు నుంచి వచ్చిన శ్రిష్టి తల్లి సోనాలిని ఒక డౌట్ అడిగింది. 'లోహంతో తయారు చేసిన ఓడ నీటిలో ఎలా తేలుతుంది?'

నాల్గవ తరగతి చదువుతున్న శ్రిష్టి ఇలాంటి సందేహాలెన్నో తల్లిని అడుగుతుంటుంది. అప్పటికప్పుడు జవాబు చెప్పి చిన్నారి సందేహాన్ని తీరుస్తుంటుంది సోనాలి. ఇంట్లో శ్రిష్టి కోసం ఒక ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌ను పరిశీలించడం ద్వారా శ్రిష్టిలో శాస్త్రీయ విషయాలపై ఆసక్తి పెంచాలనేది సోనాలి కోరిక.

ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన సోనాలికి కూతురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అత్యంత సులువైన పని. మరి శాస్త్రీయ విషయాలపై అవగాహన లేని తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటి?

ఓడకు సంబంధించిన కుమార్తె సందేహాన్ని ఇంట్లో అందుబాటులో ఉన్న వస్తువులతోనే చెప్పింది సోనాలి. తాను అలా చెప్పడం వల్ల శ్రిష్టికి సులభంగా అర్థమైంది. ఇదే విధానంలో ఇతర పిల్లలకు చెబితే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన లాక్‌డౌన్ టైమ్‌లో పట్టాలకెక్కింది.

'అది నా జీవితంలో చెప్పుకోదగిన ముఖ్య సందర్భం' అంటుంది సోనాలి.

'లెర్నింగ్ బై డూయింగ్' అనే నినాదంతో పిల్లలకు శాస్త్రీయ విషయాలపై అవగాహన పెంచడానికి హ్యాండ్స్–ఆన్ లెర్నింగ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'స్టెమాన్‌స్టర్'కు శ్రీకారం చుట్టింది. రకరకాల సందేహాలను తీర్చేలా వాట్సాప్ వేదికగా ఎన్నో వీడియోలు చేసింది. సంప్రదాయ బోధన ఎలా మెరుగుపడాలో చెబుతున్నట్లుగా ఉండేవి ఆ వీడియోలు.

పరిచితులు, అపరిచితులు, మిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

'మీ వీడియోలు అంటే మా పిల్లలకు ఎంతో ఇష్టం' అని ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు చెప్పినప్పుడల్లా సోనాలికి ఉత్సాహంగా ఉండేది.


'చాలా స్కూళ్లలో సైన్స్ అనేది సూత్రాలు, నిర్వచనాల పరిధి దాటి బయటికి రాదు. నిర్వచనాలు నిర్వచనాలలాగే చెప్పడం వల్ల అందరు పిల్లలకు అర్థం కాకపోవచ్చు. అందుకే అందరికీ అర్థమయ్యేలా ప్రాక్టికల్‌గా చెప్పాలి. ప్రపంచంలో గొప్ప ల్యాబ్స్ అని చెప్పుకోదగ్గ ఎన్నో ల్యాబ్స్‌లో పనిచేశాను. ఎందరో పిల్లలు ఆ ల్యాబ్స్‌లో కనిపించేవారు. పిల్లలకు సైన్స్‌పై ఆసక్తి అక్కడినుంచే మొదలవుతుంది' అంటుంది సోనాలి.


'స్టెమాన్‌స్టర్' ద్వారా సైన్స్, గణితానికి సంబంధించి జటిలమైన కాన్సెప్ట్‌ల గురించి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివిధ రకాల వస్తువులను ఉపయోగించి చెబుతున్నారు. ఎనిమిది నుంచి పద్నాలుగు సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని వీటిని రూపొందించారు.

'పిల్లలు నా నుంచి మాత్రమే కాదు ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటున్నారు' నవ్వుతూ అంటుంది సోనాలి.



స్టూడెంట్‌తో సోనాలి





అయిదవ తరగతి చదువుతున్న ఆర్యన్ కేజ్రీవాల్‌కు సౌరవ్యవస్థ అనేది ఆసక్తికరమైన సబ్జెక్ట్. 'స్టెమాన్‌స్టర్' ప్లాట్‌ఫామ్ ద్వారా తనకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు సంబంధించి ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాడు.

'నేను ఒరిగామి స్టార్స్ తయారు చేస్తాను. వాటి ద్వారా ఎన్నో సైన్స్ విషయాలు ఫ్రెండ్స్‌కు చెబుతుంటాను' అంటాడు ఆర్యన్.


'మా అబ్బాయిలో ఎంత మార్పు వచ్చిందంటే ఇప్పుడు మ్యాథ్స్, సైన్స్ వాడి ఫేవరెట్ సబ్జెక్ట్‌లు' అంటుంది ఆనందంగా ఆర్యన్ తల్లి ఆంచల్.

ప్రశ్న–జవాబుల నుంచి వర్క్‌షాప్‌ల వరకు 'స్టెమాన్‌స్టర్' ద్వారా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'ఆస్క్, డూ, లెర్న్, రిపీట్' అంటూ పిల్లలకు దగ్గరవుతోంది స్టెమోన్‌స్టర్.

ఇంటిప్స్


- వేడి నీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేసి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే



బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్లసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 181
గురువారం 21-9-2023



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



సిరాజ్ మళ్లీ నంబర్‌వన్
ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్‌కు అగ్రస్థానం -IVలో



అదానీ గ్రీన్‌లో భారీ పెట్టుబడులు
రూ. 2,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న టోటల్ ఎనర్జీస్ సంస్థ - 11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




జాగ్రత్తగా ఉండండి..
కెనడాలో హింస పెరిగినందున ఆ దేశంలోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత విదేశాంగ శాఖ సూచించింది.
వివరాలు 6లో ▸



కెనడా వదిలేసి వెళ్లిపోండి
ఇండో–కెనడియన్ హిందువులు భారత్‌కు వెళ్లిపోవాలని నిషేధిత ఖలిస్తానీ సంస్థ సీఎఫ్‌జే చీఫ్ గురుపత్వంత్‌సింగ్ హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



ఎర్డోగన్ నోట.. కశ్మీర్ మాట
తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని పనిగట్టుకుని అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు.
వివరాలు 6లో ▸




ఏఎన్నార్ నట విశ్వవిద్యాలయం
ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుక హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా జరిగింది.
వివరాలు IVలో ▸

ప్రభుత్వ బడుల్లో 'ఐబీ'

అంతర్జాతీయ స్థాయి సిలబస్ అమలుతో కొత్త రూపు

- ఐబీతో విద్యా శాఖ ఒప్పందానికి మంత్రివర్గంలో హర్షాతిరేకాలు
- అసెంబ్లీ ముందుకు ఏపీజీపీఎస్ 2023, ఏపీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ బిల్లులు
- సీపీఎస్ ఉద్యోగులకు పెన్షన్ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు
- 10 వేల మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ముందడుగు
- యూపీఎస్సీ అభ్యర్థుల కోసం నజరానా
- ప్రిలిమ్స్ క్వాలిఫై అయితే రూ.లక్ష, మెయిన్స్ కూడా క్వాలిఫై అయితే మరో రూ.50 వేలు
- సెప్టెంబర్ 30–నవంబర్ 15 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు
- క్యాన్సర్ వైద్యాన్ని బలోపేతం చేసేలా డీఎంఈల్లో 353 పోస్టుల భర్తీ
- అంతర్జాతీయ వర్సిటీలతో ప్రైవేటు వర్సిటీల భాగస్వామ్యం తప్పనిసరి
- రిటైర్మెంట్ తర్వాత చిరుద్యోగుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ
- సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం



'ఐబీ వరల్డ్ స్కూల్స్' పుస్తకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందజేస్తున్న ఐబీ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్కూళ్లలో అంతర్జాతీయ ప్రమాణాల పెంపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేద విద్యార్థులను గ్లోబల్ స్థాయిలో సగర్వంగా నిలబెట్టేందుకు మహత్తర యజ్ఞాన్ని తలపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలుకు ముందడుగు వేసింది. ఈ మేరకు ఐబీ సంస్థతో పాఠశాల విద్యా శాఖ కుదుర్చుకున్న ఒప్పందానికి (ఎంఓయూ) బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో హర్షధ్వానాల మధ్య ఆమోదం లభించింది. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ
మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర ప్రభుత్వంతో ఐబీ ఒప్పందం

సీఎం సమక్షంలో ఐబీ బిజినెస్ చీఫ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సంతకాలు
ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం : సీఎం వైఎస్ జగన్
ఇక్కడి విద్యార్థులు సంపాదించే సర్టిఫికెట్ ప్రపంచంలో ఎక్కడైనా చెల్లుబాటవ్వాలి.. ఐబీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్‌తో సమానంగా రాష్ట్ర విద్యార్థులు ఉండాలి
9లో

మహిళా బిల్లుకు జై

'నారీశక్తి వందన్ అధినియమ్'కు లోక్‌సభ ఆమోదం

బిల్లుకు అనుకూలంగా 454, వ్యతిరేకంగా 2 ఓట్లు

- పార్టీలకు అతీతంగా దాదాపు ఏకగ్రీవంగా మద్దతు
- బిల్లుపై దిగువ సభలో 8 గంటలపాటు సుదీర్ఘ చర్చ
- అనంతరం మాన్యువల్ విధానంలో ఓటింగ్.. బిల్లును వ్యతిరేకించిన ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్
- ఇక రాజ్యసభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు
- ఎగువ సభలో నేడే చర్చ, ఓటింగ్.. ఆమోదం లాంఛనమే



నూతన పార్లమెంట్ భవనాన్ని తిలకించేందుకు వచ్చిన మహిళా సందర్శకులు

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభ దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 368(2) ప్రకారం ఈ బిల్లు ఆమోదం పొందింది. దీనిప్రకారం సభలోని మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు తెలపాల్సి ఉంటుంది. పార్టీలకు అతీతంగా సభ్యులు బిల్లుకు జై కొట్టారు. పార్లమెంట్ నూతన భవనంలో ఆమోదం పొందిన మొట్టమొదటి బిల్లు ఇదే కావడం విశేషం. 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరిట కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ నెల 19న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'రాజ్యాంగ (128వ సవరణ) బిల్లు–2023'పై బుధవారం దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. కేంద్ర మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ సహా వివిధ పార్టీలకు చెందిన దాదాపు 60 మంది సభ్యులు మాట్లాడారు. కొందరు బిల్లుకు మద్దతుగా ప్రసంగించారు. మరికొందరు మహిళా రిజర్వేషన్లలో
మిగతా 6వ పేజీలో ▶

తక్షణమే అమలు చేయండి: సోనియా

ఓబీసీ కోటా లేకుంటే అసంపూర్ణమే: రాహుల్

ఏకగ్రీవానికి కలిసి రండి

లోపాలుంటే తర్వాత సరిచేసుకోవచ్చు: అమిత్ షా
6లో

న్యూస్‌రీల్

434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం నోటిఫికేషన్ ఇచ్చింది. కాంట్రాక్ట్ విధానంలో వీటిని భర్తీ చేయనున్నారు.
వివరాలు 12లో ▸

18.81 లక్షల గృహాల్లో ఆరోగ్య వివరాల సేకరణ



రాష్ట్రంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తున్నారు.
వివరాలు 3లో ▸

విశాఖలోనూ సీఎం క్యాంపు కార్యాలయం

దసరా పండుగ రోజున అక్కడి నుంచి పరిపాలనకు శ్రీకారం
మంత్రులకు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- కార్యాలయాల భవనాల గుర్తింపునకు అధికారులతో కమిటీ
- విశాఖకు కార్యాలయాల తరలింపునకు మరో కమిటీ
- శాసనసభ సమావేశాలను సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశం
- చంద్రబాబు హయాంలో అక్రమాలన్నింటిపై చర్చిద్దాం
- జమిలి ఎన్నికలపై కేంద్రం నిర్ణయం కోసం వేచి చూద్దాం
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందాం



సాక్షి, అమరావతి: విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై కొంత కాలంగా సాగుతున్న చర్చకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెరదించారు. విశాఖపట్నంలోనూ సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని మంత్రులకు స్పష్టం చేశారు. సీఎం కార్యాలయం మొదలు
మిగతా 3వ పేజీలో ▶

నేటి నుంచి 'అసెంబ్లీ'



ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి ప్రారంభం
తొలుత ప్రశ్నోత్తరాలు.. తర్వాత సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశం
ఈ భేటీలో సమావేశాలు జరిగే రోజులు, అజెండా ఖరారు.. పలు కీలక బిల్లులను ఆమోదించనున్న ఉభయ సభలు
సమావేశాలు సజావుగా సాగేందుకు పటిష్ట బందోబస్తు
2లో

అసెంబ్లీ సమావేశాలకు వెళదాం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో నిర్ణయం
చంద్రబాబుపై కేసులు ఎత్తేయాలన్నదే ప్రధాన డిమాండ్.. ఢిల్లీ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న లోకేశ్
7లో



స్కిల్ కుంభకోణం బాబు ఆలోచనల నుంచే..

- అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన సంబంధీకులే.. ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది
- 5 రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ
- కోర్టును శంకించేలా కౌంటర్ దాఖలు చేసిన చంద్రబాబు న్యాయవాదులు
- కేసును తాము విచారించడంపై అభ్యంతరం ఉందా? అని ప్రశ్నించిన కోర్టు
- తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదన్న బాబు న్యాయవాదులు
- నేడు తీర్పు వెలువరిస్తామన్న కోర్టు

7లో

క్లుప్తంగా...

ఆస్పత్రి నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ డిశ్చార్జ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆస్పత్రి నుంచి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆయనకు మణిపాల్ ఆస్పత్రిలో సోమవారం అపెండిసైటిస్ శస్త్ర చికిత్స చేసిన విషయం తెలిసిందే. పూర్తిగా కోలుకోవడంతో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఆయన రాజ్ భవన్‌కు చేరుకున్నారు. గవర్నర్ ఆరోగ్యం నిలకడగా ఉందని మణిపాల్ ఆస్పత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

'చంద్రయాన్-3' రీయాక్టివేట్‌కు సన్నద్ధం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా గత 23న చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధృవంలో దిగి సేవలందించిన ల్యాండర్, రోవర్‌లను రీయాక్టివేట్ చేసేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది. ఇప్పటికే రోవర్ చంద్రుడి ఉపరితలంపై సుమారు 200 మీటర్ల దూరం ప్రయాణించి అక్కడి సమాచారాన్ని అందించింది. అనంతరం దక్షిణ ధృవం సూర్యరశ్మి లేకుండా చీకటితో నిండిపోయే సమయం ఆసన్నమవ్వడంతో.. ఇస్రో శాస్త్రవేత్తలు ముందు జాగ్రత్తగా ఈనెల 2న రోవర్‌ను, 4న ల్యాండర్‌ను స్లీపింగ్ మోడ్‌లోకి పంపించారు. ఇప్పుడు మళ్లీ ల్యాండర్, రోవర్‌లు ఉన్న ప్రాంతంలో సూర్యకిరణాలు ప్రసరించనున్నాయని ఇస్రో శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బుధ, గురువారాల్లో సూర్యరశ్మిని ఉపయోగించుకొని.. ల్యాండర్, రోవర్‌లోని బ్యాటరీలు రీచార్జ్ అవుతాయని భావిస్తున్నారు. ఈనెల 22న ల్యాండర్, రోవర్ పనితీరును ఇస్రో పునరుద్ధరించే అవకాశముంది. బ్యాటరీలు రీచార్జ్ అయ్యి ల్యాండర్, రోవర్ మళ్లీ పనిచేస్తే.. ఇస్రో అంతరిక్ష చరిత్రలో ఇది మరో అద్భుతం కానుంది.

24 నుంచి విజయవాడ-చెన్నై వందేభారత్ రైలు



సాక్షి, అమరావతి: విజయవాడ నుంచి చెన్నైకు వందే భారత్ రైలును ఈ నెల 24న రైల్వేశాఖ ప్రారంభించనుంది. తిరుపతి వెళ్లే భక్తులకు సౌలభ్యంగా ఈ రైలు విజయవాడ నుంచి రేణిగుంట మీదుగా చెన్నై వెళుతుంది. అదే మార్గంలో చెన్నై నుంచి విజయవాడ చేరుకుంటుంది. మొత్తం 10 రైల్వే స్టేషన్లలో ఇది ఆగుతుంది. దీని పూర్తి షెడ్యూల్‌ను ఒకట్రెండ్రోజుల్లో దక్షిణ మధ్య రైల్వే ప్రకటించనుంది.

'రైతు నేస్తం' 3 రోజుల శిక్షణ

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లోని రైతులకు ఈ నెల 29 నుంచి మూడు రోజులపాటు గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు శిక్షణ కేంద్రంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు, కషాయాలు, మిశ్రమాల తయారీ, ఆహార పంటలకు విలువ జోడింపుపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు వెల్లడించారు. శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే రైతులకు భోజన, వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94905 59999 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సింగపూర్ చేరుకున్న భారత జలాంతర్గామి



సింధియా (విశాఖ పశ్చిమ): భారత నౌకాదళానికి చెందిన జలాంతర్గామి ఐఎన్ఎస్ సింధుకేసరి.. నౌకలు రణ్‌విజయ్, కవరత్తి సింగపూర్-ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక వ్యాయామం 30వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు సింగపూర్‌కు చేరుకున్నాయి. ఇండియన్ నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ మధ్య వార్షిక ద్వైపాక్షిక నావికా వ్యాయామం 1994 నుంచి నిర్వహిస్తున్నారు. భారతీయ నావికాదళం మరే ఇతర దేశంతోనూ చేయని సుదీర్ఘమైన నిరంతర నౌకాదళ వ్యాయామంగా సింగపూర్-ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ ప్రసిద్ధి గాంచింది. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సింగపూర్‌లోని హార్బర్ ఫేజ్‌లో రెండు దశల్లో నిర్వహించబడుతుంది. భారత నౌకాదళ నౌకలు రణ్‌విజయ్, కవరత్తి, జలాంతర్గామి ఐఎన్ఎస్ సింధుకేసరితో పాటు లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా ఈ వ్యాయామంలో పాల్గొంటుంది.

నేటి నుంచి

అసెంబ్లీ, మండలి సమావేశాలు

- ఉదయం 9 గంటలకు అసెంబ్లీ, 10 గంటలకు మండలి ప్రారంభం
- పలు కీలక బిల్లులను ఆమోదించనున్న ఉభయ సభలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. శాసనసభ సమావేశాలు ఉదయం 9 గంటలకు, మండలి సమావేశాలు 10 గంటలకు ప్రశ్నోత్తరాలతో ప్రారంభం కానున్నాయి. అనంతరం శాసన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశం కానుంది. సభ ఎన్ని రోజులు నిర్వహించాలి.. ఏ అంశాలపై చర్చించాలనే దానిపై ఈ సమావేశంలో అజెండా ఖరారు కానుంది. రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక బిల్లులను ఈ సమావేశాల్లో ఆమోదించనుంది. సమావేశాలు సజావుగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది. అసెంబ్లీ, మండలి సమావేశాల నేపథ్యంలో బుధవారం శాసనసభ కమిటీ హాల్‌లో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నతాధికారులతో సమావేశమై బందోబస్తు, ఇతర ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహించారు. పటిష్టమైన పోలీస్, మార్షల్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసన సభా స్పీకర్ తమ్మినేని సీతారామ్ అధికారులను ఆదేశించారు.

మార్షల్స్ అప్రమత్తంగా ఉండాలి

మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్.. పోలీస్ అధికారులతో శాంతి భద్రతల అంశాన్ని సమీక్షిస్తూ.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పోలీస్, మార్షల్స్ ఎంతో అప్రమత్తంగా ఉండాలని, పాస్ లేకుండా ఏ ఒక్కరినీ అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించవద్దని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి వారు సూచించారు. ఈ సారి పాస్‌ల జారీని కూడా సాధ్యమైనంత నియంత్రించాలని.. ప్రముఖులు, అధికారులు, సిబ్బంది మినహా ఇతరులకు ఎటువంటి విజిటింగ్ పాస్‌లు జారీ చేయవద్దని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులను ఆదేశించారు. సభ్యులు సమావేశాలకు సకాలంలో హాజరయ్యేలా వారి రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వారు బసచేసే ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. సచివాలయం నాలుగు వైపులా పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పాటు అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి ఏమరపాటు లేకుండా ఎంతో అప్రమత్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులను నిర్వహించాలని సూచించారు.

సభ్యులకు సంతృప్తికర సమాధానాలు

అంతకు ముందు పలు శాఖల కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసన సభా స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సమావేశాలను సజావుగా నిర్వహించడంలో పలు శాఖల కార్యదర్శులు, అధికారులు ఎంతగానో సహకరించారని, అదే సహకారాన్ని ఇకపైనా కొనసాగించాలని కోరారు. ఎన్నికలు జరిగే సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో గౌరవ సభ్యులు పలు ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడుగుతుంటారని, వాటన్నింటికీ సమావేశాల నిర్వహణ సమయంలోనే సంతృప్తికర స్థాయిలో సమాధానాలు ఇవ్వాలని సూచించారు. గౌరవ సభ్యులు వారి నియోజకవర్గాల సమస్యలను సభలో చెప్పుకునేందుకు జీరో అవర్ ఎంతో ప్రాముఖ్యమైనదని, ఆ సమయంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలను అధికారులు వెంటనే అందజేయాలన్నారు. పలు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న స్టార్డు, అన్ స్టార్డు, షార్టు నోట్ ప్రశ్నలను వివరిస్తూ వాటన్నింటికీ వెంటనే సరైన సమాధానాలను అందజేసి జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు ఇచ్చేందుకు, వారి పిటిషన్లను సత్వరమే పరిష్కరించేందుకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను సత్వరమే రూపొందించాలని ఐటీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను సచివాలయం నాలుగవ బ్లాకు పబ్లిసిటీ సెల్ నుండి మీడియాకు అందజేసేలా సమాచార శాఖ ఏర్పాట్లు చేసింది.

ఏపీలో వైద్య సేవలు అమోఘం

నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ కేంద్ర బృందం ప్రశంస


వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ బృందం సభ్యులు

తాడేపల్లిరూరల్: ఏపీలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు అమోఘంగా ఉన్నాయని నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ నుంచి వచ్చిన బృంద సభ్యులు డాక్టర్ ఎస్.వినోద్ కుమార్, మొహమ్మద్ షేక్‌లు కితాబిచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్ డ్రైవర్ కాలనీలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను వారు సందర్శించారు. వైద్యశాల ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వివరించేందుకు ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా గర్భిణులకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని, పోషక విలువలను అడిగి తెలుసుకుని.. చాలా అమోఘంగా ఉందని ప్రశంసించారు. అనంతరం వైద్యశాలలో కుష్టు వ్యాధికి, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు అందిస్తున్న చికిత్సతో పాటు, రోగులకు ఇస్తున్న కౌన్సెలింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు చాలా బాగున్నాయన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అన్ని వసతులను ఏర్పాటు చేశారని కొనియాడారు. ప్రతి ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్ సౌకర్యం కూడా కల్పించారని, అన్ని రకాల రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఉప ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మన్మోహన్, తాడేపల్లి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా కవయిత్రి మొల్ల జయంతి

- సీఎం జగన్‌కు శాలివాహన కుమ్మరుల కృతజ్ఞతలు



సాక్షి,అమరావతి: సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ప్రతి ఏడాది మార్చి 13న అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు, కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఏపీ శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం మాట్లాడుతూ..ఇక నుంచి ప్రతి ఏడాది మార్చి 13న శాలివాహన కుమ్మరులు 'మొల్ల జయంతిని' అంగరంగ వైభవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో కుమ్మరుల సమస్యలను విన్న వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. తిరుమలలో మట్టికప్పుల వాడకానికి అనుమతిచ్చారని, టీటీడీ డైరీలో మొల్ల చరిత్ర ప్రింట్ చేసేందుకు అనుమతించారని, త్వరలోనే డైరీ ఆవిష్కరిస్తామన్నారు. కుమ్మరుల ఈనాం భూములు వారికే చెందేలా జీవో ఇచ్చారని చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో 'ఐబీ'

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే ఆంగ్ల భాష పరిజ్ఞానం పెంపునకు మూడో తరగతి నుంచి ప్రతి రోజు గంటపాటు విద్యార్థులకు టోఫెల్ శిక్షణ అందిస్తోంది. తాజా ఒప్పందంతో ఒకటవ తరగతి నుంచి ఐబీ సిలబస్‌ను ప్రవేశపెడుతూ నెమ్మదిగా పై తరగతులకు విస్తరిస్తుంది. దీంతోపాటు రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేకూరుస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిటైర్మెంట్ అనంతరం సీపీఎస్ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రతిపాదించిన గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలుకు ముందడుగు వేసింది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ గ్యారంటీడ్ పెన్షన్ స్కీం(ఏపీ జీపీఎస్) బిల్లు- 2023ను ప్రవేశపెట్టనుంది. దీనితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన సుమారు 10 వేల మందికిపైగా ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ బిల్లు-2023నూ అసెంబ్లీ ముందుకు తీసుకురానుంది. ఈ నిర్ణయాలకూ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ తీసుకున్న నిర్ణయాల వివరాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.


కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పేరుతో అవార్డులను అందజేయనున్నారు. యూపీఎస్సీ పరీక్షల్లో ప్రిలిమనరీ, మెయిన్స్ 2 విభాగాల్లో ఉత్తీర్ణులై సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా వెనుకబడిన పేద అభ్యర్థులకు ఆర్థిక సాయం అందిస్తారు. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయితే రూ.లక్ష, వీరిలో మెయిన్స్‌కు అర్హత సాధిస్తే అదనంగా మరో రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తారు. ఇందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

జఫ్రీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం కోసం

2017 డెఫ్ ఒలింపిక్స్ టెన్నిస్‌లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతక విజేత, ఇండియన్ డెఫ్ టెన్నిస్ టీం కెప్టెన్ షేక్ జఫ్రీన్‌కు గ్రూప్-1 సర్వీసెస్‌లో కో-ఆపరేటివ్ సొసైటీస్ డెప్యూటీ రిజిస్ట్రార్ హోదాలో నియామకం కల్పించనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ (రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ పేట్రన్ అండ్ పే స్ట్రక్చర్) యాక్ట్- 1994ను సవరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జఫ్రీన్‌కు 10 సెంట్ల ఇంటి స్థలం కూడా కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

'ఐబీ' సిలబస్ చరిత్రాత్మకం



అమెరికా వంటి దేశాల్లో మాత్రమే ఐబీ సిలబస్ అందుబాటులో ఉంది. ఇప్పుడు మన పిల్లలకు అందిస్తున్నాం. రాష్ట్రంలో 'ఐబీ' సిలబస్‌ను ప్రవేశపెట్టడం చరిత్రాత్మక ఘట్టం. ఐబీలో చదువుకున్న విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఏ యూనివర్సిటీకి వెళ్లినా మంచి అవకాశాలు వస్తాయి. ప్రశ్నలు వేసే విధానం, వాటికి సమాధానాలు నేర్చుకునే విధానం నిజ జీవితాలకు దగ్గరగా ఉంటుంది. ఇప్పటికే మూడో తరగతి నుంచి విద్యార్థులకు వారానికి ఆరు రోజులు.. రోజూ గంట పాటు టోఫెల్ శిక్షణ ఇప్పిస్తున్నాం. వీళ్ల 8, 9 తరగతులకు వచ్చే సరికి మంచి నైపుణ్యం సాధిస్తారు. దీనివల్ల వారికి ఇంగ్లిషులో పరిజ్ఞానం బాగా పెరుగుతుంది. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కూడా మనం తోడ్పాటునందించాలి. ప్రిలిమ్స్ క్వాలిఫై అయితే రూ.లక్ష, వీరు మెయిన్స్ కూడా క్వాలిఫై అయితే అదనంగా మరో రూ.50 వేలు ఇస్తే.. కష్టపడి చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఎంతో మేలు చేసినట్టువుతుంది. భవిష్యత్తులో సివిల్ సర్వెంట్లుగా ఎందరో పేదలకు సేవ చేయడానికి స్ఫూర్తినిచ్చినట్టు ఉంటుంది.

– ప్రభుత్వ బడుల్లో ఐబీ సిలబస్‌పై మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్

జీరో వేకెన్సీలో టాప్

వైద్య ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ. ఆరోగ్య శాఖలో ఎక్కడా కూడా ఖాళీలు లేకుండా సిబ్బందిని ఎప్పటికప్పుడు నియమిస్తున్నారు. తాజాగా కేన్సర్ వైద్యాన్ని బలోపేతం చేసేందుకు డీఎంఈ పరిధిలోని విశాఖ కింగ్‌జార్జ్ ఆస్పత్రి, గుంటూరు ప్రభుత్వ సర్వజనాస్పత్రి, కడప ప్రభుత్వ ఆస్పత్రిలో కేన్సర్ కేర్ సెంటర్‌లో 353 పోస్టుల భర్తీ చేస్తున్నాం. ఒంగోలు, ఏలూరు, విజయవాడలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో ప్రమోషన్ విధానం /అవుట్ సోర్సింగ్ ద్వారా 168 పోస్టుల భర్తీకి నిర్ణయం. వీటికి తోడు 11 ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో వివిధ విభాగాల్లో మరో 99 పోస్టులను భర్తీ చేయాలన్న వైద్య ఆరోగ్యశాఖ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఏపీ వైద్య విధాన పరిషత్‌ను వైద్య ఆరోగ్య శాఖలోకి విలీనం చేస్తున్నాం. ఆర్డినెన్స్ స్థానంలో దీనికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నాం. దీంతో ఏపీవీవీపీలోని ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనికి మంత్రివర్గం ఆమోదం లభించింది.

ప్రైవేటు వర్సిటీ విద్యలో మార్పు

ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు వర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్టు-2016 చట్ట సవరణకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నాం. దీని ద్వారా ప్రైవేటు వర్సిటీల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ చట్ట సవరణతో ఇంతకు ముందున్న ప్రైవేటు వర్సిటీలు, కొత్తగా ఏర్పాటు చేసే ప్రైవేటు వర్సిటీలు ప్రపంచంలోని టాప్ 100 వర్సిటీలతో భాగస్వామ్యం కలిగి ఉండాలి. ప్రఖ్యాత వర్సిటీలతో ఇక్కడి ప్రైవేటు వర్సిటీలు విద్యార్థులకు సంయుక్త సర్టిఫికేషన్ డిగ్రీలు అందించాలి. ఇప్పుడున్న ప్రైవేటు కాలేజీలను వర్సిటీలుగా మారిస్తే వచ్చే అదనపు సీట్లలో 35 శాతం సీట్లు కన్వీనర్ కోటాలోకి వస్తాయి. దీనివల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది.

45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్రంలోని ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే సెప్టెంబరు 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమాలు తలపెట్టాం. ఇందులో భాగంగా తప్పకుండా పేదల ఇళ్లను సందర్శించి ఆరోగ్య శ్రీ, ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సీఎం జగన్ సూచించారు. ఆ తర్వాత ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ వెళ్లి అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారు. మెడికల్ క్యాంపుల తేదీలను ముందుగానే ప్రకటిస్తారు. దీర్ఘకాలిక, తీవ్ర వ్యాధులతో బాధ పడేవారికి పూర్తిగా చికిత్స చేయించేంత వరకు తోడుగా నిలుస్తారు. ఇందుకోసం ప్రభుత్వం విలేజ్ క్లినిక్స్‌లో అందుబాటులో ఉన్న మందులు కాకుండా అదనంగా 162 రకాల మందులు, 18 సర్జికల్స్ అందుబాటులో ఉంచుతోంది. స్పెషలిస్ట్ వైద్యుల సూచన మేరకు ఇతర మందులు కూడా అందిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 15 వరకు దాదాపు 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు క్యాబినెట్ ఆమోదించింది.

చిరుద్యోగికి పెద్ద సాయం

ప్రభుత్వంలో చిరుద్యోగి రిటైరయ్యే సమయానికి కనీసం ఇంటి స్థలం సమకూర్చుకునేలా ప్రోత్సహిస్తాం. దీనిని ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తుంది. రిటైరైన తర్వాత చిరుద్యోగుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీతో సేవలు అందేలా సీఎం నిర్ణయానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మరోవైపు పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న ఇళ్ల అంచనా ఖర్చు పెరిగింది. 2016-17 నాటి రేట్ల ప్రకారమే ఇళ్ల నిర్మాణ అంచనాలు తయారు చేశారు. తాజా రేట్లను బట్టి చూస్తే 8,424 ఇళ్ల నిర్మాణానికి రూ.70 కోట్లు అదనంగా వ్యయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

భూదాన్- గ్రామదాన్ చట్ట సవరణ

ఆంధ్రప్రదేశ్ భూదాన్-గ్రామదాన్ యాక్టు 1965 సవరణలతో కూడిన డ్రాఫ్ట్ బిల్లుకు కేబినెట్ ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ఆచార్య వినోభా బావే లేక ఆయన నామినేట్ చేసిన వ్యక్తిని సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వాలు భూదాన్ బోర్డును నియమించాలి. కానీ ఈ చట్టం వచ్చి 58 సంవత్సరాలు కావడం, వినోభా బావే మృతి చెంది కూడా 41 ఏళ్లవడంతో ఆయన నామినేట్ చేసిన అసలు వ్యక్తి ఎవరో నిర్ధారించడం కష్టంగా మారింది. దీంతో చట్టానికి అనుగుణంగా ప్రభుత్వమే బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను నియమించేందుకు వీలుగా చట్టాన్ని సవరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బలహీన వర్గాలు, పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కోసం భూమిని మంజూరు చేసే అధికారాన్ని బోర్డు కల్పించేలా చట్టంలో మార్పు చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్ట సవరణకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు.

పోస్టుల భర్తీ ప్రతిపాదనకు ఆమోదం

- ఆదోనిలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 34 టీచింగ్ పోస్టులు, 10 నాన్ టీచింగ్ పోస్టులు భర్తీకి కేబినెట్ ఆమోదం.
- కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా 13 స్పెషల్ కేడర్ డెప్యూటీ రిజిస్ట్రార్, 6 డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టుల భర్తీ.
- సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టు భర్తీ.
- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విభాగంలో డెప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (తిరుపతి), ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్(రాజమండ్రి) పోస్టుల ఏర్పాటు.
- కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజిమెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ)లో శాశ్వత విభాగంతో పాటు 10 కొత్త పోస్టుల మంజూరు.
- సాధారణ పరిపాలన విభాగంలో చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీ.
- ఏపీ స్టేట్ ప్రివెన్షన్ ఆఫ్ యాంటీ సోషల్ అండ్ హజార్డస్ యాక్టివిటీస్ ట్రిబ్యునల్‌లో 5 కొత్త పోస్టుల మంజూరు.
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 40 ఆఫీసు సబార్డినేట్ పోస్టులు, 28 డ్రైవర్ పోస్టులు అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ.

పలు చట్ట సవరణ బిల్లులకు ఆమోదం

- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ యాక్టు-2017లో భాగంగా వర్సిటీల్లో నియామకాలు ఇకపై ఏపీపీఎస్సీ ద్వారానే చేపట్టేలా సవరణ బిల్లు.
- ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికల్ టాక్సియేషన్ యాక్ట్ 1963 సవరణలతో కూడిన డ్రాఫ్ట్ బిల్లు.
- ఆంధ్రప్రదేశ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ 2023 సవరణల బిల్లు.
- ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ యాక్టు-1987 సవరణలకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) యాక్ట్ 1977కు సవరణ. ఆర్డినెన్స్ స్థానంలో చట్టం తీసుకువస్తూ ప్రవేశపెట్టనున్న బిల్లు.
- ది ఆంధ్రప్రదేశ్ స్పెషల్ సెక్యూరిటీ గ్రూపు (ఏపీ ఎస్ఎస్‌జీ) బిల్లుకు ఆమోదం.

మరిన్ని అంశాలకు కేబినెట్ పచ్చ జెండా

- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా తొమ్మిది మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రతిపాదిత నిర్ణయం
- కురుపాం గిరిజన ఇంజనీరింగ్ కళాశాలలో 50 శాతం సీట్లను షెడ్యూల్ ప్రాంతంలోని ఎస్టీ విద్యార్థులకే కేటాయింపు.
- నిషేధిత కార్యకలాపాలకు పాల్పడుతున్న రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్డీఎఫ్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్టు)పై నిషేధం మరో ఏడాది పొడిగింపు.
- వ్యక్తుల గుర్తింపు కోసం ఆధార్ వినియోగంపై చట్టబద్ధత కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఆధార్ చట్టంపై బిల్లుకు కేబినెట్ ఆమోదం.
- ఏపీఐఐసీకి చెందిన 2 వేల ఎకరాల్లో రూ.2,190 కోట్లతో బల్క్ డ్రగ్ ప్రాజెక్టును ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. అయితే తొలుత అనుకున్నట్లు కాకుండా కాకినాడ నుంచి బల్క్ డ్రగ్ పార్క్ ప్రాజెక్టును అనకాపల్లి జిల్లా నక్కపల్లికి తరలిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ భూముల్లోనే ఈ ప్రాజెక్టు నెలకొల్పాలి. నక్కపల్లిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటంతో స్థలం మార్పు చేయడానికి మంత్రివర్గం ఆమోదించింది.

అభివృద్ధికి భూ కేటాయింపులు

- విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఎకరా స్థలాన్ని 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన కేటాయింపు.
- పల్నాడు జిల్లా మాచర్ల మండలం నాగులవరంలో 100.45 ఎకరాల భూమి ఏపీఐఐసీకి కేటాయింపు.
- గుంటూరుకు చెందిన విశ్వ మానవ సమైక్యతా సంసత్ విజ్ఞప్తి మేరకు ఎకరా రూ.లక్ష చొప్పున 7.45 ఎకరాల స్థలాన్ని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడిమిపాలెంలో మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రి నిర్మాణానికి కేటాయింపు.
- చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కృష్ణ, శ్రీకాకుళం, బాపట్ల, అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన భూ కేటాయింపులు.
- ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీకి కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఉచితంగా 2.41 ఎకరాల భూమి కేటాయింపు.
- సంస్కృతి, కళలు పెంపొందిస్తూ పర్యాటక ఆదాయాన్ని పెంచడంలో భాగంగా మధురవాడలో యూనిటీ మాల్ (కన్వెన్షన్ సెంటర్) నిర్మాణం.
- బాపట్ల, నాయుడుపేట, తణుకు మున్సిపాల్టీల పరిధిలో చదరపు మీటరుకు ఏడాదికి రూ.1 నామమాత్రపు అద్దె ప్రాతిపదికన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను డీబీఓటీ (డిజైన్, బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) విధానంలో నిర్వహించేందుకు అవసరమైన భూమి కేటాయింపు.

18.81 లక్షల గృహాల్లో వ్యక్తుల ఆరోగ్య వివరాల సేకరణ

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే

- సర్వేలో 20 లక్షలకు పైగా వైద్య పరీక్షల నిర్వహణ
- పరీక్ష ఫలితాలు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- ఈనెల 30 నుంచి స్పెషలిస్ట్ వైద్యులతో హెల్త్ క్యాంపులు
- ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తున్నారు. వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటిని పరిష్కరించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి స్పెషలిస్ట్ వైద్యులతో హెల్త్ క్యాంపులను వైద్యశాఖ ప్రారంభించనుంది. హెల్త్ క్యాంప్‌ల నిర్వహణ షెడ్యూల్‌కు అనుగుణంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చేపడుతున్నారు.

45 రోజుల పాటు హెల్త్ క్యాంపులు

ఈనెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హెల్త్ క్యాంప్‌లు ప్రారంభించనున్నారు. 45 రోజుల పాటు 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 500కు పైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలను కవర్ చేసేలా క్యాంప్‌లు నిర్వహిస్తారు. ప్రతీ క్యాంప్‌లో నలుగురు వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు.

18.81 లక్షల గృహాల్లో సర్వే

ఈనెల 16 నుంచి ఆరోగ్య సురక్ష సర్వేను మొదలు పెట్టారు. సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఇప్పటి వరకూ 18.81 లక్షల గృహాలను సందర్శించాయి. జ్వరం, బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధి బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. జ్వరం, బీపీ, షుగర్ లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దే చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకూ జరిగిన సర్వేలో 20 లక్షలకు పైగా పరీక్షలు నిర్వహించారు.

టోకెన్‌ల అందజేత

సర్వేలో భాగంగా వివిధ ఆరోగ్యపరమైన సమస్యలపై ఆరా తీసి, అవసరం మేరకు బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించిన అనంతరం టోకెన్ స్లిప్‌లు ఇస్తున్నారు. ఆ టోకెన్‌లో గ్రామం /పట్టణంలో హెల్త్ క్యాంప్ నిర్వహించే రోజు, స్థలం వంటి వివరాలు ఉంటాయి. అదే విధంగా సేకరించిన ప్రజల ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య సురక్ష యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా హెల్త్ క్యాంప్ నిర్వహించే రోజున ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా కేస్ షీట్‌లను తయారు చేస్తారు. ఆ కేస్ షీట్‌లో సంబంధిత వ్యక్తికి క్యాంప్‌లో అందజేసే వైద్యం, పరీక్షలు, వైద్యుడు సూచించే మందుల ప్రిస్క్రిప్షన్, ఇతర వివరాలన్నింటినీ నమోదు చేస్తారు.

కొనసాగుతున్న అల్పపీడనం

రెండ్రోజులు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలకు ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. అల్పపీడనం రానున్న 24 గంటల్లో ఛత్తీస్‌గఢ్ వైపు పయనిస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం నివేదికలో తెలిపింది. మరోవైపు రుతుపవన ద్రోణి రాజస్తాన్‌లోని జైసల్మేర్ నుంచి అల్పపీడన ప్రాంతం వరకు కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్రం మీదుగా పశ్చిమ, వాయవ్య గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రానున్న రెండు రోజులు ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో అనేక చోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.



ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- 58 లక్షల ఎకరాలు దాటిన పంటల సాగు
- తగ్గిన వేరుశనగ, పత్తి
- సాధారణ విస్తీర్ణంలోనే వరి, ఇతర పంటలు
- మొత్తంగా 70 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం

సాక్షి, అమరావతి: మూడు వారాలుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగు కాస్త ఊపందుకుంది. జూన్‌లో రుతుపవనాలు మొహం చాటేయడం.. ఆగస్టులో వర్షాల జాడే లేక కలవరపాటుకు గురైన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పుణ్యమాని ఊపిరి పీల్చుకుంటున్నారు. లోటు వర్షపాతం భర్తీ కావడంతో వేసిన పంటలను కాపాడుకోవడం తోపాటు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద 80 శాతం సబ్సిడీపై ఇస్తున్న విత్తనాలతో అవకాశం ఉన్నంత మేర పంటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా 58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు పూర్తయింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 65 లక్షల నుంచి 70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో 26 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మాత్రం స్వల్పంగా లోటు వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆ జిల్లాల్లో కూడా నెలాఖరు నాటికి లోటు వర్షపాతం భర్తీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

31 లక్షల ఎకరాలు దాటిన వరి నాట్లు

వరి సాధారణ విస్తీర్ణం 38.80 ఎకరాలు కాగా.. ఇప్పటికే 30.75 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. అపరాలు సాధారణ విస్తీర్ణం 7.87 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 4.20 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటిలో ప్రధానంగా 3.60 లక్షల ఎకరాల్లో కందులు, 40 వేల ఎకరాల్లో మినుములు సాగవుతున్నాయి. నూనెగింజల సాగు విస్తీర్ణం 17.40 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటికే 8.80 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వీటిలో ప్రధానంగా 7.35 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 97వేల ఎకరాల్లో ఆముదం పంటలు సాగయ్యాయి. ఇతర పంటల విషయానికి వస్తే 10 లక్షల ఎకరాల్లో పత్తి, 2.50 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 95 వేల ఎకరాల్లో చెరకు ఇతర పంటలు సాగవుతున్నాయి. గతేడాది సాగు విస్తీర్ణంతో పోల్చుకుంటే ఈసారి వేరుశనగ, పత్తి తగ్గాయి. వరి సహా ఇతర పంటలు సాధారణ విస్తీర్ణంలోనే సాగవుతుండగా.. ఆముదం, సోయాబీన్, చిరుధాన్యాల సాగు కాస్త పెరిగింది. పరిస్థితిని ముందుగా అంచనా వేసిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేసింది. తొలుత 5.15 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద 80 శాతం సబ్సిడీపై మరో 77,880 క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీకి సిద్ధం చేసింది. రైతులు 7,521 క్వింటాళ్ల విత్తనాన్ని ఇప్పటికే రైతులు తీసుకున్నారు.

లక్ష్యం దిశగా సాగు

సెప్టెంబర్‌లో కురుస్తున్న వర్షాలతో లోటు వర్షపాతం భర్తీ అయి సాధారణ స్థాయికి చేరుకుంది. 3 వారాల్లో 15 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వచ్చాయి. సీజన్ ముగిసే నాటికి కనీసం మరో 5 నుంచి 8 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద ఆర్బీకేల్లో 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయి. 8 లక్షల టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

జనసేన నేతకు 'సీఎం సాయం'

కరప: జనసేన పార్టీకి చెందిన ఓ కుటుంబానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. కాకినాడ జిల్లా కరప మండలం గొడ్డటిపాలెంకు చెందిన జనసేన నేత వీరంరెడ్డి ముత్యాలరావు కుమార్తె చంద్రకళ ఇంటర్ చదువుతోంది. తండ్రితో కలిసి ఆమె ఒక శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈ విషయాన్ని సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సింగిసీని వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే కన్నబాబుకు వివరించారు. ఆయన వెంటనే స్పందించి బుధవారం కాకినాడలోని తనక్యాంపు కార్యాలయంలో చంద్రకళ తల్లి సత్యకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. సంక్షేమ పథకాల అమల్లో రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణికంగా చూడాలన్న సీఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా బాధిత కుటుంబాన్ని ఆదుకున్నందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



చంద్రకళ తల్లి సత్యకు సీఎం సహాయనిధి చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

విశాఖలోనూ సీఎం క్యాంపు కార్యాలయం

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను గుర్తించేందుకు అధికారులతో ఒక కమిటీ వేస్తామని చెప్పారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు కార్యాలయాల తరలింపునకు అధికారులతో మరో కమిటీ వేస్తామన్నారు. దసరాలోగా కార్యాలయాలను తరలించి.. పండుగ రోజునే విశాఖ కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామన్నారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. అజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత మంత్రులతో సీఎం సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. దసరాను విశాఖలోనే జరుపుకుందామని మంత్రులతో సీఎం చెప్పారు. ఆ రోజు నుంచి విశాఖ కేంద్రంగా పాలన మొదలు పెడతామనడంతో మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు అక్రమాలను సాక్ష్యాధారాలతో వివరిద్దాం

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేయడంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. గురువారం నుంచి నిర్వహిస్తున్న శాసనసభ సమావేశాలను సీరియస్‌గా తీసుకోవాలని మంత్రులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. శాసనసభ వేదికగా అవసరమైతే టీడీపీ సర్కార్ హయాంలో స్కిల్ స్కామ్ నుంచి ఫైబర్ గ్రిడ్ కుంభకోణం వరకు అన్నింటిపై చర్చిద్దామన్నారు. టీడీపీ సభ్యులు శాసనసభ సమావేశాలకు హాజరవుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ అక్రమాలను సాక్ష్యాధారాలతోసహా ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా ప్రతిపాదిస్తున్న వన్ నేషన్.. వన్ ఎలక్షన్ విధానాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి మంత్రులు తీసుకెళ్లగా.. జమిలి ఎన్నికలపై కేంద్రం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూద్దామన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందామని పిలుపునిచ్చారు. ఎన్నికలకు మరో ఐదు నెలలు మాత్రమే సమయం ఉందనే అంశాన్ని మంత్రులకు సీఎం గుర్తు చేస్తూ.. ప్రజల్లో విస్తృతంగా తిరగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ 52 నెలలుగా మనం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి ఆశీర్వాదం కోరాలన్నారు.

సీఎం ఎక్కడి నుంచి పాలిస్తే అదే రాజధాని

దసరా నుంచి విశాఖపట్నం నుంచి పరిపాలన మొదలు పెడదామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. సీఎం ఎక్కడి నుంచి పరిపాలిస్తే అదే రాజధాని. వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నది మా విధానం. విశాఖపట్నంలో సీఎం కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు తగిన భవనాలను గుర్తించేందుకు అధికారులతో కమిటీ వేస్తామని సీఎం చెప్పారు. దసరా నుంచి విశాఖే పరిపాలన రాజధాని.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ మంత్రి



ఆయుధాలను ముందు సన్నద్ధం చేసుకోవడం.
సిద్ధంగా ఉండటమే సగం విజయం.
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 21 సెప్టెంబర్ 2023

కెనడా వక్రబుద్ధి

దశాబ్దాలుగా సక్రమంగా లేని భారత్–కెనడా దౌత్య సంబంధాల్లో మరోసారి పెను తుపాను రేగింది. ఎప్పటిలాగే ఈసారి కూడా కెనడా ప్రవర్తనే ఈ పొరపొచ్చాలకు కారణమైంది. ఖలిస్తానీ ఉద్యమకారుడు హర్దీప్ సింగ్ నిజ్జార్‌ను మొన్న జూన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపిన ఉదంతంలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అక్కడి పార్లమెంటులో ఆరోపించారు. అంతేకాక ఈ విషయంలో భారత హైకమిషన్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని ఆ దేశం బహిష్కరించింది. దీనికి ప్రతిచర్యగా మన దేశం కూడా ఢిల్లీలోని కెనడా హైకమిషన్‌లో పనిచేస్తున్న సీనియర్ దౌత్యవేత్తను దేశం విడిచివెళ్లాలని ఆదేశించింది. ట్రూడో ఆరోపణలు దురుద్దేశపూర్వకం, నిరాధారం అని కొట్టిపారేసింది. పనిలో పనిగా ఇరు దేశాలూ తమ తమ పౌరులకు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్ వెళ్లే కెనడా పౌరులు అప్రమత్తంగా ఉండాలని అక్కడి ప్రభుత్వం సూచిస్తే, కెనడా సందర్శించే భారత్ పౌరులపై ఉగ్రవాదుల దాడులు జరిగే ప్రమాదం ఉన్నదని మన దేశం హెచ్చరించింది. దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకోవటం వంటి ఉదంతాలు మనకు పాకిస్తాన్, చైనాలతోనే ఎక్కువ. 2013లో అమెరికాలోని న్యూయార్క్‌లో భారత్ డిప్యూటీ కాన్సుల్ జనరల్‌గా పనిచేస్తున్న దేవయాని ఖోబ్రగడే పట్ల అనుచితంగా ప్రవర్తించి సంకెళ్లు వేసి నిర్బంధించిన ఉదంతం తర్వాత మన దేశం అమెరికా దౌత్యవేత్తలకు అంతవరకూ ఉండే ప్రత్యేక సదుపాయాలను ఉపసంహరించింది.

గత కొంతకాలంగా కెనడాలో పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ప్రోద్బలంతో ఖలిస్తానీ ఉద్యమకారులు రెచ్చిపోతున్నారు. ఇదిలా కొనసాగితే ఇరు దేశాల దౌత్యసంబంధాలూ దెబ్బతినే ప్రమాదం ఉన్నదని దౌత్య నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఒక్క కెనడాయే కాదు... బ్రిటన్, ఆస్ట్రేలియాల్లో కూడా ఖలిస్తానీ ఉద్యమకారుల పోకడలు ఆందోళనకరంగానే ఉంటున్నాయి. భారత కార్యాలయాలపై, దేవాలయాలపై దాడులు, మన పౌరులను గాయపరచటం వంటి ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. హింసాత్మక ఘటనలకు కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని మన దేశం కోరుతున్నా అక్కడి ప్రభుత్వాల స్పందన అంతంతమాత్రం. ఉద్యమకారులపై చర్యలు తీసుకోవటం మాట అటుంచి ఏకంగా మన ప్రభుత్వంపైనే కెనడా నిందారోపణలకు దిగింది. పాశ్చాత్య దేశాలు తమకు ముప్పు ముంచుకొచ్చినప్పుడు తప్ప ఇతర సమయాల్లో ప్రజాస్వామ్యం గురించి ప్రవచిస్తుంటాయి. 2001లో ఉగ్రవాదులు తమ దేశంలో పెనువిధ్వంసం సృష్టించి, వందలాది మంది మరణానికి కారకులయ్యాక అమెరికా గ్వాంటనామో బేలో శత్రు దుర్భేద్యమైన జైలు నిర్మించి కేవలం ఉగ్రవాదులన్న అనుమానంతో దశాబ్దాల తరబడి ఎందరినో ఏకాంతవాసంలో నిర్బంధించింది. ఇప్పటికీ ఆ జైల్లో ఎలాంటి విచారణ లేకుండా ఎందరో మగ్గిపోతున్నారు. అలాంటి దేశాలు భారత్‌కు సూక్తులు చెబుతున్నాయి. నిఘా వ్యవస్థల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకొనేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్‌లు గతంలోనే 'ఫైవ్ అయిస్' (పంచ నేత్రాలు) పేరిట ఒక ఉమ్మడి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. ఖలిస్తానీ ఉద్యమకారుల ఆగడాల గురించి ఈ వ్యవస్థ వద్ద ఎలాంటి సమాచారం ఉందో తెలియదుగానీ... తాజాగా కెనడా చేసిన ఆరోపణలపై మాత్రం అందులోని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు 'ఆందోళన' వ్యక్తం చేశాయి. ఈమధ్యే న్యూఢిల్లీలో జీ–20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయినప్పుడు నిజ్జార్ ఉదంతాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చానని ట్రూడో అంటున్నారు. మోదీ సైతం ఖలిస్తానీ వాదుల ఆగడాలపై ఆయనను ప్రశ్నించారు. నిజ్జార్ కేసు ఇంకా దర్యాప్తు దశలోనే ఉంది. ఈలోగానే ట్రూడో అంత బాధ్యతారహితంగా ఎలా మాట్లాడారన్నది ఆశ్చర్యకరం.

మొదటినుంచీ కెనడా అంతర్గత రాజకీయాలు భారత్–కెనడా సంబంధాలను శాసిస్తున్నాయి. కెనడాలో భారతీయుల సంఖ్య దాదాపు 14 లక్షలు. ఇది కెనడా జనాభాలో 3.7 శాతం. అందులో సగం మంది సిక్కులు. కొన్ని నియోజకవర్గాల్లో సిక్కు ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం, వారిపై ఖలిస్తానీ ఉద్యమ ప్రభావం ఉండటం కెనడా రాజకీయాల్లో వారి ప్రాబల్యాన్ని పెంచింది. అందుకే కావొచ్చు...పంజాబ్‌లో 90వ దశకంలోనే అంతరించిన ఖలిస్తానీ ఉద్యమం ఇంకా అక్కడ సజీవంగా మనుగడలో ఉంది. 2021 ఎన్నికల్లో ట్రూడో నాయకత్వంలోని లిబరల్ పార్టీ మెజారిటీ సాధించలేక సిక్కు నేత జగ్మీత్‌సింగ్ నేతృత్వంలోని న్యూ డెమాక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ) మద్దతు తీసుకోవాల్సి వచ్చింది. అప్పటినుంచీ ఖలిస్తాన్ ఉద్యమకారుల విషయంలో కెనడా మరింత మెతకగా ఉంటోంది. కొత్తగా అమెరికా కనుసన్నల్లో ఏర్పాటైన ఇండో–పసిఫిక్ కూటమి తర్వాత భారత్‌తో భాగస్వామ్యం కోసం కెనడా తహతహలాడటం మొదలుపెట్టినా, ఖలిస్తానీ వాదులు ఆ ప్రయత్నాలను వమ్ము చేసేందుకు ఏదో ఒక ఎత్తుగడ వేస్తున్నారు. ఇప్పుడు హత్యకు గురైన నిజ్జార్ వివాదరహితుడేమీ కాదు. 2007లో పంజాబ్‌లోని ఒక సినిమా హాల్‌లో బాంబు దాడి మొదలుకొని ఇంతవరకూ 20 కేసుల్లో నిందితుడు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్. ఇతగాడే కాదు...అనేకమంది మాఫియా ముఠాల నేతలు కెనడాలో ఆశ్రయం తీసుకుంటూ భారత్‌లో నేరాలకు దిగుతున్నారు. వీరిని అప్పగించమని మన దేశం కోరుతున్నా కెనడా పెడచెవిన పెడుతోంది. కెనడా తీరుతెన్నులపై మన దేశం దౌత్య యుద్ధం సాగించాలి. జరుగుతున్నదేమిటో ప్రపంచ దేశాలకు వివరించాలి. కెనడాలో చదువులకూ, ఉపాధికీ వెళ్లిన మన పౌరుల ప్రయోజనాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి.

చరిత్ర అంటే బోర్డు మీది రాతా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

చరిత్ర అనేది బోర్డ్ మీద చాక్‌పీస్‌తో రాసిన రాత కాదు. ఎలా అంటే అలా చెరపడం, కొత్తది రాయడం కుదరదు. చరిత్ర తెలియనివాళ్లే ఇప్పుడు 'ఇండియా' స్థానంలోకి 'భారత్'ను తెస్తున్నారు. నిజానికి భారత్ అనే పదం ప్రాచీనమైనది కాదు. ప్రసిద్ధ చరిత్రకారులు తాము రాసిన చరిత్రకు 'ఇండియన్ హిస్టరీ' అనే పేరు పెట్టారు. వేదాల మీద ఆధారపడి చరిత్రను, సంస్కృతిని నిర్మించాలనుకునేవాళ్లు కేవలం వేదాల దగ్గరే ఇండియన్ హిస్టరీ ఉందనుకుంటున్నారు. అందువల్లే వారు భారతదేశ చరిత్రను కుదించాలని చూస్తున్నారు. అనేక భాషలు, సంస్కృతులు, జాతులు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యాంగ బద్ధమైన 'ఇండియా' నామవాచకాన్ని మార్చడం అహేతుకం.

కేంద్ర ప్రభుత్వం దేశాన్ని సంస్కృతీకరణకు గురి చేస్తోంది. దీనికి కారణం పాలకులకు భారతదేశ చరిత్ర తెలియకపోవడమే. నిజానికి భారత్ అనే పదం ప్రాచీనమైనది కాదు. ప్రసిద్ధ చరిత్రకారులు డి.డి. కోశాంబి, రొమిల్లా థాపర్, ఆర్.ఎస్. శర్మా, ఝా, బి.ఎస్.ఎల్.హనుమంతరావు వంటి వారంతా తాము రాసిన చరిత్రకు 'ఇండియన్ హిస్టరీ' అనే పేరు పెట్టారు. మనం ఒకసారి ప్రపంచ దేశాలలో ఉన్న లైబ్రరీలను వీక్షిస్తే... ముఖ్యంగా లండన్ మ్యూజియం లైబ్రరీలో హిస్టరీ మీద ఒక శాఖ ఉంటుంది. కన్నెమెరా లైబ్రరీ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. ప్రపంచ దేశాల నుండి పరిశోధకులందరూ అక్కడికి వస్తారు. అక్కడ ఇండియా అంటేనే స్పందిస్తారు. 'భారత్' శబ్దం ఎక్కడా కనపడదు.

యక్షులు, కింపురుషులు, గంధర్వులు భారతదేశంలో ప్రాచీన జాతులు. ఈనాటి దళితులు వారి వారసులే. వారు నదీ దేవతలను సృష్టించారు. వెన్నెలను ఆరాధించారు. ఆర్యులు అంతకుముందు ఉన్నటువంటి జాతుల మొత్తం వారసత్వాన్ని తమదిగా చెప్పుకొన్నారు. దళితులకు సంబంధించిన అనేక చారిత్రక అంశాలను ఆర్యులు సొంతం చేసుకున్నారు. మనది 'సింధూ నాగరికత' అంటారు. సింధూ శబ్దం అతి ప్రాచీనమైనది. ఇండియాలో మానవ జాతి పరిణామానికి సంబంధించిన ప్రాచీన పరిణామ దశలన్నీ దళితుల్లో కనిపిస్తున్నాయి. మోర్గాన్ చెప్పినట్టు మానవజాతి పరిణామంలో జీవనోపాధి, ఆహారం, పాలనాంగం, ప్రభుత్వం, భాష, కుటుంబం, మతం, గృహనిర్మాణం, సంపద కీలకపాత్ర వహిస్తాయి. ఈ దశలన్నీ దళితుల జీవన విధానంలో ఉండడం వలన, బి.ఆర్. అంబేడ్కర్ నిర్వచించినట్లుగా వీరు ఇండియన్స్ అనేది నిర్ధారణ అవుతుంది.

హిందువుల మత సాహిత్యంలో వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, సూత్రాలు, ఇతిహాసాలు, స్మృతులు, పురాణాలు ఉన్నాయి. వేద బ్రాహ్మణులు వేదాలకూ, ఇతర రకాల మత సాహిత్యానికీ మధ్య ప్రత్యేకత చూపాలని అభిప్రాయపడ్డారు. వేదాలను ఉన్నతమైనవిగా మాత్రమే కాకుండా పవిత్రమైనవిగా,



తిరుగులేనివిగా చేశారు. చరిత్రకు మూలమైన శాసనాలు, వ్రాత ప్రతుల వంటి వాటిని పేర్కొనకుండా కేవలం వేదాల మీద ఆధారపడి చరిత్రను, సంస్కృతిని నిర్మించాలనుకునే సనాతన భావజాలకర్తలు కేవలం వేదాల దగ్గరే ఇండియన్ హిస్టరీ ఉందనుకుంటున్నారు. అందువల్లే వారు భారతదేశ చరిత్రను కుదించాలని చూస్తున్నారు.

దక్షిణ భారత భాషల్లో ఏ భాషలోనూ భారత శబ్దం లేదు. ఇండియన్ లాంగ్వేజెస్ పుట్టు పూర్వోత్తరాల మీద కృషి చేసిన వారెవ్వరూ భారత్ శబ్దాన్ని పేర్కొనలేదు. నిజానికి తెలుగు, తమిళం, కన్నడం, మలయాళ భాషలకు మూలం ద్రావిడ భాషే. అయితే అవి 21 భాషలుగా అభివృద్ధి చెందాయి. వాఙ్మయ దృష్టితో కాకుండా, భాషా చారిత్రక దృష్టితో చూస్తే మధ్య ద్రావిడ ప్రాచీనమైనది. తెలుగు భాష ప్రభావం ఇప్పటికీ తెలుగు తెగలమీద ఉండటాన్ని గమనించాలి. ముఖ్యంగా కోయ భాషలో ఎన్నో తెలుగు పదాలున్నాయి. కోయ భాషమీద పరిశోధన చేసిన జె.కాయస్ ఈ విషయాన్ని చెప్పారు. కోయ జాతి అతి ప్రాచీనమైనదని సామాజిక శాస్త్ర చరిత్ర చెప్తున్న సత్యం. ఈ కోయ భాషలో విశేషంగా తెలుగు ఉండడం వల్ల రాతలేని తెలుగు అతి పురాతన కాలంలోనే ఉందని మనకు అర్థమౌతుంది. తెలుగు భాష ప్రాచీనతను తెలుసుకోవాలంటే, మనం తెలుగులో అతి ప్రాచీనులైన తెగలను పరిశీలించవలసిందే.

ఇకపోతే ఆంధ్రజాతిని నాగులుగా పిలవడం, నాగజాతికీ, ఆర్య జాతికీ ఉన్న వైరుధ్యం భారతంలో వర్ణించబడింది. ప్రసిద్ధ చరిత్రకారులు బి.ఎస్.ఎల్. హనుమంతరావు తన ఆంధ్రుల చరిత్రలో ఆంధ్రులు ఋగ్వేద కాలం నాటివారనీ, వారు నాగులుగా ఆర్యులతో పోరాడారనీ, ఖాండవ వన దహనం, సర్పయాగం తరువాత వింధ్య పర్వతాల ఇవతలికి వచ్చారనీ, వారే ఆంధ్రులుగా పిలువబడ్డారనీ రాశారు. నాగులకు, ఆర్యులకు జరిగిన తీవ్ర సంఘర్షణలో 'ఖాండవ దహనం', జనమేజయుడి 'సర్పయాగం' రెండు ముఖ్య ఘట్టాలు. ఈ ప్రమాదం నుండి తప్పించుకొన్న నాగులు దక్షిణంగా వలసవచ్చి కృష్ణా ముఖద్వారంలో స్థిరపడి ఉంటారు. అమరావతీ శిల్పాలలోని రాజులకు, రాణులకున్న సర్ప కిరీటాలు వారి జాతీయతకు చిహ్నాలే.

ఈ చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారత్ కంటే 'ఇండియా'యే పురాతనమైనది. భారత్ శబ్దం వలన ఇండియా తన ఐడెంటిటీని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది మనకు చాలా నష్టం. భారత దేశం, హిందూదేశం, ఇండియా... ఈ మూడు పేర్లలో జాతి, మత, లింగ, కుల, వర్ణ, ప్రాంతాలకు అతీతమైన పేరు ఇండియా. అంబేడ్కర్, ఫూలే, పెరియార్ ఈ దృక్పథంతోనే తమ గ్రంథాలు రాశారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ ఇండియాను వెనక్కి తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది వారికి కూడా నష్టమే. అందరికీ నష్టమే. చరిత్ర అనేది బోర్డ్ మీద చాక్‌పీస్‌తో రాసిన రాత కాదు. ప్రపంచం అంతా ఇండియా వైపు చూస్తున్నా, సంస్కృతీకరణ ద్వారా దేశీయ ప్రజలను అవమానిస్తున్నారు. అనేక భాషలు, సంస్కృతులు, జాతులు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యాంగ బద్ధమైన 'ఇండియా' నామ వాచకాన్ని మార్చడం అహేతుకం. దేశంలోని ప్రజాస్వామ్య, లౌకికవాద, సామ్యవాద శక్తులందరూ ఇండియాను బలపరుస్తున్నారు. అధిక జనుల అభిప్రాయమే చారిత్రక సత్యం. పేర్లు మార్చడం ద్వారా చరిత్ర మారదు.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మరో మాయ



ఎంత మాయ! మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పుడు అమల్లోకి రాదంటే, ఎప్పటికీ రాదనేది కచ్చితం. మనసుంటే మార్గముంటుంది.

– సయేమా, రేడియో జాకీ

దానికోసమైనా...



ప్రపంచంలోని అందరు మూర్ఖులనూ మనం పెంచి పోషించుకోవాలి. వాళ్లు లేకపోతే మనల్ని ఎవరూ తెలివైనవాళ్లుగా పరిగణించరు.

– రిక్కీ గెర్వాయిస్, కమెడియన్

పనికిరాని వాదం



రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం' అనే పదం అదనంగా చేరింది. మూలంలో అది లేదు. ఇది భారత రాజ్యాన్ని కొన్ని ఆర్థిక విధానాలను పాటించేలా బంధిస్తోంది. సామ్యవాదం అనేది ఇండియాకు ఏ మంచీ చేయలేదు. సామ్యవాదం చెడ్డ ఆర్థికశాస్త్రం. ఈ పదాన్ని ప్రవేశిక నుంచి పార్లమెంట్ తొలగించాలి.

– దిలీప్ మండల్, సంపాదకుడు

ఎంత క్షోభ!



ఇది హృదయాన్ని ముక్కలు చేస్తోంది. వారి కుటుంబం ఏం అనుభవిస్తున్నదో అవగతం చేసుకోలేకున్నాను. విజయ్ ఆంటోనీ సర్, ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక సానుభూతి. మీకు అపారమైన శక్తి కలగాలని ప్రార్థిస్తున్నాను. మీరా ఆత్మకు శాంతి కలగాలి.

– సాయి పల్లవి, నటి

మరింత రుచికరం



పదేళ్ల కింద ఈరోజు (2013 సెప్టెంబర్ 20) ఇండియాలో 'ద లంచ్‌బాక్స్' సినిమా విడుదలైంది. కేవలం విధివశాత్తూ ఎక్కిన ఈ రైలు నన్ను ఇప్పటికీ అన్ని మంచి స్టేషన్లకు తీసుకునిపోతూనే ఉంది. సువాసన పెరుగుతోంది, మరింత రుచికరం అవుతోంది, ప్రేమ తీవ్రమవుతోంది. సినిమా మ్యాజిక్ వర్ధిల్లాలి.

– నిమ్రత్ కౌర్, నటి

అక్కడే నయం



ఏమైనాగానీ, కఠిన సత్యం ఏమిటంటే, ఇండియాలోని కెనడియన్ కన్నా, కెనడాలోని భారతీయుడు మరింత సురక్షితం. చెప్పాలంటే, ఇండియాలోని ఇండియన్ కన్నా కూడా. ఎప్పటినుంచో వేర్పాటువాద తీవ్రవాదులు, బొద్దింకలకు కెనడా నిలయంగా మారినప్పటికీ ఇదే నిజం.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

చేజేతులా...



సాధారణంగా, ఆంగ్ల దేశాలన్నీ తమ ఉమ్మడి ప్రయోజనాల కోసం స్నేహంగా ఉంటాయి. కానీ ఇండియా విషయానికి వస్తే, (కెనడా ప్రధాని) ట్రూడోకు యూఎస్, యూకే, ఆస్ట్రేలియా పెద్దగా మద్దతివ్వలేదు. తన ఆరోపణలకు సాక్ష్యాలు చూపని కారణంగా సొంత దేశంలోనూ విమర్శ ఎదుర్కొంటున్నారు. అందుకే ఆయన వెనక్కి తగ్గుతున్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైంది. భారత్‌తో మంచి సంబంధాలు తిరిగి నెలకొల్పుకోవడం కష్టతరం.

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

లౌకికవాదానిదే అంతిమ విజయం

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా ఈ దేశంలో అంతిమ విజయం లౌకిక శక్తులకే చేకూరుతుంది. మతం పేరుతో ప్రజలను తాత్కాలికంగా విడదీసి ప్రయోజనం పొందిన పార్టీ(లు) ఓటమి చెంది అధికారాన్ని కోల్పోవడమూ మన ప్రజాస్వామ్య చరిత్రలో చూడవచ్చు. మన మహా నేతలు నిర్మించిన లౌకిక పునాదులే ఇందుకు కారణం. భారత రాజ్యాంగ పీఠికలో 'సెక్యులరిజం' (లౌకిక) అనే పదం చేర్చే విషయలో పెద్ద చర్చ జరిగింది. నెహ్రూ సోషలిస్టిక్ ప్రజాస్వామ్య భావాలు, అంబేడ్కర్ భారతీయాత్మ సెక్యులర్ పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చేట్టు చేశాయి.

'సెక్యులర్ స్టేట్ అంటే మతాతీత రాజ్యం. రాజకీయ నాయకులకు, పార్టీలకు కూడా మత విశ్వాసాలుండొచ్చు. నమ్మకాలుండొచ్చు. కాని అవి వ్యక్తిగతమైనవి. ఆయా వ్యక్తులూ లేదా పార్టీలూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు తమ నమ్మకాలను ఇతర విశ్వాసాలు కలిగి ఉన్న వారిపై బలవంతంగా రుద్దరాదు. నెహ్రూ ప్రధానిగా ఉన్నంతవరకు సెక్యులర్ పదం చాలావరకు దానికున్న అర్థంలోనే ఉపయోగించబడింది. నెహ్రూ తర్వాత భారతదేశంలో సెక్యులరిజం అనే పదానికి అర్థం మారింది. మతాతీత లౌకికరాజ్యం అనే అర్థం నుంచి అన్ని మతాలను సమానంగా గౌరవించడంగా మారింది. అన్ని విశ్వాసాలనూ ప్రోత్సహించడంగా మారింది.



తండ్రి నుంచి వచ్చిన ఆదర్శాలకు మరింత పదునుబెట్టి, ఇచ్చిన వాగ్దానాలను నూటికి నూరుపాళ్ళు నెరవేరుస్తూ... విలువలు గల రాజకీయాలకు శ్రీకారంచుట్టారు జగన్. విద్య, వైద్యం, సేద్యం, ఉద్యోగ కల్పన, సామాజిక అసమానతల తగ్గింపు లాంటి అనేక విషయాలలో విలువలు గల రాజకీయాలను నడుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక మార్పులు తీసుకొస్తున్నారు. ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన సెక్యులరిజాన్ని కూడా కాపాడుతున్నారు. అన్ని మతాల వారి విశ్వాసాలనూ సమానంగా గౌరవిస్తున్నారు. ఈ దేశంలో మైనారిటీలుగా ఉన్న బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ ఇతర మతాలకు చెందిన వారిలో 99 మంది దళిత, బహుజన, శూద్ర, అతి శూద్ర కులాలకు చెందినవారేనన్న అవగాహన జగన్‌కుంది. అందువల్ల అన్ని విశ్వాసాలనూ గౌరవిస్తూ, తిరుపతి లాంటి పుణ్య క్షేత్రాలను మరింత సౌకర్యవంతమైన యాత్రాస్థలాలుగా మారుస్తున్నారు. ఇవేవీ అధికారమే పరమావధిగా చూసే తెలుగుదేశం నాయకులకూ, ఏ కమిట్‌మెంట్‌లూ, రాజకీయ అవగాహన లేని జనసేన నాయకులకూ నచ్చవు. మత సెంటిమెంట్లను రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని చూసే బీజేపీకీ నచ్చదు. వీరంతా మైకులు పెట్టి రాష్ట్రమంతా తిరుగుతూ, మీడియా నుపయోగించుకుంటూ, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకొన్నారు.

జగన్‌కు దళిత బహుజన అణగారిన జాతులు మొదలుకొని హిందూ, మైనారిటీ మతస్థులందరి అభివృద్ధినీ కోరుకుంటారు. ఆయనకు కులాలు, మతాలు, ప్రాంతాలతో సంబంధం లేదు. అన్ని వర్ణాలు, ప్రాంతాలు సమతుల్యంగా అభివృద్ధి చెందడమే జగన్ ధ్యేయం. ఇవేవీ నచ్చని చంద్రబాబాదులు తిరుపతి కొండపైకి నడిచే అడవిలో చిరుత కనబడినా, తిరుమల–తిరుపతిల్లో ఏ ఇతర మతాల వాళ్ళు కనబడినా జగన్‌నే టార్గెట్ చేస్తూ విమర్శిస్తారు. మైనారిటీలను టార్గెట్ చేసి, మెజారిటీ ప్రజల్ని రెచ్చగొట్టి లౌకికత్వాన్ని భంగం చేసి అధికారంలోకి రావాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. అయినా ఆ పని చేయడానికి వెనుకాడరు చంద్రబాబు.

ఏదేమైనా లౌకిక విధానంలో మనిషి కేంద్రంగా పాలన చేస్తున్న జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సురక్షితంగా ఉంది. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తున్నారు జగన్. 14 ఏళ్ళ పాలనలో టీడీపీ, వివిధ రాష్ట్రాల్లో బీజేపీ చేసిందేంటో పరిశీలిస్తే వాళ్ళ మాటల్లోని డొల్లతనం అర్థమవుతుంది. అబద్ధపు ప్రచారాలతో, శుష్క వాగ్దానాలతో, మాటల గారడీతో గెలువాలని చూడటం చంద్రబాబుకు సాధ్యం కాని పని. మత సెంటిమెంట్లను రెచ్చగొట్టేవారితో టీడీపీ పొత్తుల కోసం వెంపర్లాడటం కళ్లముందు కనిపిస్తూనే ఉంది. వారి సహాయంతో జగన్‌పై గెలవాలనుకోవడం కల్ల. లౌకికవాదిగా ఎన్నటికీ విజయం జగన్‌దే!

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత | 91829 18567

ఆస్తులూ అప్పులే కాదు...

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

మునిమాపు వేళ రాజమండ్రిలోని తెలుగు విశ్వవిద్యాలయం (తెవివి), సాహిత్యపీఠంలో అడుగు మోపినపుడు మూడు దశాబ్దాల కిందటి జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. 'అదొక వైభవోజ్వల మహాయుగం... వల్లకాటి అధ్వాన్నశకం'. రెంటినీ ఇదే కళ్ళతో చూడాల్సి వచ్చినపుడు చరిత్ర, శిథిల బిందువులుగా బుగ్గల మీదకి జాల్వారింది. పాఠాలు చెప్పి, పరిశోధనకి చెయ్యందించి, సృజనకి తోవ చూపిన మహామహులైన గురుమిత్రులు, ఇక్కడ చదివి సాహిత్యకారులుగా పేరు పొందిన అనేకమంది విద్యార్థులు, పరిశోధకుల అడుగుజాడల కోసం రాపాడుతూ తిరిగాను. ఏముందక్కడ! ఒకపుడు యూనివర్సిటీ మెస్‌లో నలభీముడిలా అందరికీ వండి పెట్టిన వ్యక్తి ఈ రోజు వాచ్‌మాన్‌లా మారి ముఖద్వారం వద్ద నిస్తేజంగా కూచుని ఉండడం సమస్తాన్నీ అర్థం చేయించింది.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో షెడ్యూళ్లు 9–10లలో ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు, రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ సంస్థలు, విద్యాసంస్థల వంటివి ఉమ్మడిగా ఉన్నాయి. విభజన చట్టం ప్రకారం తొమ్మిదో షెడ్యూల్లోని 89 సంస్థలు, పదో షెడ్యూల్లోని 107 సంస్థలు కలిసి దాదాపు 200 సంస్థలని ఆస్తులూ అప్పులు, ఖర్చులు, మిగుళ్ళుగా రాష్ట్రాలు పంచుకోవాలి. మరొక ఎనిమిది నెలల్లో ఆ గడువూ ముగుస్తుంది. ఇప్పటివరకూ ఎన్ని పరిష్కారం అయ్యాయో తెలీదు. ఎన్ని సంస్థలు వాటి ప్రాభవాన్ని కోల్పోయాయో తెలీదు. ఇన్ని విభజన సమస్యల నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని సాహిత్యపీఠం ఉదాహరణ ఒకటి తీసుకున్నాను. సామాజిక శాస్త్రాలు విద్యారంగం నుంచి మెల్లగా తొలిగి పోతున్న వేళ తెలుగు భాషా సాహిత్యాలు, కళల కోసం ఒక యూనివర్సిటీ ఉండడం అనేది 1985 నాటికి అబ్బురంగా ఉండేది. ఉమ్మడిగా ఉన్నపుడు హైదరాబాద్ కేంద్రంగా తెవివిలోని అన్ని శాఖలూ ప్రభావవంతంగా పని చేశాయి.

రాజమండ్రి దగ్గర బొమ్మూరు మిట్టమీద ఉన్న సాహిత్యపీఠం గత తొమ్మిదేళ్లుగా నిర్వ్యాపకంగా మారి ఈరోజు మూసి వేయాల్సిన పరిస్థితికి వచ్చింది. 2014 నాటి రాష్ట్ర ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీని రాజమండ్రికి తరలించి ఇక్కడ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అప్పటి పుష్కరాల సందర్భంగా చెప్పింది. తరలింపు సంగతి సరే శ్రీశైలం, కూచిపూడి, బొమ్మూరు కేంద్రాల నిర్వహణ కూడా గగనం అయిపోయింది. రెండు రాష్ట్రాలలోని అన్ని తెవివి కేంద్రాల సాంకేతిక నిర్వహణ హైదరాబాద్ శాఖ చూసుకునేట్లు, ఏపీ శాఖల జీతభత్యాలు, ఇతర ఖర్చులు ఏపీ ప్రభుత్వం భరించేట్లు ఒప్పందం కుదిరింది. నిజంగా అప్పటి ఏపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఒప్పందంలోని లొసుగులను అర్థం చేసుకుని ఉండేది.



హైదరాబాద్ నగరం నడిబొడ్డున విలువైన స్థలంలో ఉన్న కేంద్రాన్ని మరోచోటికి తరలించడం మీద, తమ కేంద్రాల బాగోగుల మీద ఉన్న శ్రద్ధ, దూరాబారాన, అందునా ఏపీలో ఉన్న కేంద్రాల మీద తెలంగాణ ప్రభుత్వానికి ఉంటుందని ఆశించడమే ఒక తప్పు. సాంకేతిక నిర్వహణ అంటే సెమిస్టర్లు, పరీక్షలు, మార్కులు మాత్రమే కాదు, ఆయా కేంద్రాల ఉన్నతిని కాపాడుకోవడం, క్షీణిస్తున్నపుడు చేయందించి నిలబెట్టడం. అటువంటి బాధ్యతని హైదరాబాద్ కేంద్రం తీసుకుని ఉంటే ఈరోజు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని విద్యాసంస్థగా సాహిత్య పీఠం వెలికి గురయ్యేది కాదు, పట్టుమని పదిమంది విద్యార్థులు లేకుండా బోసిపోయేది కాదు. సినారె, నాయని కృష్ణకుమారి, తూమాటి దొణప్ప, బాలాంత్రపు రజనీ, ఆర్వీయస్ సుందరం, బేతవోలు, జయధీర్ తిరుమలరావు, ఎండ్లూరి వంటి ఉపాధ్యాయుల నుంచి అనేకమంది తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సాహిత్యకారులు, తాము విద్యార్థులుగా ఉన్నపుడు ఎంతో నేర్చుకున్నారు. తెలంగాణ ప్రాంతపు పరిశోధకులు విలువైన పరిశోధనా గ్రంథాలను ఈ కేంద్రం ద్వారా తీసుకువచ్చారు. తెలంగాణ సమాజం గర్వపడే 'తెలంగాణ సాహిత్య వికాసం' పరిశోధన బొమ్మూరు సాహిత్య పీఠంలోనే జరిగింది. ఇదే పద్ధతిలో ఏపీ నుంచి కూడా హైదరాబాద్, వరంగల్ కేంద్రాలలో చాలామంది చదువుకున్నారు. తమ వ్యక్తిత్వాలకి కొత్త పాదులు తీసిన యూనివర్సిటీల పట్ల విద్యార్థులకి చాలా కృతజ్ఞత ఉంటుంది. వాటి గురించి జీవితకాలం గొప్పగా చెప్పుకోవడం ఉంటుంది. అవి మరింత ఎదిగితే 'మేమిక్కడే చదివా'మని మురిసిపోవడం ఉంటుంది. మోడువారుతుంటే విలవిల్లాడటం ఉంటుంది. 9–10 షెడ్యూళ్లలో ఉన్నవి ఆస్తులూ అప్పులే కాదు, వాటి వెనుక బలమైన చారిత్రక అంశ ఉంటుంది. ఆర్థికమే అంతిమం కావొచ్చు కానీ యూనివర్సిటీలంటే ఇన్నేసి ఎకరాల ఆస్తి అని గర్వపడే విద్యార్థులు ఎవరూ ఉండరు.

సమాజపు ప్రగతిని కొలవడానికి విశ్వవిద్యాలయాల చరిత్ర కూడా చాలా ముఖ్యం. ఎంతో ప్రభావాన్ని చూపిన విశ్వవిద్యాలయ కేంద్రాలు మూతపడటం అంటే ఈ నిర్వహణలో భాగం అయిన ప్రతి వ్యవస్థకీ అవమానం, తిరోగమనం. నలభై యాభై ఎకరాల భూమి విలువ కన్నా వేలాది విద్యార్థులు సాహిత్య కళారంగాల్లో ప్రతిభావంతులు కావడమే సమాజానికి ఎక్కువ విలువైనది. ఏపీ శాఖలను మళ్ళీ నిలబెట్టే ప్రయత్నం 2024 తర్వాత కేవలం ఏపీ ప్రభుత్వానిదే కావొచ్చు. కానీ రెండు రాష్ట్రాల మధ్య 'తెవివి' లెక్క తేల్చాల్సి వచ్చినపుడు ఒప్పందం ప్రకారం హైదరాబాద్ కేంద్రానికి అప్పజెప్పిన నిర్వహణ బాధ్యతని ఎంత సమర్థవంతంగా చేశారన్న ప్రశ్నతో మొదలు పెట్టాల్సి ఉంటుంది.

వ్యాసకర్త బొమ్మూరు సాహిత్యపీఠం పూర్వ విద్యార్థి, పరిశోధకురాలు
malleswari.kn2008@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.10.09 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.50 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.20 నుండి 7.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.42 వరకు, తదుపరి ప.2.44 నుండి 3.32 వరకు, **అమృతఘడియలు:** రా.3.46 నుండి 5.20 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.57.

● తెలంగాణాకు చెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సతీమణి పాల్వాయి సృజనమణి (77) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 2017 జూన్ 18న మృతిచెందారు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం ల్యాదెల్ల గ్రామంలో నారాయణరెడ్డి- సరోజనమ్మల ఏకైక కూతురు సృజనను పాల్వాయి గోవర్ధన్‌రెడ్డికి ఇచ్చి 1962లో వివాహం జరిపించారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా సేంద్రీయ వ్యవసాయం

2.06 లక్షల హెక్టార్లలో సాగు / **ఇందులో మొత్తం 2.65 లక్షల మంది రైతులు** / **పరంపరాగత్ కృషి వికాస్ యోజన కింద వీరికి ఆర్థిక సాయం**

రైతులకు నేరుగా రూ.317.21 కోట్లు | కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడి

అత్యధిక విస్తీర్ణంలో సేంద్రీయ సాగు చేస్తున్న రాష్ట్రాలు ఇలా..

రాష్ట్రం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	2,06,000	2,65,000
మధ్యప్రదేశ్	1,75,560	1,91,400
ఉత్తరాఖండ్	1,40,540	2,24,250
రాజస్థాన్	1,23,000	3,07,500
ఛత్తీస్‌గఢ్	1,09,000	60,000



సాక్షి, అమరావతి: దేశంలో మిగతా రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్‌లో పరంపరాగత్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) కింద అత్యధికంగా సేంద్రీయ వ్యవసాయం కొనసాగుతోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. 2022–23 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలో పీకేవీవై కింద అత్యధికంగా 2.06 లక్షల హెక్టార్లలో 2.65 లక్షల మంది రైతులు సేంద్రీయ సాగు చేస్తున్నారని తాజాగా వెల్లడించింది. పీకేవీవై కింద రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.317.21 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ తర్వాత పీకేవీవై కింద అత్యధికంగా మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని తెలిపింది.

ఉత్పత్తి నుంచి విక్రయం వరకు మద్దతు..

ఈ పథకం కింద రైతులకు ఉత్పత్తి నుంచి విక్రయం వరకు మద్దతును అందిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రాసెసింగ్ సర్టిఫికేషన్ విధానం ద్వారా మార్కెటింగ్ కోసం అవసరమైన శిక్షణ ఇచ్చి రైతుల్లో సామర్థ్యాలను పెంచుతున్నట్లు పేర్కొంది. ప్రాసెసింగ్‌తో పాటు పంట కోత అనంతరం ఉత్పత్తుల నిర్వహణ, ప్యాకింగ్, మార్కెటింగ్ ఇలా వివిధ అంశాల్లో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు వివరించింది. క్లస్టర్ విధానంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. పీకేవీవై కింద సేంద్రీయ సాగు చేస్తున్న ఒక్కో రైతుకు హెక్టార్‌కు మూడేళ్లలో రూ.50 వేలు అందిస్తున్నట్టు వెల్లడించింది. ఇందులో ఆర్గానిక్ ఇన్‌పుట్‌ల కోసం రూ.31 వేలను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయనున్నట్లు వివరించింది. అలాగే మార్కెటింగ్, ప్యాకేజీ బ్రాండింగ్, విలువ జోడింపునకు రూ.8,800, సర్టిఫికేషన్‌కు రూ.2,700, అవసరమైన శిక్షణ, సామర్థ్యం పెంచేందుకు రూ.7,500 సాయం అందించనున్నట్లు తెలిపింది. సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రాలను ప్రోత్సహించడానికి పలు చర్యలను చేపట్టామని పేర్కొంది. యూరియా అధిక వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా సేంద్రీయ ఎరువులను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ సీజీఎంగా శేషాచలం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎం.శేషాచలం నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఆయన సీజీఎంగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్, బీఎస్ఎన్ఎల్‌లో విశేష అనుభవం ఉంది. గతంలో ఇస్రో సైంటిస్ట్‌గా పనిచేశారు. బీఎస్ఎన్ఎల్ ఆదాయం పెంచటానికి భారత్ నెట్ కనెక్షన్స్, ఎంటర్‌ప్రైజ్ బిజినెస్‌ను బలోపేతం చేయటంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సీజీఎం శేషాచలం తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని చెప్పారు. గత జూన్ 30న అప్పటి సీజీఎం బి.సురేష్‌కృష్ణ ఉద్యోగ విరమణ చేశారు. బి.రవికుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన నుంచి శేషాచలం బాధ్యతలు స్వీకరించారు.

శ్రీనివాసుని చిద్విలాసం..

● సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి వైభవం
● ఉదయం సింహ వాహనంపై..రాత్రి ముత్యపు పందిరిలో భక్తులకు అభయహస్తం


సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సింహ వాహనాన్ని అధిష్టించి యోగ నరసింహుడు రూపంలో శ్రీమలయప్ప స్వామి వారు ఊరేగారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 3 గంటల వరకు శ్రీవారి ఆలయంలో తిరుమంజనం సేవలో స్వామి వారు సేద తీరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పూటకో వాహనంలో ఊరేగుతూ అలసిన స్వామిని సేద తీర్చేందుకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రంగనాయక మండపాన్ని పుష్పాలతో అలంకరించి జీయర్లు, అర్చకుల నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పను సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. వైదికంగా పూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవరులకు రంగనాయకుల మండపంలో విశేష సమర్పణ జరిగింది. ఆలయం వెలుపల 1,000 నేతి దీపాల వెలుగులో సహస్ర దీపాలంకార సేవలో స్వామి వారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు. రాత్రి ముగ్ధమనోహర స్వరూపుడై శ్రీదేవి, భూదేవిలతో కలిసి ముత్యపు పందిరిలో శ్రీవారు సాక్షాత్కరించారు. ఉత్సవ శోభల్లో కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి.

22న రాత్రి 7 గంటలకే గరుడ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం నాడు రాత్రి 7 నుంచి 12 గంటల వరకు గరుడ వాహన సేవ జరగనుంది. ఈ నేపథ్యంలో తిరుమల 2 ఘాట్ రోడ్లలో 21వ తేదీ సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనాలకు అనుమతిని రద్దు చేశారు. పార్కింగ్ సరిపోయేంత వరకు ఇతర వాహనాలను తిరుమలకు అనుమతిస్తారు. తిరుమల వెళ్లే ప్రతి వాహనం కూడా ముందస్తు పాస్‌ను తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత వచ్చే వాహనాలన్నీ తిరుపతిలోనే కట్టడి చేసి అలిపిరి వద్ద పార్కింగ్ చేయడానికి టీటీడీ ఏర్పాట్లు చేసింది.

బోనులో చిక్కిన ఆరో చిరుత

● తిరుమల నడకదారిలో కొనసాగుతున్న ఆపరేషన్ చిరుత
● భక్తులు అధైర్యపడవలసిన అవసరం లేదు: భూమన కరుణాకరరెడ్డి


బోనులో చిక్కిన చిరుత

తిరుమల: అలిపిరి–తిరుమల నడకమార్గంలోని ఏడో మైలు వద్ద బుధవారం మరో చిరుత అటవీశాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. దీంతో ఇప్పటివరకు ఆరు చిరుతలు బోనులో పడ్డాయి. చిరుత సంచారాన్ని గుర్తించిన అటవీశాఖ అధికారులు గత వారం రోజులుగా దాన్ని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో బాలిక లక్షితపై దాడిచేసిన ప్రాంతంలోనే చిరుత బోనులో చిక్కింది. ప్రస్తుతానికి ఈ ప్రాంతంలోని చిరుతలన్నింటిని పట్టుకున్నట్లు టీటీడీ డీఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు. చిరుతను తిరుపతి జూపార్క్‌కు తరలిస్తామన్నారు. తిరుమల నడకదారిలో భక్తుల భద్రత కోసం నిరంతరం ఆపరేషన్ చిరుత కొనసాగిస్తామన్నారు. ఆరో చిరుత శాంపిల్స్‌ను తీసుకుని లక్షిత శాంపిల్స్‌తో పరీక్షలకు పంపే ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా ఇటీవల రెండు చిరుతలను అటవీ ప్రాంతంలో విడిచిపెట్టిన విషయం తెలిసిందే. అనంతరం అక్కడకు చేరుకున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బోనులో చిక్కిన చిరుతను పరిశీలించారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ... శ్రీవారి భక్తుల రక్షణార్థం టీటీడీ, అటవీశాఖ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. నడకమార్గంలో 24 గంటలు పర్యవేక్షణ కొనసాగుతుందని, భక్తులు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. కాగా అలిపిరి–తిరుమల నడకమార్గంలోని శ్రీ నరసింహస్వామి ఆలయం వద్ద కాలినడక మార్గంలో మంగళవారం రాత్రి ఎలుగుబంటి వచ్చింది. నడకమార్గంలోనే చాలాసేపు తిష్టవేసి వెళ్లిపోయింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ – సుకుమా జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలోని నహారీ, చోటీ మిద్మా, దుంగిన్‌పారీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో బీజాపూర్ జిల్లా అరణ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ బలగాలు మంగళవారం సాయంత్రం నుంచి సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున బలగాలకు కంటబడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరుపుతూ పారిపోవడానికి యత్నించారు. దీంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులు ప్రారంభించారు. సుమారు మూడు గంటల పాటు ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల తర్వాత మావోయిస్టులు పారిపోయారు.

తిరుపతిలో గోవింద కోటికి తొలి అడుగు

పుస్తకాలు పంపిణీ చేసిన టీటీడీ చైర్మన్


గోవింద కోటి వినాయకుడి సన్నిధిలో భూమన

తిరుపతి మంగళం: టీటీడీ ప్రవేశపెట్టిన గోవింద కోటి లిఖిత కార్యక్రమం ఆచరణలోకి తేవడానికి బుధవారం తొలి అడుగుపడింది. తిరుపతిలోని వినాయకసాగర్‌లో ఏర్పాటు చేసిన గోవింద కోటి వినాయకుడి సాక్షిగా ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి భక్తులకు గోవింద కోటి పుస్తకాలు పంపిణీ చేశారు. వినాయకుడు గోవింద కోటి రాస్తున్నట్లుగా తయారు చేసిన విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కోటి వినాయకుడికి టీటీడీ చైర్మన్ భూమన ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహం ఏర్పాటు చేసిన మండపం నలువైపులా గోవింద కోటి నామం రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, గోవింద కోటి వినాయక విగ్రహ కాన్సెప్టర్ శ్రీ కిషన్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల జాతీయ నూతన కార్యవర్గం


రణవీర్ శర్మను అభినందిస్తున్న ఇతర సభ్యులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు రణవీర్ శర్మ బుధవారం ప్రకటించారు. సెక్రటరీ జనరల్‌గా బి.మార్కండేయులు, ఉపాధ్యక్షులుగా టి.నాగేశ్వరరావు, కోశాధికారిగా డి.పద్మనాభుడు ఎన్నికైనట్లు చెప్పారు. ఈస్ట్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా రాకేష్ కుమార్, కార్యదర్శిగా సరోజ్ కుమార్, నార్త్ జోన్ అధ్యక్షుడిగా వికాస్ భరద్వాజ్, కార్యదర్శిగా రాజేంద్ర సింగ్ రాథోడ్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడిగా సనాతన్ లాకర్, కార్యదర్శిగా అలోక్ కసుంగో, నార్త్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా జైవీర్ సింగ్, కార్యదర్శిగా కామేష్ చంద్ర, సౌత్ జోన్ అధ్యక్షుడిగా పి.సుబ్రమణియన్, కార్యదర్శిగా జె.కె.ఎస్.పలని, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా కొవ్వూరు వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శిగా మహమ్మద్ సయాద్ ఖాన్‌లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ ప్రారంభం


స్ట్రయికింగ్‌కు సిద్ధమవుతున్న క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా(పీజీటీఐ) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ కోర్స్‌లో(ఈపీజీసీ) వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ–2023 ప్రారంభమైంది. భారత్‌తో పాటు విదేశీ ఆటగాళ్లు కలిపి మొత్తం 126 మంది ఈ టోర్నీలో తలపడుతున్నారు. నాలుగు రోజుల పాటు నాలుగు రౌండ్‌లుగా ఈ టోర్నీని నిర్వహించనున్నారు. తొలి రౌండ్ బుధవారం మొదలవ్వగా.. వర్షంలో సైతం క్రీడాకారులు పోటీపడ్డారు. తొలి రౌండ్‌లో ప్రముఖ భారత క్రీడాకారులు ఉదయన్ మానే, ఓం ప్రకాష్ చౌహాన్, అమన్‌రాజ్, సన్నిహిత్ బిష్ణోయ్, హర్షజీత్‌సింగ్ సేథీతో పాటు శ్రీలంకకు చెందిన ఎన్.తంగరాజు, మిథున్ పెరీరా, బంగ్లాదేశ్‌కు చెందిన బాదల్ హుస్సేన్, మహ్మద్ అక్బర్ హుస్సేన్, నేపాల్‌కు చెందిన సుక్ర బహదూర్ రాయ్, అండ్రాకు చెందిన కెవిన్, కెనడాకు చెందిన సుఖరాజ్‌సింగ్ గిల్, స్థానిక చాలెంజర్లు ఎస్.ముత్తు, రెహ్మాన్ షరీఫ్, కె.భరత్, కె.శ్రీనివాస్, ఎస్.నిశ్చింత్ పోటీపడ్డారు.

'క్యాంపెయిన్ విముక్తి' పేరుతో విద్యార్థుల సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న పోలా భాస్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో కళాశాల విద్యా శాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టి విద్యార్థులు సమగ్ర వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చెప్పారు. కళాశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో 'పెడల్ ఫ్రీడం ఫర్' పేరుతో చేపట్టిన సైకిల్ యాత్రకు బుధవారం గుంటూరు సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి శ్రీకారం చుట్టారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైకిల్ యాత్రను పోలా భాస్కర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..సీఎం జగన్ ప్రోత్సాహంతో కళాశాల విద్యా శాఖ, రాష్ట్ర సీఐడీ విభాగం, న్యాయ సలహా మండలి, రెడ్ రోప్ ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో 'క్యాంపెయిన్ విముక్తి' పేరుతో యాక్సెస్ టు జస్టిస్, ఉమెన్ ట్రాఫికింగ్, జీరో టోలరెన్స్ ప్రివెంటివ్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ వంటి అంశాలతో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. సీఐడీ జిల్లా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి త్వరలో వెబ్‌సైట్

ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



మహారాణిపేట(విశాఖ దక్షిణ): తెలుగు భాషాభివృద్ధికి అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో త్వరలో వెబ్‌సైట్ ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాష అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు చెప్పారు. బుధవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగు అధికార భాషకు ఇప్పటి వరకు ఎటువంటి వెబ్‌సైట్ లేదని, దాన్ని రూపొందించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తెలుగు భాష అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తెలుగు సాహిత్యానికి ఉత్తరాంధ్ర పుట్టినిల్లువంటిదని, ఇక్కడి నుంచి ఎంతో మంది కవులు, పండితులు, భాషాభిమానులు తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేశారని చెప్పారు. త్వరలో కవులు, పండితులు, భాషాభిమానులతో ఉత్తరాంధ్ర తెలుగు సాహిత్య సదస్సు నిర్వహిస్తామన్నారు. తిరుపతిలో ఆధ్యాత్మిక భాషోత్సవాలు, పల్నాడులో దళిత సాహిత్య ఉత్సవాలు, అనంతపురంలో అభ్యుదయ సాహిత్య ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ఏడీఎంఈగా సూర్యశ్రీ నియామకం

సాక్షి, అమరావతి: విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో అనస్తీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.సూర్యశ్రీని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఏడీఎంఈ)గా ప్రభుత్వం నియమించింది. ఈమెతో పాటు మరో 19 మంది ప్రొఫెసర్‌లకు ఏడీఎంఈ ప్రమోషన్‌లు కల్పించి వివిధ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులకు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్‌లుగా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంట్ కోసం కొత్త టారిఫ్

● ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ అభివృద్ధి కోసం కొత్త విధానం
● పరిగణనలోకి కేంద్రం ప్రతిపాదించిన టారిఫ్ బేస్డ్ కాంపిటేటివ్ బిడ్డింగ్
● వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేలా టారిఫ్‌ను తగ్గించే ప్రయత్నం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్సీ) టారిఫ్ బేస్డ్ కాంపిటేటివ్ బిడ్డింగ్ కింద ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్‌ల అభివృద్ధి కోసం థ్రెషోల్డ్ లిమిట్ రెగ్యులేషన్–2023ని రూపొందించింది. ఈ మేరకు విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 63 ప్రకారం.. కొత్త నిబంధనలతో డ్రాఫ్ట్ రెగ్యులేషన్‌ను కమిషన్ తయారు చేసింది. దీనిపై ఎవరికైనా సూచనలు, అభ్యంతరాలుంటే ఈ నెల 29లోగా తమ ప్రధాన కార్యాలయానికి మెయిల్ ద్వారా తెలియజేయాలని కోరింది. ఈ గడువు ముగిసిన తర్వాత డ్రాఫ్ట్ రెగ్యులేషన్ ఖరారు చేస్తామని కమిషన్ తెలిపింది. ఈ రెగ్యులేషన్ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ఏపీ ఈఆర్సీ పేర్కొంది.

రెండుసార్లు అడిగిన కేంద్రం

విద్యుత్ మంత్రిత్వ శాఖ 2021 మార్చి 15న ఒక లేఖ విడుదల చేసింది. ఇందులో ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ అభివృద్ధి కోసం టారిఫ్ బేస్డ్ కాంపిటేటివ్ బిడ్డింగ్(టీబీసీబీ)ని ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేసింది. టీబీసీబీ ద్వారా ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్‌లను అందించడానికి గరిష్ట పరిమితిని తెలియజేయాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 21న ఏపీ ఈఆర్సీకి మరో లేఖ పంపింది. వీటిని పరిగణలోకి తీసుకుని 2020–21 నుంచి 2023–24 వరకు నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏపీ ట్రాన్స్‌కో స్టేట్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీకి మంజూరైన పెట్టుబడి అనుమతులను కమిషన్ పరిశీలించింది. ఆమోదించిన 23 ప్రాజెక్ట్‌లలో 10 ప్రాజెక్ట్‌లు (43.5 శాతం) అమలు జరిగినట్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేలా ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను తగ్గించడం, జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాల్లో ట్రాన్స్‌మిషన్ సేవల కోసం ఇప్పటికే అమలులో ఉన్న టారిఫ్ బేస్డ్ కాంపిటేటివ్ బిడ్డింగ్ ప్రాజెక్ట్‌లను పరిగణనలోకి తీసుకోవడం, ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్‌ల అభివృద్ధిలో పోటీని ప్రోత్సహించే పవర్ మార్గదర్శకాల అభివృద్ధి కోసం కొత్త డ్రాఫ్ట్ రెగ్యులేషన్‌ను కమిషన్ తీసుకువస్తోంది.

క్లుప్తంగా...

ఎర్డోగన్ నోట.. కశ్మీర్ మాట

ఐక్యరాజ్యసమితి: తుర్కియే అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగన్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని పనిగట్టుకుని అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు. బుధవారం న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి 78వ సర్వ సభ్య సమావేశాల సాధారణ చర్చలో ఎర్డోగన్ మాట్లాడారు. 'భారత్, పాకిస్తాన్‌ల మధ్య సహకారం, చర్చల ద్వారా కశ్మీర్‌లో శాశ్వతంగా శాంతిని నెలకొల్పగలం. అప్పుడే దక్షిణాసియాలో శాంతి, సుస్థిరత, శ్రేయస్సుకు కొత్త బాటలు వేయగలం. ఈ దిశగా ముందడుగులు పడితే తుర్కియే తప్పకుండా తన వంతు తోడ్పాటును అందిస్తుంది' అని ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. వాణిజ్యం తదితర రంగాల్లో ఇరుదేశాల మైత్రి బంధం బలపడాలంటూ జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక చర్చల్లో మోదీతో ఎర్డోగన్ చర్చించిన రెండువారాల్లోనే ఆయన ఇలా విరుద్ధ ప్రసంగాలు చేయడం గమనార్హం. ఎర్డోగన్ అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. గత ఏడాది ఐరాస సర్వ ప్రతినిధి సభలోనూ కశ్మీర్ అంశంపై మాట్లాడారు. దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు సంబంధించిన అంశంపై ఇతర దేశాలు ఐరాస వంటి ప్రతిష్టాత్మక వేదికలపై ప్రస్తావించడాన్ని భారత్ గతంలోనే తీవ్రంగా ఖండించింది. అయినాసరే ఎర్డోగన్ తీరు మారకపోవడం గమనార్హం.

గణతంత్ర వేడుకలకు బైడెన్!

ఆహ్వానించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరిలో జరగబోయే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. ఈనెల రెండో వారంలో ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా బైడెన్‌తో ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ఆయనను రిపబ్లిక్‌డే వేడుకకు మోదీ ఆహ్వానించారని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి వెల్లడించారు.

కెనడాను వదిలేసి భారత్‌కు వెళ్లిపోండి

నిషేధిత ఖలిస్తానీ ఉగ్ర సంస్థ చీఫ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హత్యతో భారత్, కెనడా మధ్య రాజుకున్న ఆగ్రహ కుంపట్లను ఖలిస్తానీ వేర్పాటువాదులు మరింత రాజేస్తున్నారు. ఇండో–కెనడియన్ హిందువులు కెనడాను వీడి భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని నిషేధిత ఖలిస్తానీ వేర్పాటువాద సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) చీఫ్ గురుపత్వంత్‌సింగ్ పన్నూన్ హెచ్చరికలు జారీచేశారు. 'మీరంతా కెనడా దేశాన్ని, కెనడా రాజ్యాంగాన్ని అనుసరించట్లేదు. మీ గమ్యం భారత్. అందుకే మీరంతా కెనడాను వీడండి. భారత్‌కు తిరిగి వెళ్లండి' అంటూ గురుపత్వంత్ విడుదల చేసిన వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది.

కెనడాలో జాగ్రత్తగా ఉండండి

భారత ప్రభుత్వం సూచన

న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నజ్జర్ హత్యలో కెనడాలోని భారతీయ నిఘా వర్గాలకు పరోక్ష సంబంధాలు ఉన్నాయన్న కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలతో మొదలైన వివాదం పెరిగింది. దానికి కొనసాగింపుగా భారత విదేశాంగ శాఖ బుధవారం ఒక అడ్వైజరీని విడుదలచేసింది. కెనడాలో ఉంటున్న భారతీయ పౌరులు, అక్కడికి వెళ్లాలనుకునే భారతీయ కమ్యూనిటీ ప్రజలనుద్దేశిస్తూ ఈ అడ్వైజరీని విడుదలచేసింది. 'కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, రాజకీయ ప్రేరేపిత విద్వేష నేరాలు, హింస పెరిగిన నేపథ్యంలో కెనడాకు వెళ్లాలనుకునేవారు, అక్కడే ఉంటూ వేరే చోట్లకు ప్రయాణించాలనుకునే భారతీయులు జాగ్రత్తగా ఉండండి' అని అడ్వైజరీ పేర్కొంది.

ట్రూడో ఆరోపణలు తీవ్రమైనవే: అమెరికా

న్యూయార్క్: ఖలిస్తానీ ఉగ్రవాది హత్యోదంతంలో భారతీయ నిఘా వర్గాల పాత్రపై అమెరికా జాతీయ భద్రతా మండలి ఉన్నతాధికారి స్పందించారు. 'కెనడా పౌరుడైన నిజ్జర్ హత్యతో భారతీయ నిఘా వర్గాలకు సంబంధం ఉందంటూ కెనడా ప్రధాని ట్రూడో చేస్తున్న ఆరోపణలు నిజంగా తీవ్రమైనవి. ఈ వివాదం ముగిసిపోవాలంటే సమగ్ర, విస్తృతస్థాయి దర్యాప్తు అవసరం. కెనడా ఇప్పుడు అదే పనిలో ఉంది. ఇందుకు భారత్ సైతం పూర్తి సహాయ సహకారాలు అందించాలని మేం కూడా కోరుకుంటున్నాం' అని అమెరికా జాతీయ భద్రతా మండలి సమన్వయ కర్త(వ్యూహాత్మక సంబంధాలు) జాన్ కిర్బీ సీఎన్ఎన్ వార్తాసంస్థ ముఖాముఖిలో వ్యాఖ్యానించారు.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్‌కు విముక్తి

న్యూఢిల్లీ: 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్ల ఉదంతంలో ఒక వ్యక్తి మరణానికి సంబంధించిన కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్‌ను ఢిల్లీ కోర్టు బుధవారం నిర్దోషిగా ప్రకటించింది. ఢిల్లీలోని సుల్తాన్‌పురిలో సుర్జీత్ సింగ్ మరణం, సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్, వేద్ ప్రకాశ్, బ్రహ్మానంద్ గుప్తాలపై కేసు నమోదైంది. ఈ కేసును జడ్జి గీతాంజలి గోయల్ విచారించారు. 'ఈ కేసులో సజ్జన్, వేద్, గుప్తాల ప్రమేయం ఉందన్న ఆరోపణలను ప్రాసిక్యూషన్ వారు నిరూపించలేకపోయారు. సంశయ లాభం కింద ఈ ముగ్గురినీ నిర్దోషులుగా ప్రకటిస్తున్నాం' అంటూ జడ్జి తన తీర్పును వెలువరించారు. పలు సెక్షన్ల మీదా సజ్జన్‌పై గతంలో కేసు నమోదైంది. 1984లో నాటి ప్రధాని ఇందిరను సిక్కు భద్రతా సిబ్బందే కాల్చి చంపడంతో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి.



నారీశక్తి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బుధవారం పార్లమెంట్ ఆవరణలో (వరసగా ఎడమ నుంచి కుడికి) అమరావతి ఎంపీ నవనీత్ కౌర్, బీజేపీ ఎంపీ కేశరి దేవి పటేల్, బీజేపీ ఎంపీ పూనమ్ మహాజన్, బాక్సర్ మేరీ కోమ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మాజీ అథ్లెట్ అంజూ జార్జ్, సినీ నటి భూమి పడ్నేకర్



బిల్లు ఆమోదం పొందాక విజయసంకేతం చూపిస్తున్న బీజేపీ ఎంపీలు రితి పాఠక్ తదితరులు

మహిళా బిల్లుకు జై

▶ మొదటి పేజీ తరువాయి

ఓబీసీ మహిళా కోటా గురించి ప్రశ్నించారు. ఈ రిజర్వేషన్లను వెంటనే అమల్లోకి తీసుకురావాలన్న డిమాండ్లు సైతం వినిపించాయి. చర్చ అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 454 మంది సభ్యులు ఓటు వేయగా, ఇద్దరు ఎంపీలు వ్యతిరేకంగా ఓటేశారు. ఓటింగ్ ప్రక్రియలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. చర్చ అనంతరం అదే రోజు ఓటింగ్ నిర్వహిస్తారు. ఎగువ సభలోనూ బిల్లు ఆమోదం పొందడం లాంఛనమే. అనంతరం రాష్ట్రపతి సంతకంతో మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చనుంది. జన గణన, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాత 2029 నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఓటింగ్ జరిగిందిలా..

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉండటంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్లిప్‌ల ద్వారా ఓటింగ్ నిర్వహించారు. మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ జరిగింది. ఎరుపు, ఆకుపచ్చ రంగు స్లిప్‌లను సభ్యులకు అందజేశారు. ఓటు ఎలా వేయాలో లోక్‌సభ సెక్రెటరీ జనరల్ వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపితే ఆకుపచ్చ స్లిప్‌పై 'ఎస్' అని రాయాలని, వ్యతిరేకిస్తే ఎరుపు రంగు స్లిప్‌పై 'నో' అని రాయాలని చెప్పారు. ఆ ప్రకారమే ఓటింగ్ జరిగింది. బిల్లుకు మద్దతుగా 454 ఓట్లు, వ్యతిరేకంగా కేవలం 2 ఓట్లు వచ్చాయి. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. ఆ పార్టీకి లోక్‌సభలో ఓవైసీతోపాటు మరో ఎంపీ సయ్యద్ ఇంతియాజ్ జలీల్(ఔరంగాబాద్) ఉన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా వారిద్దరూ ఓటేసినట్లు తెలుస్తోంది.

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా పార్టీలకతీతంగా మహిళా ఎంపీలు బిల్లుకు ఏకగ్రీవంగా జై కొట్టారు. లోక్‌సభలో 82 మంది మహిళా ఎంపీలుండగా బుధవారం చర్చలో 27 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. అందరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడారు. అయితే, బిల్లు ఆలస్యంగా అమలయ్యే అంశాన్ని ప్రధానంగా తప్పుబట్టారు.

చాలా సంతోషంగా ఉంది: ప్రధాని మోదీ

బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. పార్టీలకతీతంగా బిల్లుకు మద్దతు ఇచ్చిన ఎంపీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'ఇది చరిత్రాత్మక చట్టం అవుతుంది. ఈ చట్టంతో మహిళా సాధికారతకు ప్రోత్సాహం లభిస్తుంది. రాజకీయ వ్యవస్థలో మహిళామణుల భాగస్వామ్యం ఎన్నో రెట్లు పెరుగుతుంది' అని మోదీ ట్వీట్‌చేశారు.

ఈ బిల్లుతో సవర్ణ మహిళలకే మేలు

మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఈ బిల్లుతో అగ్ర వర్ణాల మహిళలకే మేలు జరుగుతుంది. పార్లమెంట్‌లో అతి తక్కువ ప్రాతినిధ్యం ఉన్న ఓబీసీ, మైనార్టీ మహిళలకు ఈ రిజర్వేషన్లలో ప్రత్యేకంగా కోటా కల్పించకపోవడం దారుణం. దేశ జనాభాలో ముస్లిం మహిళలు 7 శాతం ఉన్నారు. లోక్‌సభలో వారి సంఖ్య కేవలం 0.7 శాతమే ఉంది. లోక్‌సభలో సవర్ణ మహిళల సంఖ్య పెంచాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటోంది. ఓబీసీ, మైనార్టీ మహిళలు ఈ సభలో ఉండడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. ఆయా వర్గాల మహిళలను మోదీ సర్కారు దగా చేస్తోంది

- అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం పార్లమెంట్ సభ్యుడు

తక్షణమే అమలు చేయండి

మహిళా బిల్లుపై సోనియా

- కాంగ్రెస్ పూర్తి మద్దతు, కానీ...
- ఓబీసీలకూ మూడో వంతు వర్తించాలి
- కుల గణన జరిపి తీరాలి
- లోక్‌సభ చర్చలో డిమాండ్

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ మోదీ సర్కారు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు కాంగ్రెస్ పూర్తిగా మద్దతిస్తుందని ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటించారు. అయితే జన గణన, డీ లిమిటేషన్ వంటివాటితో నిమిత్తం లేకుండా బిల్లును తక్షణం అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. అలాగే మూడో వంతు రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా వర్తింపజేయాలన్నారు. బుధవారం లోక్‌సభలో మహిళా బిల్లుపై చర్చను విపక్షాల తరఫున ఆమె ప్రారంభించారు. రిజర్వేషన్ల అమలులో ఏ మాత్రం ఆలస్యం చేసినా అది భారత మహిళల పట్ల దారుణ అన్యాయమే అవుతుందని అన్నారు. 'కుల గణన జరిపి తీరాల్సిందే. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్. ఇందుకోసం తక్షణం కేంద్రం చర్యలు చేపట్టాలి' అని పునరుద్ఘాటించారు. రాజకీయాలతో పాటు వ్యక్తిగతాన్నీ, భావోద్వేగాలను కూడా రంగరిస్తూ సాగిన ప్రసంగంలో సోనియా ఏమన్నారంటే...

'దేశాభివృద్ధిలో మహిళల పాత్రను సముచితంగా గుర్తుంచుకునేందుకు, కృతజ్ఞతలు తెలిపేందుకు ఇది సరైన సమయం. అందుకే, నారీ శక్తి విధాన్ అధినియమ్‌కు కాంగ్రెస్ పార్టీ పరిపూర్ణంగా మద్దతిస్తుంది. దాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలి. ఆ దారిలో ఉన్న అడ్డంకులను తలగించాలి'.

వంటింటి నుంచి అంతరిక్షం దాకా...

'మసిబారిన వంటిళ్ల నుంచి ధగధగా వెలిగిపోతున్న స్టేడియాల దాకా, అంతరిక్ష సీమల దాకా భారత మహిళలది సుదీర్ఘ ప్రయాణం. అటు పిల్లలను కని, పెంచి, ఇటు ఇల్లు నడిపి, మరోవైపు ఉద్యోగాలూ చేస్తూ అంతులేని సహనానికి మారుపేరుగా నిలిచింది మహిళ. అలాంటి మహిళల కష్టాన్ని, గౌరవాన్ని, త్యాగాలను సముచితంగా గుర్తించినప్పుడు మాత్రమే మానవతకు సంబంధించిన పరీక్షలో మనం గట్టెక్కినట్టు'.



లోక్‌సభలో మాట్లాడుతున్న సోనియా

స్వాతంత్య్ర పోరులోనూ నారీ శక్తి

'దేశ స్వాతంత్య్ర సంగ్రామంలోనూ, అనంతరం ఆధునిక భారత నిర్మాణంలో కూడా భారత మహిళలు పురుషులతో భుజం కలిపి సాగారు. కుటుంబ బాధ్యతల్లో మునిగి సమాజం, దేశం పట్ల తమ బాధ్యతలను ఎన్నడూ విస్మరించలేదు. సరోజినీ నాయుడు, సుచేతా కృపాలనీ, అరుణా అసఫ్ అలీ, విజయలక్ష్మీ పండిట్, రాజ్‌కుమార్ అమృత్ కౌర్, ఇంకా ఎందరెందరో మహిళామణులు మనకు గర్వకారణంగా నిలిచారు. గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేడ్కర్ తదితరుల ఆకాంక్షలు నెరవేర్చడంలో తమ వంతు పాత్ర పోషించారు'.

మహిళా శక్తికి ప్రతీక ఇందిర...

ఇక దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వ్యక్తిత్వం భారత మహిళల శక్తి సామర్థ్యాలను తిరుగులేని ప్రతీకగా ఇప్పటికీ నిలిచి ఉంది. వ్యక్తిగతంగా నా జీవితంలో ఇది చాలా ముఖ్యమైన సందర్భం. మహిళలకు స్థానిక సంస్థల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ నా జీవిత భాగస్వామి, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ తొలిసారిగా రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. కానీ రాజ్యసభలో ఆ బిల్లును కేవలం ఏడు ఓట్లతో ఓడించారు. అనంతరం పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పాస్ చేయించింది. ఫలితంగా నేడు 15 లక్షలకు పైగా మహిళలు దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ప్రతినిధులుగా రాణిస్తున్నారు'.

రాజీవ్ కల.. అప్పుడే సాకారం

'చట్ట సభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ కల సగమే నెరవేరింది. బిల్లు ఆమోదం పొందినప్పుడే అది పూర్తిగా సాకారవుతుంది. నేనో ప్రశ్న అడగాలనుకుంటున్నా. భారత మహిళలు తమ రాజకీయ బాధ్యతలను తలకెత్తుకునేందుకు 13 ఏళ్లుగా వేచిచూస్తున్నారు. ఇప్పుడు కూడా వారిని ఇంకా ఆరేళ్లు, ఎనిమిదేళ్లు... ఇలా ఇంకా ఆగమంటూనే ఉన్నారు. భారత మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన సరైనదేనా?'

రాజ్యంగ పీఠికలో 'లౌకిక, సామ్యవాద' మాయం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీలకు పంపిణీ చేసిన రాజ్యాంగ పీఠిక ప్రతుల్లో లౌకిక(సెక్యులర్), సామ్యవాద(సోషలిస్ట్) అనే పదాలు మాయమయ్యాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అధిర రంజన్ ఆరోపించారు. ఆ పదాలు తొలగించడం వెనుక బీజేపీ ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఈ అంశంపై పలువురు ప్రతిపక్ష నేతలు సైతం స్పందించారు. వివాదంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వివరణ ఇచ్చారు. ఎంపీలకు అందించిన ప్రతులు ఒరిజినల్ రాజ్యాంగ పీఠికకు సంబంధించినవని తెలిపారు. సెక్యులర్, సామ్యవాది పదాలను రాజ్యాంగ సవరణ ద్వారా తర్వాత చేర్చారని గుర్తుచేశారు.

ఇంకెంతకాలం నిరీక్షణ

మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం కాదు. ఇది మహిళల పట్ల పక్షపాతం, అన్యాయాన్ని తొలగించడానికి ఉద్దేశించినది. మహిళలకు ప్రత్యేకంగా వందనాలు అవసరం లేదు. అందరితోపాటు సమాన గౌరవాన్ని పొందాలని మహిళలు కోరుకుంటున్నారు. మహిళా కోటాను అమలు చేయడంలో జాప్యం తగదు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలవుతాయనడం సరైంది కాదు. ఇంకా ఎంత కాలం నిరీక్షించాలి? రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం సాధ్యమే



- కనిమొళి, డీఎంకే ఎంపీ

ఓబీసీ కోటా సంగతేంటి?

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ప్రత్యేక కోటా కల్పించాలి. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయకపోతే పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చి బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముంది? ఇది పోస్టు–డేటెడ్ చెక్కులాగా ఉంది. ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ఈ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేయాలి. మహిళా రిజర్వేషన్లను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కచ్చితమైన తేదీ, టైమ్‌లైన్‌ను ప్రభుత్వం ప్రకటించాలి. దేశంలో ప్రస్తుతం కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో కరువు నివారణ చర్యలపై చర్చించాలి



- సుప్రియా సూలే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ

బడుగు వర్గాల మహిళలకు భాగస్వామ్యం కావాలి

మహిళా రిజర్వేషన్లలో వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు భాగస్వామ్యం కల్పించాల్సిందే. ఈ మేరకు అవసరమైతే చట్టంలో సవరణలు చేయాలి. బడుగు వర్గాల మహిళలకు న్యాయం చేకూర్చాలి.



- డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ

మహిళలను తప్పుదోవ పట్టిస్తున్నారు

మహిళా రిజర్వేషన్ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళలను తప్పుదోవ పట్టిస్తోంది. ఈ రిజర్వేషన్లను రాబోయే ఎన్నికల్లో అమలు చేయకుండా జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. అధికార బీజేపీ నాయకులు మహిళలపై ఎన్నో నేరాలకు పాల్పడ్డారు. వారిపై ఎలాంటి చర్యలకు తీసుకోలేదు. దేశంలో గత ఐదేళ్లలో మహిళలపై నేరాలు 26 శాతం పెరిగినప్పటికీ మోదీ ప్రభుత్వం స్పందించడం లేదు



- హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, శిరోమణి అకాలీదళ్ ఎంపీ

మహిళా సాధికారతను అడ్డుకోవద్దు

మహిళా రిజర్వేషన్లలో మైనార్టీలకు కోటా కల్పించాలనడం అర్థరహితం. మతపరమైన రిజర్వేషన్లపై రాజ్యాంగం నిషేధం విధించింది. చట్ట ప్రకారం.. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. వెంటనే అమలు చేయాలని కోరడం సమంజసం కాదు. ఎవరైనా సరే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించాల్సిందే. మహిళా సాధికారతను అడ్డుకోవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నా



- స్మృతి ఇరానీ, కేంద్ర మంత్రి, బీజేపీ నేత

40 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో మా పార్టీ మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. కేవలం 33 శాతం కాదు, కేంద్ర ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ఈ విషయంలో మీకు చేతనైతే మమ్మల్ని(తృణమూల్ కాంగ్రెస్)ను పట్టుకోండి చూద్దాం



- కకోలీ ఘోష్-దస్తీదార్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ

పేరును 'రీషెడ్యూలింగ్ బిల్లు' అని పెడితే పోలా?

ఈ బిల్లు ఒట్టి మాయ. షెడ్యూల్ ప్రకారం ఫలానా తేదీకల్లా అమల్లోకి వస్తుందని చెప్పలేము. అలాంటప్పుడు ఈ బిల్లుకు మహిళా రిజర్వేషన్ రీషెడ్యూలింగ్ బిల్లుగా మారిస్తే సరిపోతుంది' అని తృణమూల్ కాంగ్రెస్ మహిళా నేత మహువా మొయిత్రా సభలో ఎద్దేవా చేశారు. ఇదంతా పెద్ద గిమ్మిక్కు.

- టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా

ఓబీసీ కోటా లేకుంటే అసంపూర్ణమే: రాహుల్



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పూర్తి మద్దతు తెలిపారు అయితే, ఓబీసీలకు కూడా మూడో వంతు రిజర్వేషన్ కోటా లేని పక్షంలో మహిళా బిల్లు అసంపూర్ణమేనని అభిప్రాయపడ్డారు. బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కుల గణన జరిగి తీరాల్సిందేనని కూడా రాహుల్ డిమాండ్ చేశారు. ఆయన ఏమన్నారంటే... 'మొత్తం 99 మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల్లో ఓబీసీలు కేవలం ముగ్గురే ఉన్నారు. బడ్జెట్లో కేవలం 5 శాతం మీద మాత్రమే వారికి నియంత్రణ ఉంది. వెనకబడ్డ వర్గాలకు ఇది నిజంగా ఘోర అవమానమే. ప్రస్తుత బిల్లు పెద్ద ముందడుగు. కానీ మహిళా రిజర్వేషన్ల అమలును జన గణన, డీ లిమిటేషన్‌తో ముడి పెట్టడం చిత్రంగా ఉంది. చిత్తశుద్ధి ఉంటే దీన్ని నేటినుంచే అమల్లోకి తేవచ్చు. చూస్తుంటే అదానీ అవినీతి వంటి సమస్యలు, కేంద్రం వైఫల్యాల నుంచి జనం దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఈ బిల్లును తెర మీదికి తెచ్చినట్టు కనిపిస్తోంది.

రాష్ట్రపతికి భాగస్వామ్యం ఏదీ?

'పార్లమెంటు కొత్త భవనం చాలా బాగుంది. నేలపై, కుర్చీలపై నెమళ్లు, నెమలీకలు చిత్రించారు. కానీ ఈ భవన ప్రారంభ సంరంభంలో రాష్ట్రపతి కూడా పాల్గొంటే బాగుండేది. ఏమంటే ఆ పదవిలో ఉన్నది ఒక మహిళ. పైగా ఆదివాసీ మహిళ. ఇక కులగణన నుంచి జనం దృష్టి మళ్లించేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోంది. దీనికి ఎందుకు వెనకాడుతున్నారో అర్థం కావడం లేదు. దేశంలో ఎందరు ఓబీసీలకు, ఎస్సీలు, ఎస్టీలు, ఆదివాసీలు ఉన్నది తేలాలి. ఇందుకు కులగణనే మార్గం.

ఏకగ్రీవ ఆమోదానికి కలిసి రండి

లోపాలుంటే తర్వాత సరిచేసుకోవచ్చు

- విపక్షాలకు అమిత్ షా విజ్ఞప్తి
- ఎన్నికలు కాగానే కుల గణన, డీ లిమిటేషన్

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందేందుకు కలిసి రావాల్సిందిగా విపక్షాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బిల్లులో లోపాలేమన్నా ఉంటే తర్వాత సరిచేసుకుందామని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన జోక్యం చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. బిల్లు అమలులో అలస్యానికి సంబంధించి కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. మహిళలకు రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయన్న సంకేతాలిచ్చారు. ఓబీసీలకు బీజేపీ పాలనలో అన్యాయం జరుగుతోందన్న విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చారు. వారికి తమ హయాంలోనే అన్నింటా అత్యధిక ప్రాతినిధ్యం దక్కిందని చెప్పారు. 'రాబోయే ఎన్నికల తర్వాత కేంద్రంలో వచ్చే నూతన ప్రభుత్వం వెంటనే జన గణన, నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంది. పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదానికి ఇది ఐదో ప్రయత్నం. ఇప్పుడు కాంగ్రెస్ లేవనెత్తిన అడ్డంకులను అధిగమించేందుకు వారి హయాంలో ఎందుకు ప్రయత్నించలేదు? అందుకే గత నాలుగు సార్లూ బిల్లును ఆమోదించలేని పార్లమెంటు తీరుతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. అందుకే ఈసారైనా ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించుకుందాం' అని విపక్షాలను అమిత్ షా కోరారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

రాహుల్ పై విసుర్లు

90 మంది కేంద్ర కేబినెట్ కార్యదర్శుల్లో ముగ్గురు మాత్రమే ఓబీసీలు ఉన్నారన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలను అమిత్ ఎద్దేవా చేశారు. 'కార్యదర్శులు దేశాన్ని నడుపుతారన్నది నా సహచర ఎంపీ అవగాహన! కానీ నాకు తెలిసినంత వరకూ ప్రభుత్వమే దేశాన్ని నడుపుతుంది. విధాన నిర్ణయాలు చేసేది కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్' అన్నారు. 'ఎవరో స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన చీటీలను సభలో చదవడం గొప్ప కాదు. ఓబీసీల అభ్యున్నతికి ప్రధాని మోదీ చిత్తశుద్ధితో కృషి చేశారు' అన్నారు. 'బీజేపీ ఎంపీల్లో దాదాపు 29 శాతం మంది ఓబీసీలే. దేశవ్యాప్తంగా 27 శాతానికి పైగా బీజేపీ ఎమ్మెల్యేలు, 40 శాతానికి పైగా ఎమ్మెల్సీలు ఓబీసీలే' అని అమిత్ అన్నారు.

అప్పుడు కేంద్రాన్నే నిందిస్తారు!

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమల్లోకి తేవాలన్న విపక్షాల డిమాండ్‌ను అమిత్ షా తోసిపుచ్చారు. 'రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్, అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్ అధినేత) ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ లోక్‌సభా స్థానాలు ఒకవేళ మహిళలకు రిజర్వ్ అయితే రాజకీయాలు చేస్తోందంటూ అందుకు మళ్లీ మోదీ సర్కారునే నిందిస్తారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజనను సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ సారథ్యంలోని కమిషన్ పూర్తి పారదర్శకంగా చేపడుతుంది' అన్నారు.

క్లుప్తంగా...

చేసిన పాపాలే చంద్రబాబును జైల్లో కూర్చోబెట్టాయి

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సాక్షి, అమరావతి: వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తూ చంద్రబాబు చేసిన పాపాలు స్కిల్ స్కామ్ రూపంలో జైల్లో కూర్చోబెట్టాయని సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ విమర్శించారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫైబర్ నెట్, అమరావతి భూ కుంభకోణం, టిడ్కో ఇళ్లు, పోలవరం దోపిడీలో చంద్రబాబు విచారణ ఎదుర్కోక తప్పదన్నారు. చంద్రబాబు ఎన్నికల అఫిడవిట్‌లో 9 క్రిమినల్ కేసులు ఉంటే అన్నింటిలోనూ స్టేలు తెచ్చుకున్నారన్నారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టుతో ప్రజా స్పందన లేకపోవడంతోనే టీడీపీ నాయకులు యాక్టర్ పవన్ కళ్యాణ్‌ను తెరపైకి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి కాబట్టే కేంద్ర దర్యాప్తు సంస్థలు స్కిల్ స్కాంలో నిందితులకు నోటీసులు జారీ చేశాయన్నారు. 2004 తర్వాత అధికారంలో లేని చంద్రబాబు హైదరాబాద్ మొత్తాన్ని తానే నిర్మించానని ఎలా చెప్పుకుంటారని నిలదీశారు.

అరెస్ట్ భయంతోనే లోకేశ్ ఢిల్లీ వదలట్లేదు: నందిగం సురేశ్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల సొమ్ము దోచుకున్న చంద్రబాబు జైలుకెళ్లడంతో.. ఆయన తనయుడు లోకేశ్‌కు అరెస్టు భయం పట్టుకుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేశ్ అన్నారు. అందుకే ఆయన ఢిల్లీని వదలట్లేదని విమర్శించారు. బుధవారం ఢిల్లీలో సురేశ్ మీడియాతో మాట్లాడారు. రాజధాని పేరుతో చంద్రబాబు భారీ కుంభకోణానికి పాల్పడ్డారని 2019 ఎన్నికలప్పుడు చెప్పిన పవన్‌కళ్యాణ్.. ఇప్పుడు అదే అవినీతిపరుడి పక్కన నిల్చున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌ను అరెస్టు చేయాలని ఆనాడు పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజల నుంచి సానుభూతి రాకపోవడంతో టీడీపీ నేతలు పెయిడ్ ఆర్టిస్టులతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

పదో రోజుకు బాబు జైలు జీవితం

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు జైలు జీవితం పదో రోజుకు చేరింది. ఎప్పటిలాగే ఆయన దినచర్య సాగింది. ఈ సందర్భంగా రాజమండ్రిలోని చంద్రబాబు కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. నిర్మాత ఆదిశేషగిరిరావు, కాంగ్రెస్ పార్టీ ఏపీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్‌లు భువనేశ్వరిని పరామర్శించారు. అలాగే గిద్దలూరుకు చెందిన టీడీపీ నేత అహ్మద్ బాషా బాబు అరెస్టును ఖండిస్తూ గిద్దలూరు నుంచి అరగుండుతో రాజమండ్రి వచ్చి భువనేశ్వరిని పరామర్శించారు.

బాబు అరెస్టుతో బీజేపీకి సంబంధం లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



ఏలూరు (టూటౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో కేంద్రంలోని బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అయినా ఆయన అరెస్టు సమర్థనీయం కాదన్నారు. ఏలూరులో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఏలూరులో వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, పేదలకు ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ చేపట్టామన్నారు. ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు చేసుకునే పొత్తుల గురించి ఇప్పుడే మాట్లాడలేమన్నారు. పవన్ కళ్యాణ్ వెళ్లి మాట్లాడిన తర్వాత బీజేపీ అధినాయకత్వం దీనిపై నిర్ణయాన్ని ప్రకటిస్తుందన్నారు. ఇప్పటికీ జనసేనతో కలిసే ఉన్నామని స్పష్టం చేశారు.

హనుమాన్ జంక్షన్‌లో అయ్యన్న

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి బుధవారం విచారణ నిమిత్తం హాజరయ్యారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా గత నెల 22న గన్నవరం బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్, మంత్రి రోజాపై అయ్యన్నపాత్రుడు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఇటీవల అయ్యన్నపాత్రుడికి సీఆర్‌పీసీ 41 సెక్షన్ కింద సంజాయిషీ కోరుతూ నోటీసులు అందజేశారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణతో కలిసి అయ్యన్నపాత్రుడు హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య, సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి దాదాపు రెండు గంటలపాటు అయ్యన్నపాత్రుడిని విచారించారు. యువగళం బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై ఆయన నుంచి న్యాయవాదులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు.

న్యాయ ప్రక్రియ అందరికీ సమానమే

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు.. 'రూల్ ఆఫ్ లా' చర్చావేదికలో న్యాయ నిపుణులు



చర్చావేదికలో మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వీసీ సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: రాజ్యాంగం ప్రకారం న్యాయ ప్రక్రియ అందరికీ సమానమేనని, కానీ ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతోనే మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు జరిగిందని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై గానీ, న్యాయమూర్తులపై గానీ విమర్శలు చేయడం తగదన్నారు. 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్' అనే అంశంపై వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో చర్చా వేదిక నిర్వహించారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎల్‌యూ) తొలి వైస్ ఛాన్సలర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ అత్యాశ ఒక స్థాయి దాటిపోతే అవినీతికి దారితీస్తుందని, ఇది సమాజానికి పెను ప్రమాదమన్నారు. ప్రజాసేవలో ఉన్నవారు పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ కలిగి ఉండాలన్నారు. దివంగత వైఎస్సార్ తన సుపరిపాలనతో చరిత్రలో నిలిచిపోతారన్నారు. కొందరు ప్రముఖులు తమ పీఏలు, అనుచరుల ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని డీఎస్ఎల్‌యూ తొలి రిజిస్ట్రార్ ఎ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఒక ప్రముఖ ప్రజా ప్రతినిధి అవినీతి కేసులో అరెస్టయితే నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారని, అదే సామాన్యుడి విషయంలో మాత్రం అలా జరగదన్నారు. ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు రూల్ ఆఫ్ లా ఒకేలా ఉండాలన్నారు. రూల్ ఆఫ్ లా కొంతమందికి అర్థం కావడం లేదని, అర్థమైన వారు కులాలు, పార్టీలుగా విడిపోతున్నారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నో కేసులున్నా అక్కడ ఆందోళనలు జరగడం లేదని గుర్తు చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కుమారుడిపై కూడా అసత్య సమాచారం ఇచ్చారంటూ కేసు నమోదైందని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ కంటే జీఎస్టీ పాత్రే ఎక్కువగా ఉందన్నారు. 68 మంది సాక్షుల వాంగ్మూలాన్ని రికార్డు చేసి సమగ్ర ఆధారాలతోనే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందని చెప్పారు. అవినీతికి పాల్పడితే ఎంతవారైనా చర్యలుంటాయన్న నమ్మకాన్ని ప్రజలకు కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐడీ అన్ని ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేసి రూల్ ఆఫ్ లాను పాటిస్తే ఒకవర్గం మీడియా, ఒక సామాజికవర్గం కక్ష సాధింపు అంటూ దుష్ప్రచారం చేస్తోందని సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. సీఐడీ వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. రూల్ ఆఫ్ లా విషయంలో పాలకులు, గత పాలకులు, ప్రజాప్రతినిధులు అతీతులు కారని వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో పలువురు మాజీ సీఎంలు అరెస్టయ్యారని, చంద్రబాబు అరెస్టు కొత్త కాదని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జి.సుబ్బారావు పేర్కొన్నారు. చర్చా వేదికలో న్యాయవాది జార్జి బంగారి తదితరులు పాల్గొన్నారు.

బాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నందున విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఆయన తరపు జూనియర్ న్యాయవాది కోర్టును కోరారు. శుక్రవారానికి వాయిదా వేయాలని చంద్రబాబు తరపు న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోరారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యుద్ధభేరి పేరుతో చంద్రబాబు చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు విధ్వంసానికి దిగాయి. ఈ విధ్వంసాన్ని చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగించాయి. పుంగనూరు ఘటనలో 40 మందికి పైగా పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. అంగళ్లు ఘటనపై ముదివేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

నాడు అవినీతిపరుడన్నావ్.. ఇప్పుడెలా మద్దతిస్తున్నావ్..?

- పవన్ కళ్యాణ్‌పై కాపు సామాజికవర్గ నేతల ధ్వజం
- 2019లో బాబు అవినీతిపై ప్రచారం చేశావు
- నేడు అవినీతి కేసులో అరెస్టయిన బాబుకు మద్దతా?
- కాపు జాతిని అవమానించిన బాబుకు మద్దతును సమర్థించం
- కాపు జాతికి మేలు జరిగేలా ఈసారి ఎన్నికల్లో కాపులు నిర్ణయం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాపు నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నాలుగేళ్ల క్రితం చంద్రబాబు అవినీతిపరుడు అని చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. ఇప్పుడు రూ.371 కోట్ల స్కిల్ కుంభకోణం కేసులో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లిన అదే చంద్రబాబుకు మద్దతివ్వడంపై కాపు సామాజికవర్గ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు అవినీతిపై పవన్ ఊరూ వాడా ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబుకు మద్దతు పలకడం పవన్ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని తెలిపారు. పైపెచ్చు రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి చంద్రబాబును పరామర్శించడం, అనంతరం వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని పవన్ ప్రకటించడాన్ని తప్పుపట్టారు. భవిష్యత్ రాజకీయాలపై చర్చించేందుకు బుధవారం ఇక్కడ కాపు సామాజికవర్గ నేతలు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాపు సామాజికవర్గ నాయకుడు జొన్నాడ నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సామాజిక వర్గానికి చెందిన ఇంజినీర్లు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు సహా పలు రంగాలకు చెందినవారు పాల్గొని, వారి అభిప్రాయాలను స్పష్టంగా వెలిబుచ్చారు. పవన్ సింగిల్‌గా వస్తే మద్దతు ఇస్తామని, కేవలం చంద్రబాబును సీఎం చేసేందుకు, ఆయన మోచేతి నీళ్లు తాగుతూ, చెప్పినట్టల్లా ఆడతానంటే మద్దతిచ్చేందుకు కాపులు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కాపుల నుంచి ముఖ్యమంత్రి అవుతాడనే ఉద్దేశంతోనే అప్పుడు ప్రజారాజ్యంలో చిరంజీవికి, ఇప్పుడు పవన్‌కు కాపు సామాజికవర్గం మద్దతిస్తోందని చెప్పారు. ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు ఉందని, సమయం మించి పోలేదని, ఒంటరిగా పోటీ చేస్తే కాపుల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సామాజికవర్గ ప్రముఖులు అయ్యల సత్యన్నారాయణ, పెద్దిరెడ్డి సతీష్, చిట్నీడి సత్తిరాజు, వైద్యులు డాక్టర్ అన్నాబత్తుల శేషు, డాక్టర్ గుండ్రాజ సుమంత్, లాయర్ పెద్దిరెడ్డి భావన్నారాయణ, రిటైర్డ్ ఎస్సై మొల్లేటి నాగేశ్వరరావు, చిత్తూరి శ్రీరామ్‌కుమార్ తదితరులు చెప్పారు. ఆనాడు ప్రజారాజ్యం, ఇప్పుడు జనసేన రెండు పార్టీలూ కాపు సామాజిక వర్గం ఆశలపై నీళ్లు చల్లుతున్నాయని విమర్శించారు. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని పవన్ స్పష్టత ఇవ్వడంతో కాపులు ఈసారి ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకుని సామాజికవర్గానికి మేలు జరిగేలా చూడాలని అన్నారు. వంగవీటి మోహన్ రంగా హత్యలో కీలక సూత్రధారి, పాత్రధారి అయిన చంద్రబాబుకు ఎలా మద్దతిస్తావని పవన్‌ని ప్రశ్నించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబంపై కక్ష కట్టి ఇంట్లో మహిళలను సైతం దుర్భాషలాడుతూ నడిరోడ్డుపై కొట్టుకుంటూ తీసుకెళ్లిన చంద్రబాబును సీఎం చేయడానికి ఎందుకు తహతహలాడుతున్నావని నిలదీశారు. చంద్రబాబు వల్ల కాపు జాతికి జరిగిన అవమానాలు, అన్యాయాలు ఏ ఒక్కరూ మర్చిపోలేదని చెప్పారు. కార్యక్రమంలో వీరా సూర్యనారాయణ, గుండ్రు సాయిబాబా, గడుసుకూటి శ్రీనివాస్, చిక్కం రాజబాబు, సన్నాల జగదీష్, సత్తి బాబు, కొవ్వూరి సంతోష్, కట్రోతు సాయిమణితేజ, అరిగెల విశ్వశ్రీరావు, విశ్వనాధుని పవన్‌సాయి, ఇక్కుర్తి జయదీప్ పాల్గొన్నారు.

బాబు అరెస్ట్‌ను స్వాగతిస్తూ భారీ ర్యాలీ



భారీ ర్యాలీ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): చంద్రబాబు అరెస్టును స్వాగతిస్తూ సీఎం ప్రోగ్రామ్స్ కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వన్ సెంటర్, గుప్తా కల్యాణ మండపం వీధి మీదుగా పంచాయతీ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న మహిళలు, యువతీయువకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు 'చెట్టు మీద కొంగ చంద్రబాబు దొంగ', 'ఏ1 స్కిల్డ్ క్రిమినల్ చంద్రబాబు దగ్గర దొంగ సొమ్ము రాబట్టాలి' అని ప్లకార్డులు ప్రదర్శించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసి దొరికిపోయిన గజదొంగ చంద్రబాబని, ఆయన శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. తప్పు చేసి దొరికి పోయిన చంద్రబాబును అరెస్ట్ చేస్తే నిరసనలు చేయడం సిగ్గుచేటన్నారు. మహిళలను అడ్డం పెట్టుకుని సీఎం జగన్‌ను తిట్టించడం బుద్ధిమాలిన చర్య అని అన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ ఐటీవింగ్ కోఆర్డినేటర్ వి. తిరుపతిరావు, పార్టీ సీనియర్ నాయకులు చిన్ని, శివాజీ, ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, నాయకులు దనేకుల చౌదరి, రవితేజ, జాస్తి జగన్, తిప్పరమల్లి అశోక్‌కుమార్, గ్యారా సుమన్‌కుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కుంభకోణం బాబు ఆలోచనల నుంచే

అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన సంబంధీకులే

- ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది
- పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు
- నిందితుడు న్యాయస్థానాన్ని శాసించలేడు
- 5 రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ న్యాయవాదులు
- కోర్టును శంకించేలా కౌంటర్ దాఖలు చేసిన చంద్రబాబు న్యాయవాదులు
- కేసును తాము విచారించడంపై అభ్యంతరం ఉందా? అని ప్రశ్నించిన న్యాయస్థానం
- తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదన్న బాబు న్యాయవాదులు
- నేడు తీర్పు వెలువరిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగిశాయి. దాదాపు మూడున్నర గంటల పాటు వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం దీనిపై గురువారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అంతకు ముందు సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చంద్రబాబు ఆలోచనల నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం పుట్టిందని కోర్టుకు నివేదించారు. దీనికి సంబంధించిన ప్రతి విషయం ఆయనకు తెలుసని, ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబుతో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులేనని నివేదించారు. తమ వద్ద ఉన్న ఆధారాలను దగ్గర పెట్టుకుని చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో 24 గంటల్లో దర్యాప్తు పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. చంద్రబాబును తాము (సీఐడీ) విచారిస్తే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, అదే తాము విచారించకుంటే దర్యాప్తునకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కాబట్టే చంద్రబాబు పోలీసు కస్టడీని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నిందితుడు కోర్టును అలా చేయడానికి వీల్లేదు, ఇలా చేయడానికి వీల్లేదని శాసించలేడన్నారు. నిందితుడు ముందు న్యాయం మోకరిల్లరాదని, ఒకవేళ అలా జరిగితే వ్యవస్థ కుప్పకూలినట్లేనన్నారు. విచారణలో మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉందని, అయితే విచారణకు సహకరించాల్సిన బాధ్యత కూడా నిందితుడిపై ఉందని కోర్టుకు నివేదించారు. ఈ కుంభకోణాన్ని రాజకీయ కారణాలతో వెలికి తీసినట్లు చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి దీన్ని పుణె జీఎస్టీ అధికారులు వెలికి తీశారని తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలను జీఎస్టీ అధికారులు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం (టీడీపీ సర్కారు) దృష్టికి తెచ్చారని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా దారి మళ్లించారో వివరించారని చెప్పారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నామమాత్రపు చర్యలతో జీఎస్టీ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని తొక్కిపెట్టిందని తెలిపారు. ఆ తరువాత షెల్ కంపెనీల గుట్టు రట్టు కావడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి వాటితో సంబంధం ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాయని చెప్పారు. ఐటీ శాఖ నోటీసులు ఇవ్వగానే చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు విదేశాలకు పారిపోయారని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఇలాంటి కేసును రాజకీయ ప్రేరేపితం, కక్ష సాధింపు అనడం దారుణమన్నారు. చంద్రబాబు పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఒకటిన్నర సంవత్సరం పట్టిందని, దీన్ని బట్టి ఎంత పకడ్బందీగా ఈ కుంభకోణానికి వ్యూహరచన చేశారో అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. చంద్రబాబును విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు.

మేం సర్టిఫై చేయాల్సిన అవసరం లేదు..

ఏసీబీ కోర్టు కేసు విచారణ మొదలు కాగానే సీఐడీ కస్టడీ పిటిషన్‌లో చంద్రబాబు దాఖలు చేసిన కౌంటర్‌ను పరిశీలించింది. అందులో కోర్టును శంకించేలా పేర్కొన్న అంశాలపై అభ్యంతరం తెలిపింది. చంద్రబాబు న్యాయవాదుల తీరుతో ఒకింత మనస్తాపం చెందిన కోర్టు.. ఈ కేసును తాము విచారించడంపై మీకేమైనా అభ్యంతరం ఉందా? అంటూ సీఐడీ న్యాయవాదులను ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం విచారణ జరుపుతున్న నేపథ్యంలో తమకు అభ్యంతరం లేదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. ఇదే ప్రశ్నను చంద్రబాబు తరఫు న్యాయవాదులను కోర్టు అడిగినప్పటికీ వారు మౌనంగా ఉన్నారు. అయినప్పటికీ కోర్టు మరోసారి అడగటంతో.. తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఒకింత తీవ్ర స్వరంతో బదులిచ్చారు. దీంతో కోర్టు విచారణను ప్రారంభించింది.

ఇప్పుడు కస్టడీ కోరడం ఏమిటి?

చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే అన్ని ఆధారాలు సేకరించామని, వాటి ఆధారంగా చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపాలని సీఐడీ మొదటి రోజే కోర్టును కోరిందని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు సేకరించినప్పుడు ఇప్పుడు తిరిగి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఏముందన్నారు. స్కిల్ కేసులో 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 2023లో చంద్రబాబును అరెస్ట్ చేసిందని, ఇంత కాలం సీఐడీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. వారి అలసత్వానికి చంద్రబాబును కస్టడీకి కోరడానికి వీల్లేదన్నారు. 45 ఏళ్లుగా చంద్రబాబు కాపాడుకుంటూ వచ్చిన ప్రతిష్టను కాలరాసేందుకే సీఐడీ ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరుతోందన్నారు. సిట్ కార్యాలయంలో చంద్రబాబును విచారిస్తున్న సమయంలో దర్యాప్తు అధికారులు ఆ వివరాలను మీడియాకు లీక్ చేశారని తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్యే కాబట్టి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈ కేసు మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసును విచారించే పరిధి ఏసీబీ కోర్టుకు లేదన్నారు.

పరిధి లేకుంటే ఎందుకీ పిటిషన్లు?

దీనికి సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ వివేకానంద తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు.. ప్రజా ప్రతినిధులు నిందితులుగా ఉన్న కేసుల్లో చార్జిషీట్ దాఖలైన తరువాత ట్రయల్ మొదలు పెట్టి విచారణ కొనసాగించేందుకు మాత్రమే ఉద్దేశించినవన్నారు. రిమాండ్ విషయంలో ఆ కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. ఒకవేళ ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేదని భావిస్తే ఆ విషయాన్ని మొదటే చెప్పి ఉండాల్సిందన్నారు. ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేకుంటే హౌస్ రిమాండ్, బెయిల్, మధ్యంతర బెయిల్ ఇలా ఇన్ని పిటిషన్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. ఒకవైపు పరిధి లేదంటూనే మరో వైపు ఇన్ని పిటిషన్లు వేయడం చంద్రబాబు తీరును తెలియచేస్తోందన్నారు.

ఆ దృశ్యాలతో మాకేం సంబంధం లేదు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణ దృశ్యాలు మీడియాలో రావడంపై ప్రశ్నించింది. ఆ దృశ్యాలను తాము లీక్ చేశామంటున్న చంద్రబాబు న్యాయవాదులు అందుకు ఆధారాలుంటే చూపాలని సీఐడీ స్పెషల్ పీపీ వివేకానంద కోరారు. ఆ దృశ్యాలు మీడియాలో ఎలా వచ్చాయో, వాటిని ఎవరు చిత్రీకరించారో తమకు తెలియదన్నారు. విచారణ రోజు చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు, సహాయకులు కూడా కలిశారని కోర్టు దృష్టికి తెచ్చారు.

అసెంబ్లీకి వెళదాం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో బుధవారం అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు జైల్లో ఉన్న నేపథ్యంలో జరుగుతున్న సమావేశాలకు హాజరు కావాలా? వద్దా? అనే అంశంపై సమావేశంలో చర్చించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సమావేశాలను బహిష్కరించాలని కొందరు చెప్పగా, అలా చేస్తే పారిపోయినట్లవుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. చివరకు సమావేశాలకు హాజరు కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో లోకేశ్ ఢిల్లీ నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశ వివరాలను పార్టీ నేతలు నిమ్మల రామానాయుడు, డీబీవీ స్వామి, బీటీ నాయుడు మీడియాకు వివరించారు. ఈ సమావేశాల్లో ప్రజల పక్షాన గొంతెత్తాలని, చంద్రబాబు అరెస్ట్‌పై గళమెత్తాలని నిర్ణయించినట్లు తెలిపారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 14 ఏళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేసిన చంద్రబాబు.. సుదీర్ఘ రాజకీయ జీవితంలోని అంశాలన్నింటినీ ప్రజలకు తెలియచేయడానికే అసెంబ్లీకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు ఎత్తేయాలనే డిమాండే ప్రధాన అజెండాగా అధికార పార్టీపై పోరాడతామని తెలిపారు.

రాజధాని అవినీతిపైనా విచారణ చేయాలి



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధాని పేరుతో జరిగిన అవినీతిపైనా కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించి పూర్తిస్థాయి విచారణ చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,088వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో భారీ అవినీతి జరిగిందనేందుకు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న స్కామ్‌లే నిదర్శనమని, అధికారం అడ్డుపెట్టుకుని పేదల నోళ్లు కొట్టి అబ్బా, కొడుకులు చేసిన అవినీతి వ్యవహారంపై విచారణ చేయాలన్నారు. బుధవారం కేబినెట్ భేటీకి వెళుతూ, వస్తూ దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణి వేగం తగ్గించిన సీఎం వైఎస్ జగన్ దీక్షలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేయడంతో బహుజనులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, నల్లమోతు విజయ నిర్మల, మందపాటి రమేష్, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బాబు పెట్టిన బకాయిలూ చెల్లింపు

- చంద్రబాబు పాలనలో ఇంటి నిర్మాణాలకు అనుమతులిచ్చి బిల్లులు చెల్లించని దుస్థితి
- 'జగనన్నకు చెబుదాం'లో తమ గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- దరఖాస్తులు పరిశీలించి బిల్లులు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సొంతిల్లు.. ప్రతి మనిషి స్వప్నం. సొంతంగా ఇంటిని సమకూర్చుకోలేని పేదలకు అండగా నిలవడం ప్రభుత్వం బాధ్యత. కానీ, 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు పేదల ఆత్మగౌరవాన్ని కించపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు పేదలకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చి.. బిల్లులు చెల్లించలేదు. వీరందరికీ సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం తమ ఇంటి బిల్లులు చెల్లించలేదని.. తమను ఆదుకోవాలంటూ 13,218 దరఖాస్తులు వచ్చాయి. వీరికి రూ.56.83 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. అత్యధికంగా చంద్రబాబు సొంత జిల్లా అయిన చిత్తూరు నుంచే 1,983 దరఖాస్తులు వచ్చాయి. గృహ నిర్మాణ సంస్థ ఈ దరఖాస్తులన్నీ పరిశీలిస్తూ.. లబ్ధిదారులకు చెల్లింపులు జరుపుతోంది. ఇప్పటికే 5,685 దరఖాస్తుల పరిశీలన పూర్తవ్వగా.. రూ.25.57 కోట్లు బిల్లులను వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 853 మందికి రూ.3.67 కోట్లు, విజయనగరంలో 540 మందికి రూ.1.97 కోట్లు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 523 మందికి రూ.2.39 కోట్ల బిల్లులు చెల్లించారు. మిగిలిన 7,533 దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.31.26 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన వెంటనే ప్రభుత్వం ఆ మొత్తాన్ని కూడా లబ్ధిదారులకు అందించనుంది.

దరఖాస్తులు పరిశీలించిన వెంటనే చెల్లింపులు

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. పరిశీలన అనంతరం బిల్లులు చెల్లిస్తున్నాం. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ లక్ష్మీశా, ఎండీ, గృహ నిర్మాణ సంస్థ

క్లుప్తంగా...

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

- వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో కరెన్సీ నోట్లపై ముద్రించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో పోరాటానికి కూడా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్‌బీఐ ఏర్పాటుకు పునాది అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో కరెన్సీ నోట్లపై ముద్రించాలన్నారు. లేదంటే ప్రజా ప్రతిఘటన తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను హెచ్చరించారు.

ఆర్థిక స్థాయీ సంఘ సభ్యుడిగా జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘ సభ్యుడిగా 2023–24 సంవత్సరానికి రాజ్యసభ బీజేపీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు నామినేట్ అయ్యారు. ఈ నియామకం సెప్టెంబర్ 13 నుంచి అమల్లోకి వచ్చింది. ఆర్థిక స్థాయీ సంఘం నీతి ఆయోగ్ సహా ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు, ప్రణాళికా మంత్రిత్వ శాఖలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, బిల్లులు, డిమాండ్‌లను పరిశీలిస్తుంది. కాగా.. ఈ స్థాయీ సంఘానికి లోక్‌సభ ఎంపీ జయంత్ సిన్హాను కమిటీ చైర్‌పర్సన్‌గా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు.

మహిళల ప్రాతినిధ్యానికి పెద్దపీట: జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక రిజర్వేషన్ లేనప్పుడు మహిళలకు అవకాశాలు అంతగా లేవని.. వివిధ కారణాలతో పురుషాధిక్యత కొనసాగుతోందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. కానీ మహిళా రిజర్వేషన్ బిల్లు వస్తే కచ్చితంగా మహిళల ప్రాతినిధ్యం, పాత్ర, భాగస్వామ్యం పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతతో పాటు మహిళా సారథ్యంలో అభివృద్ధి అనే ఆలోచనతో ప్రధాని మోదీ ఉన్నారని.. అందుకే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకొచ్చారన్నారు. బుధవారం ఉదయం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో జీవీఎల్ నరసింహారావు మీడియాతో మాట్లాడుతూ.. 2026లో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా మహిళా రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. 2021 జనగణన జరగనందుకు 2025 లోపు జనగణన పూర్తి చేసి ఈ రిజర్వేషన్లు త్వరితగతిన అమలయ్యేలా చూస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ బిల్లును కాంగ్రెస్ ఎందుకు పాస్ చేయలేకపోయిందో చెప్పి.. ఆ తర్వాత తమ మీద విమర్శలు చేయాలని జీవీఎల్ హితవు పలికారు.

సీఎం జగన్‌పై దాడి కేసు విచారణ 29కి వాయిదా

విశాఖ లీగల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై గతంలో విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు జనపల్లి శ్రీనివాసరావును విశాఖ కేంద్ర కారాగారం పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎన్ఐఏ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు కోర్టుకు హాజరయ్యారు. కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. శ్రీనివాసరావు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ గురువారం విచారణకు రానుంది.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేష్ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంను కోరారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ పథకం దేశమంతటా అమలు చేసేలా కేంద్రానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం గంగారాంను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మారేష్ మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం వలన అన్యాయం జరుగుతోందన్నారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చేలా కేంద్రానికి సూచించాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు.

ఎగుమతుల్లో ఏపీ పైపైకి..

దేశీయ సగటును మించి ముందుకు

- 2027–28 నాటికి రూ.4.80 లక్షల కోట్లకు చేరతాయని అంచనా
- ఇందుకోసం ఆరు ప్రధాన ఎగుమతి జిల్లాలపై దృష్టి
- ఎగ్జిమ్ బ్యాంక్ అధ్యయన నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: 2017–18 నుంచి 2022–23 మధ్య దేశ ఎగుమతులు సగటున 8.2 శాతం వృద్ధి చెందగా అదే సమయంలో రాష్ట్ర ఎగుమతులు 8.9 శాతం వృద్ధితో రూ. 1.59 లక్షల కోట్లకు చేరాయని ఎగ్జిమ్ బ్యాంక్ అధ్యయన నివేదికలో పేర్కొంది. రాష్ట్రం నుంచి ఎగుమతులకు ఇంకా అపారమైన అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. ఇప్పటి వరకు దృష్టి పెట్టని మార్కెట్లను కూడా అందిపుచ్చుకోగలిగితే ఎగుమతులు మరింత వేగంగా విస్తరిస్తాయని తెలిపింది. అవకాశం ఉన్నా, ఇప్పటివరకు అందిపుచ్చుకోని మార్కెట్ విలువ రూ. 88,800 కోట్లు వరకు ఉందని అంచనా వేసింది. ఈ మార్కెట్ పైనా దృష్టి పెడితే రాష్ట్ర ఎగుమతుల విలువ రూ. 2.43 లక్షల కోట్లకు చేరుతుందని పేర్కొంది. ఎగ్జిమ్ బ్యాంక్ మధ్యంతర అంచనాల ప్రకారం 2027–28 నాటికి రాష్ట్ర ఎగుమతులు రూ. 4.80 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. ఇందులో వాణిజ్య ఉత్పత్తుల విలువ రూ. 4 లక్షల కోట్లుగా, సేవల రంగం వాటా రూ. 80 వేల కోట్లు ఉండనుంది.

ప్రభుత్వంతో కలిసి ప్రోత్సాహక చర్యలు

రాష్ట్రంలో ఎగుమతుల ప్రోత్సాహకానికి రాష్ట్ర ప్రభుత్వంతో కలసి పనిచేస్తున్నట్టు ఎగ్జిమ్ బ్యాంక్ ఎండీ హర్ష బంగారి 'సాక్షి' కి తెలిపారు. ఇందుకోసం ఎగుమతిదారులకు రుణాలు ఇవ్వడంతో పాటు జిల్లాలవారీగా అవకాశాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఇంతవరకు అవకాశాలు అందిపుచ్చుకోని రంగాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా అధిక విలువ ఉన్న రిఫైన్డ్ షుగర్‌ను బంగ్లాదేశ్‌కు, పేపర్ వోచర్ కార్డులను ఇథియోపియాకు ఎగుమతి చేసేలా ఎగ్జిమ్ బ్యాంక్ రెండు కంపెనీలను ప్రోత్సహించిందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో ఆరు ప్రధాన ఎగుమతి జిల్లాలైన తూర్పు, పశ్చిమ గోదావరి, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలను ఎంపిక చేసి అక్కడి ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

అది మా పరిధిలోకి రాదు

- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులపై విచారించలేం
- తెలంగాణ జీవో 105పై ఏపీ మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించొచ్చు
- కేడబ్ల్యూడీటీ–2 ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలను కేటాయిస్తూ ఆ రాష్ట్ర సర్కారు జారీ చేసిన జీవోపై విచారణ తమ పరిధిలోకి రాదని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 తేల్చి చెప్పింది. ఈ జీవోపై మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేసింది. ఆ జీవోను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్ (ఐఏ)ను బుధవారం కొట్టివేసింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలను తరలించేందుకు తెలంగాణ సర్కారు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. చిన్న నీటిపారుదల విభాగంలో మిగులుగా ఉన్న 45 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకుగాను కృష్ణా జలాల్లో అదనంగా 45 టీఎంసీల వాటా తమకే దక్కుతుందని ఏకపక్షంగా తీర్మానించుకుని మొత్తం 90 టీఎంసీలను ఆ ఎత్తిపోతలకు కేటాయించుకుంటూ 2022 ఆగస్టు 18న తెలంగాణ ప్రభుత్వం జీవో 105 జారీ చేసింది. కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకుగాను నాగార్జునసాగర్‌కు ఎగువన కృష్ణా నదిలో 45 టీఎంసీలను అదనంగా వాడుకునే వెసులుబాటును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చింది. విభజన నేపథ్యంలో ఆ 45 టీఎంసీలపై రెండు రాష్ట్రాలకు హక్కు ఉంటుందని, చిన్న నీటి వనరుల విభాగంలో కేటాయింపులకంటే తెలంగాణ అధికంగా వాడుకుంటున్నందున, జీవో 105ను రద్దు చేయాలంటూ కేడబ్ల్యూడీటీ–2లో గతేడాది ఏపీ ప్రభుత్వం ఐఏ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ ఎస్.తాళపత్ర, జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ–2 పలుమార్లు విచారించి, బుధవారం తుది తీర్పు ఇచ్చింది. విభజన చట్టంలో సెక్షన్–89(ఏ) ప్రకారం అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం–1956 కింద ఏర్పాటైన ట్రిబ్యునల్ నీటిని కేటాయించని ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేయడం తమ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను విభజన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత తెలంగాణ చేపట్టిందని తెలిపింది. అందువల్ల ఈ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులపై విచారణ చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది.

బాబు ఆవిష్కరణలకు పేటెంట్ పొందండి!

- కేంద్రానికి రూ.వేల కోట్ల డబ్బు లొస్తాయి: విజయసాయిరెడ్డి
- కంప్యూటర్, సెల్‌ఫోన్ కనిపెట్టానని బాబు వందలసార్లు ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: పలు ఆవిష్కరణలకు ఆద్యుడిగా ప్రచారం చేసుకునే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పరిశోధనలకు పేటెంట్ హక్కులను పొందితే కేంద్ర ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 1962 నుంచి అంతరిక్ష పరిశోధనలను ప్రోత్సహించినట్లు కాంగ్రెస్ చెబుతుండగా 2014 నుంచి తమ సహకారంతో ఇస్రో ఘన విజయాలు సాధిస్తోందని బీజేపీ పేర్కొంటోందన్నారు. అయితే వీరిద్దరూ కాకుండా అనేక వినూత్న ఆవిష్కరణలకు నాంది పలికినట్లు చెప్పుకునే మూడో వ్యక్తి కూడా ఉన్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు తాను ఐటీ విప్లవం తెచ్చానని, కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను కనిపెట్టానని వందలసార్లు ప్రకటించుకున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయాలని, అదే నిజమైతే భారత్ వాటిపై పేటెంట్ హక్కులు పొందవచ్చన్నారు. తద్వారా ఐటీ కంపెనీలు, కంప్యూటర్ల తయారీ కంపెనీలు, సెల్ ఫోన్ కంపెనీల నుంచి రూ.వేల కోట్లు రాయల్టీ కింద పొందవచ్చని వ్యాఖ్యానించారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడంపై బుధవారం రాజ్యసభలో విజయసాయిరెడ్డి మాట్లాడారు.

అంతరిక్ష పరిశోధనలకు నిధుల కోత సరికాదు..

ఒక బ్లాక్ బస్టర్ సినిమా బడ్జెట్ కంటే తక్కువ ఖర్చుతో చంద్రయాన్ 3 చేపట్టి భారత కీర్తి పతాకాన్ని విశ్వవ్యాప్తంగా ఎగురవేసిన ఇస్రోకు పరిశోధనల నిమిత్తం పెద్ద ఎత్తున నిధులను కేటాయించి ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజయసాయిరెడ్డి కోరారు. భారత అంతరిక్ష కార్యక్రమాల కోసం కేవలం 2 బిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయించగా అమెరికాకు చెందిన నాసాకు 62 బిలియన్ డాలర్ల బడ్జెట్ ఉందని తెలిపారు. అంగారక గ్రహంపై పరిశోధనల కోసం ఇస్రో చేపట్టిన మంగళయాన్ మిషన్ అత్యంత తక్కువ వ్యయంతో పూర్తయిందని తెలిపారు. 2023–24 బడ్జెట్‌లో అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలకు 8 శాతం కోత విధించడం సరికాదన్నారు.

తప్పుడు కేసులతో వేధింపులు కాంగ్రెస్‌కు అలవాటే..

వైజ్ఞానిక మేధను చెరబట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విజయసాయిరెడ్డి విమర్శించారు. కేంద్రం, కేరళలో అధికారంలో ఉన్నప్పుడు ప్రసిద్ధ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి నారాయణ్‌పై తప్పుడు కేసులు బనాయించి 50 రోజులపాటు జైలులో నిర్బంధించి తీవ్రంగా హింసించిందని గుర్తుచేశారు. రాజకీయ ప్రత్యర్థులనే కాకుండా శాస్త్రవేత్తలను సైతం తప్పుడు కేసులతో వేధించి హింసించడం కాంగ్రెస్‌కి వెన్నతో పెట్టిన విద్యలాంటిదన్నారు. పెరుగుతున్న అంతరిక్ష కార్యక్రమాల అవసరాలకు తగినట్లుగా మానవ వనరులను సమకూర్చుకునేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్సెస్ లాంటి సంస్థలను దేశంలో మరిన్ని స్థాపించాలని సూచించారు. శాస్త్రవేత్తల వలసలను నిరోధించడానికి తగిన చర్యలు చేపట్టాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.



కేంద్ర ఆర్థిక మంత్రితో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆమె కార్యాలయంలో కలిసిన విజయసాయిరెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన బకాయిల విషయంలో ఆర్థిక శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. విభజన హామీలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై వీరిద్దరు చర్చించినట్లు తెలిసింది.

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు వేగవంతం: మంత్రి సీదిరి



సాక్షి, అమరావతి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం ఆయన మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తీర ప్రాంత మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కల్పన లక్ష్యంగా రూ.3,732.48 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మొదటి ఫేజ్‌లో భాగంగా నిర్మిస్తున్న నాలుగు ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. కేంద్ర నిధులతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులను కూడా సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద గుర్తించిన లబ్ధిదారులకు గ్రాండ్ మేళా ద్వారా పరికరాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ మత్స్యకారునికి లైఫ్‌జాకెట్ అందచేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో మత్స్య సహకార సంఘాల సభ్యులకు ప్రాధాన్యతనివ్వాలని ఈ సందర్భంగా మంత్రి సీదిరి అప్పలరాజు సూచించారు.

మహిళా బిల్లు ఆమోదం గర్వించదగ్గ విషయం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత
- పార్టీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా నేతలు

సాక్షి, అమరావతి: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం దేశం గర్వించదగ్గ విషయమని వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత చెప్పారు. రాజ్యసభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందితే.. పార్లమెంట్‌లో మహిళా సభ్యుల సంఖ్య 181కి చేరుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పలువురు మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా దేశంలో మహిళా సాధికారత దిశగా మరో ముందడుగుపడిందన్నారు. విధాన నిర్ణయాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేలా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ బిల్లు అమలుకు నోచుకునే వరకు వైఎస్సార్‌సీపీ పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతుందని చెప్పారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, సీఎం జగన్ స్ఫూర్తితో ఏపీలో నారి శక్తి జయహో.. అంటూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలు ముందుంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్టు అని సీఎం వైఎస్ జగన్ భావిస్తారని తెలిపారు. ఆయన మహిళా పక్షపాతి అని, అందుకనే మహిళలను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలుపుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మహిళలకు సీఎం జగన్.. ఆర్థిక స్వావలంబన కల్పిస్తున్నారని, మహిళల అభివృద్ధిని ఒక నినాదంగా కాకుండా ఒక విధానంగా తీసుకుని ముందుకెళుతున్నారని చెప్పారు. మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగనేనని ప్రశంసించారు. డ్వాక్రా రుణాలు తాను చెల్లిస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని చంద్రబాబు మహిళలను మోసం చేశారని, పాదయాత్రలో వైఎస్ జగన్ మహిళల కష్టాలు కళ్లారా చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే వారికి అండగా నిలిచారని చెప్పారు. సీఎం జగన్‌కు మహిళల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, 2024 ఎన్నికల్లో సీఎం జగనన్న సైనికులు మహిళలేనని.. 175 స్థానాల్లో గెలుపు ఖాయమని సునీత చెప్పారు.

2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి..

- మహిళా బిల్లుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీత డిమాండ్
- బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా వైఎస్సార్‌సీపీ ఎనలేని కృషిచేసిందన్న వైఎస్సార్‌సీపీ మరో ఎంపీ సత్యవతి



మహిళా ఎంపీలతో ఎంపీ భరత్ సెల్ఫీ

సాక్షి, న్యూఢిల్లీ: 2024 ఎన్నికల్లోనూ మహిళ బిల్లు అమలయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీత డిమాండ్ చేశారు. ఈ మేరకు త్వరితగతిన సెన్సెస్, డీలిమిటేషన్ అయ్యేలా చూడాలని కోరారు. స్థాపించిన మొదటి రోజు నుంచే మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతమయ్యేలా కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ.. మరోసారి మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధిని చాటుతూ పార్లమెంట్‌లో గళమెత్తింది. లోక్‌సభలో బుధవారం మహిళా బిల్లుపై వైఎస్సార్‌సీపీ మహిళా ఎంపీలు వంగా గీత, బీవీ సత్యవతిలు మాట్లాడారు. ఒక దేశం అభివృద్ధిచెందిందా లేదా అనేది చెప్పాలంటే తొలుత మహిళల ఆర్థిక స్థితిగతులను చూడాలన్నారు. 27 ఏళ్లుగా అనేక అడ్డంకులు, ఒత్తిళ్లతో బిల్లు పార్లమెంటుకు రాలేకపోయిందని, ఇప్పుడు తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల్ని గౌరవించడంలో ఇతర రాష్ట్రాల కంటే ఏపీ ముందుందని చెప్పారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఇప్పుడు వస్తుంటే.. స్థానిక సంస్థల్లో మహిళలకు 57 శాతం అవకాశం కల్పించిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ 50 శాతం మించి మహిళలకు అవకాశమిస్తున్న విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అమ్మ ఒడి, చేయూత, వసతి, విద్య దీవెన తదితర పథకాలతో మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. గృహిణికి తన పేరిట సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారని చెప్పారు. చట్టాల్లో ఉన్న ఆస్తి హక్కు మహిళలకు దక్కేలా చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున బిల్లుకు మద్దతు తెలిపారు. ఓబీసీలకు కూడా చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించారు.

మహిళల జీవన ప్రమాణాల మెరుగుదలకు చేయూత: ఎంపీ బీవీ సత్యవతి

15 ఏళ్లకే మహిళా బిల్లును పరిమితం చేయరాదని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి డిమాండ్ చేశారు. లోక్‌సభలో మహిళా బిల్లుపై చర్చలో ఆమె మాట్లాడారు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా వైఎస్సార్‌సీపీ ఎంతో కృషి చేసిందని తెలిపారు. పలుమార్లు మహిళా ఎంపీలు కేంద్ర మంత్రుల్ని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. మహిళా ప్రజాప్రతినిధులున్న నియోజకవర్గాల్లో ఆర్థిక ప్రగతి అత్యధికంగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. మహిళల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఈ బిల్లు చేయూతనిస్తుందని ఎంపీ సత్యవతి చెప్పారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి 12 రోజులు మధ్యంతర బెయిల్

- ఆరోగ్య పరీక్షల కోసం అనుమతిచ్చిన సీబీఐ కోర్టు
- హైదరాబాద్ విడిచి వెళ్లకూడదని షరతు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డికి హైదరాబాద్ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం 12 రోజుల మధ్యంతర బెయిల్‌కు అనుమతిచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి ప్రత్యేక సీబీఐ కోర్టులో ఈ నెల 9వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు ముగియడంతో సీబీఐ కోర్టు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ 12 రోజులు నగరం విడిచి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేసింది. ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తో ఎస్కార్ట్ ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఈ సందర్భంగా ఆదేశించింది. ఈ నెల 22న భాస్కర్‌రెడ్డిని ఎస్కార్ట్ పోలీసులకు అప్పగించాలని తెలిపింది. అలాగే వచ్చే నెల మూడో తేదీన ఎస్కార్ట్ పోలీసులు జైలు సిబ్బందికి తిరిగి ఆయనను అప్పగించాలని ఆదేశించింది.

పరిశుభ్రతకు మహిళల ప్రాధాన్యం

- పట్టణాల్లో మెప్మా ప్రత్యేక హ్యాండ్‌వాష్ స్టేషన్లతో సత్ఫలితాలు
- ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చర్యలు
- ఇప్పటికే 50 పట్టణాల్లో సమర్థవంతంగా వినియోగం

సాక్షి, అమరావతి: కోవిడ్ పరిస్థితుల అనంతరం పట్టణ ప్రాంత ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడంలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) విజయం సాధించింది. మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల్లోని మహిళా సంఘాల సభ్యులకు దీనిపై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రజలు అధికంగా తిరిగే ప్రదేశాల్లో ప్రత్యేక హ్యాండ్‌వాష్ స్టేషన్లను అందుబాటులోకి తెచ్చింది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్బీ) గాను ఇప్పటివరకు 50 పట్టణాల్లో వీటిని వినియోగంలోకి తెచ్చారు. ముఖ్యంగా.. మహిళలు ప్రపంచవ్యాప్తంగా చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నట్లు గుర్తించిన యునిసెఫ్.. అందుకు కారణాలను సైతం వెల్లడించింది. చాలా రోగాలకు ప్రధాన కారణం పరిశుభ్రత సరిగా లేకపోవడమేనని, ముఖ్యంగా చేతుల ద్వారానే అనేక రోగాలు సంక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితులను నివారించాలంటే పరిశుభ్రత అవసరమని పేర్కొంది. యునిసెఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా మెప్మా గతేడాది డిసెంబర్‌లో పైలట్ ప్రాజెక్టుగా కొన్ని పట్టణాల్లో హ్యాండ్ వాష్‌స్టేషన్లు ఏర్పాటుచేసింది. ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులు సమావేశమయ్యే కేంద్రాలు, పేదలు ఎక్కువగా సందర్శించే ప్రాంతాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చారు. తొలుత వీటి వినియోగం అంతంత మాత్రంగానే ఉన్నా.. ఈ తొమ్మిది నెలల్లో పరిసర ప్రాంత ప్రజలు తరచూ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మహిళల వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, నీటి నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులోకి తెచ్చిన ఈ స్టేషన్లు గొప్ప మార్పును తీసుకొచ్చినట్లు మెప్మా ఎండీ విజయలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు.

మరో 73 యూఎల్బీల్లో ఏర్పాటు..

వ్యక్తిగత పరిశుభ్రతపై పట్టణ మహిళా సమాఖ్య సభ్యులతో మొదలైన ఈ అవగాహన.. స్థానిక పాఠశాలలు, మార్కెట్లతో పాటు సాధారణ ప్రజల వరకు చేరింది. ఆయా ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వాష్‌స్టేషన్ల వినియోగం ఇప్పుడు సర్వసాధారణమైంది. మెప్మా ఆధ్వర్యంలో కల్పిస్తున్న అవగాహనతో సానుకూల మార్పు కనిపిస్తోంది. పట్టణ పేదల్లో పరిశుభ్రతను ఆరోగ్యకర అలవాటుగా మార్చేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక పట్టణ మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించే హ్యాండ్‌వాష్ స్టేషన్ ఒక్కోదానిలో 500 లీటర్ల నీటితో పాటు 10 లీటర్ల లిక్విడ్ సోప్ ఉండేలా ఏర్పాటుచేశారు. స్థానిక మున్సిపాలిటీ అనుమతితో ఏర్పాటుచేసిన ఈ స్టేషన్లు గత తొమ్మిది నెలలుగా 50 పట్టణాల్లో సమర్థవంతంగా పనిచేస్తుండడం, ఒక్కో హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను రోజుకు సగటున 1000 మంది వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి ప్రాంతాన్నీ జియో ట్యాగింగ్ చేసి మెప్మా కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించడంతో మంచి ఫలితాలు సాధించారు.



మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి పిటిషన్ విచారణ

- ప్రతివాదులకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి(పీడీఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. 2017లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో గెలిచిన శ్రీనివాసులురెడ్డి అఫిడవిట్‌లో క్రిమినల్ కేసులు ప్రస్తావించలేదని, అనర్హుడుగా ప్రకటించాలని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అనర్హుడుగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్రపతికి అన్ని ఫైళ్లు పంపాలని శాసనమండలి కార్యదర్శిని ఆదేశిస్తూ.. ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ శ్రీనివాసులురెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రతివాదులు వేమిరెడ్డి పట్టాభిరెడ్డి తదితరులకు ఐదు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం నోటీసులిచ్చింది.



సర్కారు బడిలో అంతర్జాతీయ విద్య

- పేదింటి పిల్లలకు ఇంటర్నేషనల్ బక్‌లారియెట్ (ఐబీ) బోధన
- ప్రపంచంలో ఒత్తిడి లేని చదువులుగా గుర్తింపు
- మానవ విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రత్యేక స్థానం
- మూడేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారికి వివిధ దశల్లో ప్రోగ్రామ్స్
- దేశంలో 210 కార్పొరేట్ స్కూల్స్‌లో మాత్రమే ఐబీ సిలబస్ అమలు
- వాటిల్లో రూ. 6 నుంచి రూ. 20 లక్షలకు పైగా ఫీజు వసూలు
- ప్రభుత్వ బడిలో ప్లస్2 వరకు ఉచితంగానే ఐబీ సిలబస్ బోధన

సాక్షి, అమరావతి: 'మన పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా ఎదగాలి. ప్రపంచానికి దిక్సూచిగా మారాలి. అందుకోసం వారికి మీ జగన్ మామ ప్రభుత్వం అండగా ఉంటుంది. నాడు–నేడుతో స్కూళ్ల రూపురేఖలు మార్చి డిజిటల్ బోధన ప్రవేశపెట్టాం. సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నాం. మన పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బక్‌లారియెట్ (ఐబీ) బోధన కూడా ప్రవేశపెడతాం'' జగనన్న ఆణిముత్యాలు రాష్ట్ర స్థాయి సత్కార వేడుకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా ఐబీ సంస్థతో బుధవారం ఒప్పందం చేసుకుని ఆచరణలోకి తెచ్చారు. ఇప్పటికే సర్కారు బడిలో సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్ బోధనను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం ఇప్పుడు 'ఐబీ' చదువులను సైతం పేద పిల్లలకు చేరువ చేస్తోంది. ఇప్పటి వరకు దేశంలో 210 వరల్డ్ క్లాస్ కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఐబీ సిలబస్ అమల్లో ఉంది. ఈ స్కూళ్లలో సంపన్నులు మాత్రమే తమ పిల్లలను చదివించగలరు. అలాంటి చదువులను రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలోకి తెచ్చి పేద పిల్లలకు అందించాలన్న సంకల్పంతో జగన్ సర్కారు ముందడుగు వేసింది. ఏటా ఒక తరగతి చొప్పున ఐబీ బోధన పెంచుతూ ప్లస్2 వరకు విద్యనందించేందుకు చర్యలు తీసుకుంది.

ప్రపంచం మెచ్చిన విద్యా విధానం

సాధారణంగా ప్రైవేటు స్కూళ్లలో మార్కులు.. ర్యాంకులు.. ఒకరితో మరొకరికి పోటీతో పిల్లలపై విపరీతమైన ఒత్తిడి పెంచుతారు. దీనికి భిన్నంగా మానసిక ఒత్తిడి లేకుండా పిల్లలు సొంతంగా ఎదగడంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బోధనను ఐబీ అందిస్తుంది. ఐబీ ఒక నాన్ ప్రాఫిట్ ఫౌండేషన్. పిల్లలపై పరీక్షల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన కొంత మంది ఉపాధ్యాయులు పరిశోధన చేసి 1968లో స్విట్జర్లాండ్‌లో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ బోర్డు. ఇందులో 3 నుంచి 19 ఏళ్ల వయసు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణనిస్తారు. ఈ సిలబస్ చదువుకున్న పిల్లల్లో విషయ పరిజ్ఞానం, క్రిటికల్ థింకింగ్, ఇండిపెండెంట్ థింకింగ్, సెల్ఫ్ లెర్నింగ్ వంటి నైపుణ్యాలు అలవడతాయి. ఓపెన్-మైండెడ్, ఓపెన్ లెర్నింగ్ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను ఆకళింపు చేసుకుని, సానుకూల మార్పునకు ఈ పిల్లలు సిద్ధంగా ఉంటారు. ఉన్నత విద్యా అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. 159 దేశాల్లో ఈ విద్యా విధానం అమలులో ఉంది. ఈ బోర్డులో చదువుకున్న పిల్లలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రవేశాలు, అవకాశాలు లభిస్తాయి. పోటీ పరీక్షలు, ఇతర కోర్సులు అంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్న నేటి యుగంలో 'ఐబీ సిలబస్'లో పిల్లల నైపుణ్యాలను అంచనా వేసే అంతర్గత పరీక్షలేగాని అధికారిక పరీక్షలు ఉండవు.

నాలుగు దశల్లో ప్రోగ్రాములు

ఐబీ ప్రోగ్రాములు నాలుగు దశల్లో ఉంటాయి. 3 నుంచి 12 సంవత్సరాల వయసు విద్యార్థులకు ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ (పీవైపీ) అందిస్తారు. ఇందులో పిల్లలకు నేర్చుకునే ఆసక్తి పెంచడం, కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్ నాలెడ్జ్, సొంతంగా ఆలోచించడం వంటివి నేర్పిస్తారు. ఈ ప్రోగ్రాంలో పరీక్షలు గానీ, గ్రేడింగ్ కానీ ఉండవు. పదేళ్ల ఈ ప్రోగ్రామ్ పూర్తయిన తర్వాత చివరలో సైన్స్ ఎగ్జిబిషన్ వంటిది నిర్వహించి పిల్లలను భాగస్వామ్యం చేస్తారు.

- కాగా, 11 నుంచి 16 సంవత్సరాల విద్యార్థులకు మిడిల్ ఇయర్స్ ప్రోగ్రామ్ (ఎంవైపీ) ఉంటుంది. ఇందులో విద్యార్థులకు ఆర్ట్స్, లాంగ్వేజ్, లాంగ్వేజ్ అక్విజిషన్, మ్యాథ్స్, డిజైన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇండివిడ్యువల్స్ అండ్ సొసైటీస్, సైన్సెస్ అనే 8 గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూపు నుంచి విద్యార్థులు కనీసం ఒక సబ్జెక్ట్ ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇందులో పిల్లలు నైపుణ్యాలను ఎంత నేర్చుకుంటున్నారు అనే దానిని నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఈ కోర్సు ప్రస్తుతం మన పదో తరగతికి సమానం.
- ఇక 16 నుంచి 19 ఏళ్ల వయసున్న విద్యార్థులకు డిప్లొమా ప్రోగ్రామ్ (డీపీ) ఉంటుంది. మూడేళ్ల పాటు ఉండే ఈ ప్రోగ్రామ్‌లో లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, లాంగ్వేజ్ అక్విజిషన్, సైన్స్, ఆర్ట్స్, మ్యాథ్స్, ఇండివిడ్యువల్స్ అండ్ సొసైటీస్ అనే 6 గ్రూపులు ఉంటాయి. డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తయిన తర్వాత చివర్లో సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. మన ప్లస్ 2 విద్యకు సమానమైన ఈ డిప్లొమా సర్టిఫికెట్ ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా చెల్లుతుంది.
- ఇదే వయసున్న (16–19 సం.) విద్యార్థుల కోసం కెరీర్ రిలేటెడ్ ప్రోగ్రామ్ (సీపీ) డిజైన్ చేశారు. ఇది విశ్వవిద్యాలయాలు, ఉపాధి, తదుపరి ట్రైనింగ్ కోసం విద్యార్థులను సిద్ధం చేసే రెండేళ్ల ప్రోగ్రామ్. విద్యార్థులు ఎంచుకున్న కెరీర్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందిస్తారు.

విశ్వ మానవుడిగా ఎదుగుదల

ఐబీ విద్య విద్యార్థులకు విమర్శనాత్మకంగా ఆలోచించడం, ప్రశ్నించడం అలవాటు చేస్తుంది. ఇది సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే సామర్థ్యాన్ని ఇస్తుంది. రాయడం, మాట్లాడటం, ప్రెజెంటేషన్ సహా వివిధ మార్గాల్లో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసే నైపుణ్యాలు బోధిస్తారు. వారి చదువు, కెరీర్‌ను మరింత విజయవంతం చేసేందుకు దోహదం చేస్తుంది. ఐబీ విద్యార్థులు విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల గురించి నేర్చుకుంటారు. ఇది వారికి మరింత సహనాన్ని, ఇతరులను అర్థం చేసుకోగలిగే సామర్థ్యాన్ని అందిస్తుంది. విద్యార్థులు బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులుగా తయారు చేస్తారు. ప్రపంచంలో ఏమూల ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నా అక్కడ సానుకూల మార్పును తీసుకురావడానికి ఈ విద్య సహాయపడుతుంది. అంతర్జాతీయంగా అత్యున్నత కెరీర్‌ను సొంతం చేసుకుంటారని నిపుణులు చెబుతున్నారు.

భారత్‌లో 210 ఐబీ స్కూళ్లు

వాస్తవానికి ఇంటర్నేషనల్ బాకలారియెట్ చదువులు చాలా ఖర్చుతో కూడుకున్నది. మన దేశంలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, ముస్సోరి, కొడైకెనాల్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు పరిధిలో 210 ఐబీ వరల్డ్ స్కూల్స్ ఉన్నాయి. వాటిల్లో ఏడాదికి రూ. 6 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. చాలా స్కూళ్లలో ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ (3–12సం.) మాత్రమే అందిస్తుండగా, కొన్ని కొన్ని మిడిల్ ఇయర్ ప్రోగ్రామ్ (11–16 సం.) వరకు, అతి తక్కువ స్కూళ్లు మాత్రం డిప్లొమా ప్రోగ్రామ్ (డీపీ) వరకు బోధిస్తున్నాయి.

ప్రభుత్వంతో 'ఐబీ' ఒప్పందం



ఐబీ సంస్థతో ఒప్పందం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స, ఐబీ సంస్థ ప్రతినిధులు, అధికారులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ బడుల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలను అంతర్జాతీయ స్థాయిలో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేశారు. అంతర్జాతీయంగా అత్యున్నత ప్రమాణాలు గల కరిక్యులమ్‌గా పేరొందిన ఇంటర్నేషనల్ బక్‌లారియెట్ (ఐబీ) సిలబస్‌ను ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెడుతు న్నారు. బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఇందుకు ఆమోదం తెలపడంతోపాటు ఐబీ సంస్థతో ఒప్పందం కూడా చేసుకున్నారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈ ఒప్పందంపై ఐబీ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాట్ కాస్టెల్లో, విద్యా శాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సంతకాలు చేశారు. ఐబీ డైరెక్టర్ జనరల్ ఒల్లి పెక్కా హెయినొనేన్‌తో పాటు సింగపూర్, వాషింగ్టన్ డీసీ, జెనీవా, యూకేల నుంచి ఆ సంస్థ అంతర్జాతీయ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రపంచంలో అత్యుత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని, అందుకోసమే ఐబీ సహకారాన్ని కోరుతున్నట్టు తెలిపారు. 'ఇక్కడి విద్యార్థులు సంపాదించే సర్టిఫికెట్ ప్రపంచంలో ఎక్కడైనా చెల్లుబాటయ్యేలా ఉండాలన్నది మా ఉద్దేశం. ఇతర ఐబీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్‌తో సమానంగా రాష్ట్ర విద్యార్థులు ఉండాలి. అంతర్జాతీయ చదువులను అట్టడుగున ఉన్న విద్యార్థులకు అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అతి పెద్ద విజయం. ఐబీ సిలబస్ అందించడం సవాలుతో కూడుకున్నది. అందులోనూ ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెట్టడం మాకూ సవాలే. అయినప్పటికీ సంకల్పం ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదు' అని సీఎం చెప్పారు.

పేదల జీవితాల్లో సమూల మార్పులు తేవడమే మా ఉద్దేశం

'పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నాం. అవన్నీ మీకు తెలిసే ఉంటాయి. పాఠశాల విద్యను అత్యంత నాణ్యంగా తీర్చిదిద్దాం. స్కూళ్లను బాగు చేయడం నుంచి తరగతి గదుల డిజిటలైజేషన్ వరకూ అనేక చర్యలు తీసుకున్నాం. ఆరో తరగతి నుంచి అన్ని తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేశాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చాం. పిల్లలందరికీ బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నాం. పిల్లలను బడికి పంపే తల్లికి ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ప్రతి రోజూ ఒక పీరియడ్ పిల్లలకు టోఫెల్ పరీక్షల్లో శిక్షణ ఇస్తున్నాం. టోఫెల్ ప్రైమరీ, తర్వాత టోఫెల్ జూనియర్, టోఫెల్ సీనియర్ విభాగాలుగా వీటిని విద్యా వ్యవస్థలో భాగం చేశాం. ఈ వయసులో పిల్లలకు ఈ శిక్షణ గుర్తుండిపోతుంది. అన్ని స్కూళ్లలో ఇంగ్లిష్ మీడి యంలో బోధిస్తున్నాం. విద్యా ప్రమాణాలను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దీంట్లో భాగంగానే ఐబీని తీసుకు వచ్చాం. ఇది ఒక రోజుతో సాధ్యం అయ్యేది కాదు. ఒకటో క్లాసుతో మొదలు పెడితే ఈ ఫలితాలు పదేళ్ల తర్వాత కనిపి స్తాయి. ఏడాదికి ఒక్కో తరగతి పెంచుతూ +2 వరకు అందిస్తాం. దిగువ స్థాయిలో ఉన్న పేదల జీవితాల్లో సమూల మార్పులు తీసుకు రావడమే మా ఉద్దేశం. దేవుడి దయతో ఈ లక్ష్యం సిద్ధిస్తుంది. దీంట్లో ఐబీ భాగస్వా మ్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారా యణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, పాఠశాల విద్యా శాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, ఐబీ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ మేనేజర్ (సౌత్ ఏసియా) మహేష్ బాలకృష్ణన్, ఐబీ చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ అన్‌టన్ బేగస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలే అమృతం

రాష్ట్ర వ్యాప్తంగా పోషణ్ మాసోత్సవాలు
అంగన్‌వాడీల పరిధిలో ఈనెల 30 వరకు..

సాక్షి, అమరావతి: తల్లి పాల విశిష్టతపై మహిళలను చైతన్యవంతులను చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం ఈ నెల 30 వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని వైద్య నిపుణులచే మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలకు రెండేళ్ల వయసు వచ్చేవరకు పౌష్టికాహారంతో పాటు తల్లిపాలను కూడా అందించేలా శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అనుబంధ పోషకాహార వంటల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. కూరగాయలు, ధాన్యాలతో పోషకాహారం తయారీపై అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు చిరు ధాన్యాల వినియోగం, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా సుపోషణ్ దివాస్, అన్నప్రాసన, సీమంతం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.







నిమజ్జనోత్సవం

గణనాథుని నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు పూజలు అందుకున్న వినాయక ప్రతిమలను భక్తులు సమీపంలోని కాలువలు, నదీ పాయల్లో నిమజ్జనం చేశారు. మేళతాళాలు, మంగళవాద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ స్వామివారి ఊరేగింపులు సాగాయి. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ దిగువన గణేషుని నిమజ్జనం కోలాహలంగా జరిగింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









కిడ్నీ వ్యాధుల కట్టడి

- ఎ.కొండూరులో సత్ఫలితాలు ఇచ్చిన ముందస్తు చర్యలు
- ఇంటింటా స్క్రీనింగ్ నిర్వహించిన వైద్య సిబ్బంది
- తండాలకే స్పెషలిస్టు వైద్యులు
- సమీపంలోనే డయాలసిస్ కేంద్రం
- స్వచ్ఛమైన తాగునీరు అందజేత



తండాల్లోనే కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): కిడ్నీ వ్యాధుల కట్టడికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు తండాల్లో కొత్తగా ఎవరూ కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా అరికట్టడంతో పాటు, ఇప్పటికే ఉన్న వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితి విషమించకుండా చూడగలుగుతున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో వెల్లడైన ఫలితాలే అందుకు నిదర్శనం. మరోవైపు వారికి సమీపంలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో క్రమం తప్పక కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకోగలుగుతున్నారు. తండాల నుంచి డయాలసిస్‌కు వచ్చేందుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే వాహనం ఏర్పాటు చేసింది.

ముందస్తు చర్యలు

విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఎస్‌పీఎం) విభాగం వైద్యుల బృందంతో క్రానిక్ కిడ్నీ డిసీజెస్‌పై ప్రాథమిక సర్వే నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులతో పాటు, ప్రభుత్వాస్పత్రిలో కిడ్నీ వ్యాధుల వైద్యులతో తండాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి కిడ్నీ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్య బృందం నిత్యం ఆ తండాల్లో పర్యటిస్తూ కిడ్నీ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయడమే కాకుండా మందులు అందిస్తున్నారు.

రక్షిత మంచినీటి సరఫరా

కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చొరవతో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా చేశారు. అందుకోసం రూ.6 కోట్ల నిధులు కేటాయించారు. శాశ్వత పరిష్కారం కోసం ఆ ప్రాంతంలోని ప్రతి తండాకు కృష్ణానది నీటిని సరఫరా చేసేందుకు జల్ జీవన్ మిషన్ రూ.49.95 కోట్లు గ్రాంటుతో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టారు.

విస్తృత అవగాహన

కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు తండాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు



కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్న వైద్యులు

నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జీవనశైలి వ్యాధుల నివారణపై మరింత అవగాహన కలిగిస్తున్నారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నివారించడం ద్వారా కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని సూచిస్తున్నారు. అందులోభాగంగా కళాజాత బృందాలతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్నారు.

చెంతనే డయాలసిస్ కేంద్రం

ఒకప్పుడు కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకోవాలంటే తిరువూరు, విజయవాడలకు వెళ్లేవారు. ఇప్పుడు ఎ.కొండూరులోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం తండా వాసులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. తండాల నుంచి డయాలసిస్ కోసం వచ్చే రోగుల కోసం ఒక వాహనాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. షెడ్యూల్ ప్రకారం వైద్య ఆరోగ్య సిబ్బంది వారిని డయాలసిస్ కేంద్రానికి తీసుకువచ్చి, డయాలసిస్ అనంతరం తిరిగి ఇంటి వద్ద దించుతున్నారు.

కేంద్ర మంత్రి ప్రశంసలు

కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ ఈ ఏడాది జూన్‌లో కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య శిబిరాల నిర్వహణ, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, పరీక్షలు, మందులు అందజేత వంటి ముందస్తు చర్యలు బాగున్నాయని అభినందించారు.

సర్వే వివరాలు ఇలా...	
ఎ.కొండూరు మండల జనాభా	: 52298
15 తండాల్లోని జనాభా	: 14440
15 తండాల్లో కిడ్నీ వ్యాధి బాధితులు	: 414

ఇంటికే వెళ్లి మందులు అందిస్తున్నాం



వైద్య సిబ్బంది క్రానిక్ కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికే వెళ్లి మందులు అందిస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎల్ఎంలు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నప్పుడు మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటికే వెళ్లి 13 రకాల మందులు అందిస్తున్నారు. ఇంటింటికీ సురక్షిత మంచి నీరు అందిస్తున్నాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్ జిల్లా

లైంగిక దాడి కేసులో ఏడేళ్ల జైలు

గుంటూరు లీగల్: చిన్నారిపై జరిగిన లైంగిక దాడి కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2017 ఏప్రిల్ రెండో తేదీన పొన్నూరు రూరల్ మండలం చింతలపూడిలో తల్లిదండ్రులు ఉదయం పది గంటలకు చర్చిలో ప్రార్థనకు వెళ్లగా, వారి కుమార్తె ఇంటి దగ్గర ఆడుకుంటూ ఉంది. ఆదే గ్రామానికి చెందిన దాసరి కోటేశ్వరరావు అలియాస్ కోటయ్య చిన్నారిని బలవంతంగా తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. చిన్నారి గట్టిగా అరవడంతో చుట్టు పక్కల వారు వచ్చారు. దీంతో నిందితుడు పరారయ్యాడు. చుట్టుపక్కల వారు జరిగిన విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి రాంబాబు కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ కోర్టు మానిటరింగ్ సిబ్బందిని, కోర్టు కానిస్టేబుల్‌ను అభినందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	796	66,801
నిఫ్టీ ▽	232	19,901

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,672	▽	7
డోజోన్స్	34,747	△	229
ఎఫ్‌టీఎస్ఈ 100	7,732	△	72
డాక్స్	15,782	△	117
షాంఘై	3,109	▽	16
నికాయ్	33,023	▽	209

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,317
బంగారం (22 క్యారట్)	59,097
వెండి (కిలో)	72,204

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	82.46	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	101.50	104.89
€	యూరో	ఎకటి	87.44	90.55
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	55.50	57.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	52.69	54.99
S$	సింగపూర్ డాలర్	ఎకటి	60.07	62.01
SAR	సౌదీ రియాల్	ఛాయవకటి	21.20	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయవకటి	21.72	23.51
¥	చైనా యువాన్	ఛాయవకటి	10.26	12.34

మణిపాల్ చేతికి ఆమ్రి హాస్పిటల్స్

- 84 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 2,300 కోట్లు



కోల్‌కతా/న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ తాజాగా ఇమామీ గ్రూప్ సంస్థ ఆమ్రి హాస్పిటల్స్‌లో 84% వాటాను సొంతం చేసుకుంది. సింగపూర్ కంపెనీ టిమాసెక్ హోల్డింగ్స్‌కు 59% వాటాగల మణిపాల్ ఇందుకు రుణాలుసహా రూ. 2,300 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. ఆమ్రి హాస్పిటల్స్‌లో 15% వాటాతో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఇమామీ గ్రూప్ ఇన్వెస్టర్‌గా కొనసాగనుంది. తాజా కొనుగోలుతో మణిపాల్ హాస్పిటల్స్ దేశ తూర్పు ప్రాంతంలో కార్యకలాపాలు విస్తరించనుంది. సంయుక్త సంస్థ దేశవ్యాప్తంగా 17 పట్టణాలు, నగరాలలో 9,500 పడకలతో 33 ఆసుపత్రులను నిర్వహించనుంది. వెరసి దేశీయంగా రెండో పెద్ద హెల్త్‌కేర్ సేవల సంస్థగా ఆవి ర్భవించనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఆమ్రి రుణ భారం రూ.1,600 కోట్లు కాగా.. రూ.2,400 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ జరిగినట్లు తెలుస్తోంది. క్లినికల్ నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలుగల ఆమ్రి హాస్పిటల్స్‌ను జత కలుపుకోవడం ద్వారా భారీ నెట్‌వర్క్‌కు తెరలేవనున్నట్లు మణిపాల్ పేర్కొంది. తద్వారా దేశ తూర్పుప్రాంతంలో అత్యంత నాణ్యమైన ఆరోగ్యపరిరక్షణ సేవలకు పెరుగుతున్న డిమాండుకు అనుగుణమైన సేవలు అందించేందుకు వీలు చిక్కనున్నట్లు తెలియజేసింది. అయితే మణిపాల్ 2021లో కోల్‌కతాలోని కొలంబియా ఏషియా హాస్పిటల్స్‌ను కొనుగోలు చేయడం ద్వారా తూర్పు భారతంలో కార్యకలాపాలు ప్రారంభించింది. కాగా.. హెల్త్‌కేర్ రంగ మరో దిగ్గజం అపోలో హాస్పిటల్స్ 10,000 పడకల సామర్థ్యంతో 64 ఆసుపత్రులను నిర్వహిస్తోంది.

అదానీ గ్రీన్‌లో టోటల్ ఎనర్జీ
రూ. 2,500 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్‌తో ఏర్పాటు చేయనున్న శుద్ధ ఇంధన భాగస్వామ్య కంపెనీ(జేవీ)లో 30 కోట్ల డాలర్ల(రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ తాజాగా వెల్లడించింది. కొత్తగా నెలకొల్పనున్న జేవీలో 50 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. మిగిలిన 50 శాతం వాటాను అదానీ గ్రీన్ ఎనర్జీ పొందనుంది. ఈ జేవీ మొత్తం 1,050 మెగావాట్ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉండనుంది. వీటిలో 300 మెగావాట్ల సామర్థ్యం ఇప్పటికే ప్రారంభంకాగా.. 500 మె.వా నిర్మాణంలో ఉంది. మరో 250 మె.వా సోలార్, విండ్ కలయికతో అభివృద్ధి దశలో ఉంది. కాగా.. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తదుపరి గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీతో ఫ్రెంచ్ దిగ్గజం టోటల్ తొలిసారి పబ్లిక్ డీల్‌ను కుదుర్చుకోవడం



గమనార్హం! శుద్ధ ఇంధన ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా టోటల్ తాజా పెట్టుబడులను చేపట్టింది. ఇప్పటికే అదానీ గ్రీన్ ఎనర్జీలో 19.7 శాతం వాటాను కలిగిన టోటల్.. 2,353 మె.వా. పోర్ట్‌ఫోలియోగల ఏజీఈ23ఎల్(జేవీ)లో అదానీ గ్రీన్‌తో సమాన వాటాను కలిగి ఉంది. ఇక 2019లోనే అదానీ టోటల్ గ్యాస్‌లో 37.4 శాతం వాటాను టోటల్ పొందింది. ఇందుకు 30 కోట్ల డాలర్ల(రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది.

ఏషియా హెల్త్‌కేర్ గూటికి ఏఐఎన్‌యూ

రూ. 600 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ(ఏఐఎన్‌యూ)లో మెజారిటీ వాటాను సొంతం చేసుకున్నట్లు ఏషియా హెల్త్‌కేర్ హోల్డింగ్స్(ఏహెచ్‌హెచ్) తాజాగా పేర్కొంది. తదుపరి దశలో రూ. 600 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. పెట్టుబడులను ప్రైమరీ, సెకండరీ ఈక్విటీ మార్గంలో చేపట్టనున్నట్లు తెలియజేసింది. తాజా కొనుగోలు ద్వారా ఏహెచ్‌హెచ్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లోకి ప్రవేశించనుంది. డాక్టర్లయిన సి. మల్లికార్జున్, పి.సి. రెడ్డిల నేతృత్వంలో ప్రముఖ యూరాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు కలిసి 2013లో ఏఐఎన్‌యూను ఏర్పాటు చేశారు. దీనికి హైదరాబాద్, విశాఖపట్టణం, సిలిగురి, చెన్నైలలో 7 ఆసుపత్రులు ఉన్నాయి. రోబోటిక్ యూరాలజీ సర్జరీలో ప్రత్యేకతను కలిగి ఉంది. 500కుపైగా పడకలతో సేవలను అందిస్తోంది. 4 లక్షలకుపైగా రోగులకు సేవలు అందించడంతోపాటు యూరాలజీలో 1,000కి పైగా రోబోటిక్ సర్జరీలను పూర్తి చేసింది. తమ ప్లాట్‌ఫామ్‌కు ఏఐఎన్‌యూ కొత్త స్పెషాలిటీలను జత చేయడమేకాకుండా సంస్థ విజన్ మరింత పటిష్టమయ్యేందుకు దోహదపడనుందంటూ ఏహెచ్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విశాల్ బాలి పేర్కొన్నారు. నగరాలలోనేకాకుండా టైర్–2 పట్టణాలలోనూ యూరాలజీ రోబోటిక్ సర్జరీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏఐఎన్‌యూ ఎండీ, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున్ తెలియజేశారు. భవిష్యత్‌లో యూరోఆంకాలజీ, యూరోగైనకాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ సేవలకు డిమాండ్ పెరిగే వీలున్నట్లు ఈడీ పి.సి. రెడ్డి వివరించారు. సంస్థ తదుపరి దశ వృద్ధికి ఏహెచ్‌హెచ్ దోహదపడగలదని పేర్కొన్నారు. 2017లో ప్రారంభమైన ఏహెచ్‌హెచ్ పోర్ట్‌ఫోలియోలో మదర్‌హుడ్ హాస్పిటల్స్, నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ వంటి సంస్థలు ఉన్నాయి. మదర్‌హుడ్ హాస్పిటల్స్‌కు 11 నగరాల్లో 23 మహిళా, శిశు ఆస్పత్రులు, నోవా ఐవీఎఫ్‌కు 44 నగరాల్లో 68 ఐవీఎస్ సెంటర్లు ఉన్నాయి.

ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

5.25–5.5 శాతం వద్దే ఫండ్స్ రేట్లు

న్యూయార్క్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకు తాజాగా నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతం వద్దే కొనసాగనున్నాయి. ఉపాధి, హౌసింగ్ గణాంకాలు నీరసించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతున్న సంకేతాలు యథాతథ పాలసీ అమలుకు కారణమైనట్లు ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ పేర్కొన్నారు.



వెరసి రెండు రోజుల పాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ).. గత 18 నెలల్లో రెండోసారి వడ్డీ రేట్ల పెంపునకు విముఖత చూపింది. ప్రస్తుత రేట్లు గత రెండు దశాబ్దాలలోనే అత్యధికంకాగా.. 2022 మార్చి నుంచి దశలవారీగా ఫెడ్.. 5.25 శాతంమేర వడ్డీ రేట్లను పెంచింది. దీంతో రుణాలు, క్రెడిట్ కార్డు చెల్లింపులపై వడ్డీలు భారంగా మారినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా ధరలు ఫెడ్ లక్ష్యాన్ని మించుతున్నప్పటికీ లేబర్ మార్కెట్, హౌసింగ్ రంగం మందగించడంతో భవిష్యత్‌లోనూ ఎఫ్‌వోఎంసీ రేట్ల పెంపునకు ఆసక్తి చూపకపోవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

20 వేల దిగువకు నిఫ్టీ

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్ల పతన ప్రభావం
- ఫెడ్ వడ్డీ రేట్ల వెల్లడికి ముందు జాగ్రత్త
- 796 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- గత రెండు నెలల్లో అతిపెద్ద పతనం

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(4%), రిలయన్స్ ఇండస్ట్రీస్(2%) షేర్ల పతనంతో స్టాక్ సూచీలు బుధవారం ఒకశాతానికి పైగా నష్టపోయాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి (బుధవారం రాత్రి)కి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సైతం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 796 పాయింట్లు క్షీణించి 66,801 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 232 పాయింట్లు పతనమై 20 వేల స్థాయి దిగువన 19,901 వద్ద నిలిచింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. ట్రేడింగ్ ప్రారంభం అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్స్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 868 పాయింట్లు నష్టపోయి 66,728 వద్ద, నిఫ్టీ 254 పాయింట్లు క్షీణించి 19,879 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,111 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.573 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. సెన్సెక్స్ రెండు రోజుల పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.89 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.320 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ బుధవారం జీవితకాల కనిష్ట స్థాయి (83.32) నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 21 పైసలు బలపడి 83.11 స్థాయి వద్ద స్థిరపడింది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ పాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడికి ముందు చోటు చేసుకున్న అప్రమత్తతతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ నెలకొని ఉంది.



మార్కెట్లో మరిన్ని సంగతులు ...

- ఆర్ ఆర్ కేబుల్ షేరు లిస్టింగ్ పర్లేదనిపించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.1,035)తో పోలిస్తే 14% ప్రీమియంతో రూ.1,179 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 17% ఎగసి రూ.1,213 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 16% లాభంతో 1,197 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,500 కోట్లుగా నమోదైంది. పబ్లిక్ ఇష్యూ ముగిసిన రెండురోజుల్లోనే ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యి టీ+2 టైంలైన్ విధానంలో లిస్టయిన తొలి కంపెనీగా రికార్డుకెక్కింది.
- చివరి రోజు నాటికి యాత్రా ఆన్‌లైన్ ఐపీఓకు 1.61 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 3.09 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా 4.98 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 2.11 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనం తర్వాత జూలై ఒకటి నుంచి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగే అవకాశం ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సోమవారం ప్రకటించింది. అలాగే నోమురా బ్రోకరేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు రేటింగ్‌ను 'బై' నుంచి 'న్యూట్రల్'కి డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో ఈ బ్యాంకు షేరు 4% నష్టపోయి రూ.1564 వద్ద స్థిరపడింది. షేరు భారీ పతనంతో ఒక్క రోజులోనే దాదాపు రూ.50 వేల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయింది. సెన్సెక్స్, నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- ఎంఅండ్ఎం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్లను అధిగమించింది. ఎస్‌యూవీ విభాగం, ట్రాక్టర్లకు బలమైన ఆర్డర్లు లభించడం ఇందుకు తోడ్పడిందని కంపెనీ తెలిపింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు రూ.1634 వద్ద ముగిసింది.

వాట్సాప్ పేమెంట్స్ సేవల విస్తరణ

వ్యాపార సంస్థల కోసం మరిన్ని ఫీచర్లు

ముంబై: మెసేజింగ్ యాప్ వాట్సాప్ తాజాగా భారత మార్కెట్లో తమ చెల్లింపుల సేవలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వ్యాపార సంస్థలకు కొనుగోలుదారులు చేసే పేమెంట్స్ ప్రక్రియను సులభతరం చేసింది. 'వాట్సాప్ బిజినెస్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించే భారతీయ వ్యాపార సంస్థలన్నింటికీ మా పేమెంట్స్ సర్వీసును విస్తరిస్తున్నాం. కొనుగోలుదారులు తమకు కావాల్సిన ఉత్పత్తులను వాట్సాప్‌లోనే కార్ట్‌కి జోడించుకోవడంతో పాటు తమకు నచ్చిన పేమెంట్ విధానం ద్వారా .. అంటే వాట్సాప్ లేదా యూపీఐ యాప్‌లు, డెబిట్ .. క్రెడిట్ కార్డులతో కూడా చెల్లించవచ్చు. ఇందుకోసం ఇతర వెబ్‌సైట్‌కి గానీ, మరో యాప్‌కి గానీ వెళ్లనక్కర్లేదు. వ్యక్తిగతంగా వెళ్లి చెల్లించనక్కర్లేదు' అని సంస్థ తెలిపింది. ఈ ఫీచర్ ఇప్పటికే సింగపూర్, బ్రెజిల్‌లో చిన్న వ్యాపార సంస్థల కోసం కంపెనీ అమలు చేస్తోంది. వ్యాపార సంస్థలు, కొనుగోలుదారులు మెసేజింగ్ ఫీచర్‌ను సమర్థంగా వినియోగించుకునే విషయంలో ప్రపంచానికి భారత్ సారథ్యం వహిస్తోందని బిజినెస్ మెసేజింగ్ సదస్సు 'కన్వర్సేషన్స్' కార్యక్రమంలో వర్చువల్‌గా



పాల్గొన్న వాట్సాప్ మాతృసంస్థ మెటా వ్యవస్థాపకుడు, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు.

వాట్సాప్ ఫ్లోస్, వెరిఫైడ్ బ్యాడ్జ్ ..

మెసేజింగ్ ఫార్మాట్లు, గ్రూప్ చాట్స్, బ్రాడ్‌కాస్ట్ చానల్స్ విషయంలో మెటా ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను ఆవిష్కరిస్తోందని జుకర్‌బర్గ్ చెప్పారు. ఇందులో భాగంగా వ్యాపార సంస్థల కోసం వాట్సాప్ ఫ్లోస్, మెటా వెరిఫైడ్ బ్యాడ్జిలను విస్తృతంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ బుకింగ్, ఉత్పత్తులను ఆర్డర్ చేయడం, ఫ్లైట్స్‌లో చెకిన్ చేయడం వంటి అంశాల్లో కస్టమర్లకు వెసులుబాటు కల్పించేలా వాట్సాప్ ఫ్లోస్‌ను వ్యాపార సంస్థలు ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, మెటా వెరిఫైడ్ బ్యాడ్జిలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

» నాబార్డ్‌లో 150 అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ పోస్టులు
» ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.లక్ష వరకు స్థూల వేతనం

నాబార్డ్‌లో అసిస్టెంట్ మేనేజర్

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్..నాబార్డ్! వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విభాగాల్లో.. బ్యాంకింగ్ ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన బ్యాంకు! ఇందులో కొలువు సొంతమైతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకున్నట్లే! వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలు కూడా భారీ స్థాయిలోనే ఉంటాయి. నాబార్డ్ తాజాగా 150 అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. నాబార్డ్ పోస్టులకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్(రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీస్) గ్రేడ్–ఎ హోదాలో మొత్తం 150 పోస్టులను భర్తీ చేయనుంది. మూడంచెల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి.. నియామకం ఖరారు చేసుకున్న వారికి నెలకు రూ.44,500 మూల వేతనం అందిస్తారు. ఇతర అలవెన్స్‌లు అన్ని కలిపి నెలకు రూ.లక్ష స్థూల వేతనం లభిస్తుంది.

అర్హతలు

పోస్ట్‌ను అనుసరించి 60% మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ/బీటెక్ లేదా సంబంధిత స్పెషలైజేషన్‌తో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

సెప్టెంబర్ 1, 2023 నాటికి 21–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్‌సీ/ఎస్‌టీలకు అయిదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్స్ గ్రేడ్–ఎ నియామకాలకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

ప్రిలిమ్స్ 200 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమ్స్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, డెసిషన్ మేకింగ్ 10 ప్రశ్నలు–10 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్ 40 ప్రశ్నలు –40 మార్కులు, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ 40 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం 120 నిమిషాలు.

జనరలిస్ట్.. స్పెషలిస్ట్‌లకు వేర్వేరుగా

ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. ప్రిలిమినరీలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 25 మందిని చొప్పున(1:25 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష జనరలిస్ట్ పోస్ట్‌లకు, స్పెషలిస్ట్ పోస్ట్‌లకు వేర్వేరుగా ఉంటుంది. ఈ పరీక్షను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానాల్లో నిర్వహిస్తారు.

200 మార్కులకు జనరలిస్ట్ మెయిన్

- జనరలిస్ట్ మెయిన్ ఎగ్జామ్ రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్–1లో జనరల్ ఇంగ్లిష్‌లో 3 ప్రశ్నలు(100 మార్కులు) అడుగుతారు. వీటికి డిస్క్రిప్టివ్ విధానంలో కంప్యూటర్‌పై సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- పేపర్–2లో ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతారు. 30 ప్రశ్నలు(50 మార్కులు) ఆబ్జెక్టివ్ విధానంలో, ఆరు ప్రశ్నలు(90 మార్కులు) డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి.
- డిస్క్రిప్టివ్ విధానంలోని ఆరు ప్రశ్నల్లో కనీసం నాలుగు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు లభించే సమయం మూడున్నర గంటలు.

స్పెషలిస్ట్ పోస్ట్‌లకు ఇలా

- స్పెషలిస్ట్ పోస్ట్‌లకు కూడా రెండు పేపర్లుగా(పేపర్–1, పేపర్–2) పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1లో..జనరల్ ఇంగ్లిష్‌లో 3 ప్రశ్నలు(100 మార్కులు) ఉంటాయి. వీటికి డిస్క్రిప్టివ్ విధానంలో కంప్యూటర్‌పై సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.



- పేపర్–2లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌పై 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు(50 మార్కులు), ఆరు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు(50 మార్కులు) అడుగుతారు. డిస్క్రిప్టివ్ ప్రశ్నల్లో కనీసం నాలుగు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. మొత్తంగా 200 మార్కులకు స్పెషలిస్ట్ పోస్ట్‌లకు మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు.

తుది దశ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ 50 మార్కులకు జరుగుతుంది. మెయిన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని(1:3 నిష్పత్తిలో) చొప్పున ఎంపిక చేసి.. వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపి తుది విజేతలుగా నిలిస్తే నియామకం ఖరారు చేస్తారు.

ప్రిపరేషన్ పక్కాగా

ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్

ఈ విభాగంలో రాణించేందుకు భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపం, గ్లోబలైజేషన్, ఆర్థిక సంస్కరణలు, ద్రవ్యోల్బణం, పేదరిక నిర్మూలన–ఉపాధి కల్పన, దీనికి సంబంధించి ప్రభుత్వ పథకాలు, జనాభా వృద్ధి; వ్యవసాయం–ప్రస్తుత పరిస్థితులు, సంస్థాగత మార్పులు,సాంకేతిక మార్పులు, ఆహార భద్రత సమస్యలు,ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. సోషల్ ఇష్యూస్‌కు సంబంధించి సామాజిక వ్యవస్థ, బహుళ సంస్కృతి విధానం, పట్టణీకరణ, వలసలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, నిరక్షరాస్యత –సామాజిక, ఆర్థిక సమస్యలు, సామాజిక న్యాయం, సామాజిక ఉద్యమాలు, భారత రాజకీయ వ్యవస్థ, మానవాభివృద్ధి తదితర అంశాలను అధ్యయనం చేయాలి.

అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్

వ్యవసాయం, పంటల వర్గీకరణ, ఆగ్రో క్లైమేటిక్ జోన్స్, సాగు పద్ధతులు, సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్, వాటర్ రిసోర్స్, ఫార్మ్ అండ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్, యానిమల్ హజ్బెండరీ, పౌల్ట్రీ ఇండస్ట్రీ, ఫారెస్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ విస్తరణ, పర్యావరణం–మార్పులు తదితర అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. రూరల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి గ్రామీణ ప్రాంత భావనలు, భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్వరూపం–ప్రాధాన్యం; ఆర్థిక, సామాజిక, భౌగోళిక అంశాల్లో గ్రామీణ విభాగం ప్రాధాన్యత, గ్రామీణ జనాభా, పంచాయతీ రాజ్ సంస్థలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

మిగిలిన విభాగాలకు ఇలా

- రీజనింగ్‌లో.. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.
- కంప్యూటర్ నాలెడ్జ్‌కు సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, బేసిక్ హార్డ్‌వేర్స్(సీపీయూ, మానిటర్)ల గురించి తెలుసుకోవాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో..స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్,పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్,ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ అవేర్‌నెస్‌లో రాణించాలంటే.. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:సెప్టెంబర్ 23, 2023
- ప్రిలిమినరీ రాత పరీక్ష తేదీ: అక్టోబర్ 16, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nabard.org
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://ibpsonline.ibps.in/nabardaug23

వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 153 కొలువులు

జాబ్స్ ఇన్ఫో

ప్రభుత్వ మినీరత్న సంస్థ..సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 153 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులను అనుసరించి ఇంజనీరింగ్ డిగ్రీ, బీఎస్సీ, బీకాం, బీఏ, సీఏ, పీజీ ఉత్తీర్ణత ఉండాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 153

అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–18, అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–05, అకౌంటెంట్–24, సూపరింటెండెంట్(జనరల్)–11, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–81, సూపరింటెండెంట్(జనరల్)–ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)–2, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ –ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)–10, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–ఎస్ఆర్‌డీ(లద్దాఖ్ యూటీ)–2 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్):** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి.
- **అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్):** ఈ పోస్టులకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ /బీటెక్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అకౌంటెంట్:** బీకాం/బీఏ(కామర్స్) లేదా చార్టర్ అకౌంటెంట్ గా మూడేళ్ల పని అనుభవం ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు.
- **సూపరింటెండెంట్(జనరల్):** ఏదైన విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తిచేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** అగ్రికల్చర్/జూవాలజీ/కెమిస్ట్రీ/బయో–కెమిస్ట్రీ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అన్ని పోస్టులకూ కంప్యూటర్ నాలెడ్జ్‌ను అదనపు అర్హతగా పరిగణిస్తారు.

వయసు: 24.09.2023 నాటికి జేటీఏ పోస్టులకు 28 ఏళ్లలోపు ఉండాలి. మిగతా ఉద్యోగాలకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులకు వయోసడలింపు లభిస్తుంది.

వేతనాలు

అసిస్టెంట్ ఇంజనీర్, అకౌంటెంట్, సూపరింటెండెంట్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.40,000–రూ.1,40,000(ఈ–1) వేతనంగా లభిస్తుంది. అలాగే జూనియర్ అసిస్టెంట్ ఎంపికైన వారు రూ.29,000–రూ.93,000 వేతనంగా పొందవచ్చు.

రాత పరీక్ష

- **అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)/(ఎలక్ట్రికల్):** ఈ పోస్టులకు సంబంధించి రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 145 ప్రశ్నలకు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో 6 విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.
- **అకౌంటెంట్:** ఆన్‌లైన్ పరీక్షలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–35 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలకు–20 మార్కులకు ఉంటుంది. ప్రొఫెషనల్ నాలెడ్జ్ 65 ప్రశ్నలకు–65 మార్కులు. పరీక్ష వ్యవధి 3 గంటలు.
- **సూపరింటెండెంట్(జనరల్):** ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో రెండున్నర గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలకు–200 మార్కులు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలకు–50 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలకు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.



- **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో రెండున్నర గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలకు–200 మార్కులు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలకు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–35 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలకు–40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 –ప్రశ్నలు 20 మార్కులు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 24.09.2023
- వెబ్‌సైట్: https://www.cewacor.nic.in

క్లుప్తంగా...

434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి బుధవారం నోటిఫికేషన్ ఇచ్చారు. కాంట్రాక్ట్ విధానంలో వీటిని భర్తీ చేయనున్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం ఐదు వరకూ http://cfw.ap.nic.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి. ఈ ఫారాలను వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సంబంధిత రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ/బీఎస్సీ నర్సింగ్ చదివి ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి 42 ఏళ్లు పైబడని వారు దరఖాస్తుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్-సర్వీస్ మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు చొప్పున సడలింపు ఉంటుంది. ఓసీ అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు రూ.300 చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాలి. వైద్య శాఖ అవసరాలకు అనుగుణంగా ఖాళీల సంఖ్య ఇంతకంటే పెరిగే/తగ్గే అవకాశం ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మెరిట్ లిస్ట్ ఏడాది పాటు అమల్లో ఉంటుందని తెలిపారు.

జోన్‌ల వారీగా ఖాళీలు
జోన్ 1- 86
జోన్ 2- 220
జోన్ 3- 34
జోన్ 4- 94
మొత్తం- 434

క్రమబద్ధీకరణపై కాంట్రాక్ట్ లెక్చరర్ల హర్షం

సాక్షి, అమరావతి: కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయమని కాంట్రాక్ట్ లెక్చరర్ల ఫెడరేషన్ పేర్కొంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ముసాయిదా బిల్లుపై కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఈ బిల్లుతో 3,600 మంది కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, 350 కాంట్రాక్టు పాలిటెక్నిక్ లెక్చరర్లు, 600 మంది డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు లబ్ధి పొందనున్నారని సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి పఠాన్ కరీంఖాన్ తెలిపారు.

సెంట్రల్ వర్సిటీ చాన్సలర్‌గా శంకర్ ఆచార్య



అనంతపురం: అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ చాన్సలర్‌గా భారత ప్రభుత్వ మాజీ ఆర్థిక ముఖ్య సలహాదారు డాక్టర్ శంకర్ ఆచార్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులిచ్చారు. డాక్టర్ శంకర్ ఆచార్య దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తల్లో ఒకరు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆరేళ్ల పాటు సలహాదారుగా, ఎనిమిదేళ్ల పాటు (1993–2001) మధ్య ప్రధాన సలహాదారుడిగా పనిచేశారు. మన్మోహన్ సింగ్, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హా వంటి ఆర్థిక మంత్రులకు సలహాలు అందించారు. సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) సభ్యుడిగానూ ఉన్నారు. 2001 నుంచి 12వ ఆర్థిక సంఘం సభ్యుడిగా, 2009–13 మధ్య జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా పనిచేశారు. కోటక్ మహీంద్ర బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా 12 ఏళ్ల పాటు వ్యవహరించారు. వరల్డ్ బ్యాంక్‌లోనూ పనిచేశారు. బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో 18 ఏళ్లుగా కాలమిస్ట్‌గా ఉన్నారు. 2005–16 మధ్య రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సలహా బోర్డులలో పనిచేశారు.

కరెన్సీ గణపతి



కృష్ణాజిల్లా మచిలీపట్నం చెమ్మనగిరిపేటకు చెందిన ఝాన్సీరాణి తయారు చేసిన కరెన్సీ గణపతి అందర్నీ ఆకట్టుకుంటున్నాడు. ఈ ప్రతిమ తయారీకి రూ.20 వేల కరెన్సీ నోట్లు, నాణేలు వినియోగించారు. ఇది నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

–మచిలీపట్నంటౌన్

సంతాన గణపతికి కరెన్సీ అలంకరణ



కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడలో సంతాన గణపతిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు సుమారు రూ.25 లక్షల కరెన్సీ నోట్లను ఇందుకు వినియోగించారు. కరెన్సీ అలంకరణలోని సంతాన గణపతిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

– పిఠాపురం

గొర్రెలకు అరుదైన గుర్తింపు

- నాగావళి, మాచర్ల జాతులకు అధికారిక గుర్తింపునిచ్చిన ఎన్‌బీఏజీఆర్
- ఎస్వీవీ యూనివర్సిటీ కృషి ఫలితం
- ఏపీ పశుగణాభివృద్ధిలో కీలక ముందడుగు



సాక్షి, అమరావతి: శతాబ్దాల నాటి అరుదైన గొర్రె జాతులకు ఎట్టకేలకు నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్‌బీఏ జీఆర్) గుర్తింపు లభించింది. నాటు గొర్రెలుగా ముద్ర పడిన నాగావళి, మాచర్ల ప్రాంతాల గొర్రె జాతులకు శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం కృషితో అధికారిక గుర్తింపు లభించింది. దేశంలో రెండొందలకు పైగా గొర్రె జాతులను అధికారికంగా గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని గొర్రెల్లో జన్యు వైవిధ్యం ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం నెల్లూరు జాతి గొర్రెలకు మాత్రమే గుర్తింపు లభించింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన నాగావళి గొర్రె(విజయనగరం నాటు గొర్రె)లతో పాటు పల్నాడు ప్రాంతానికి చెందిన మాచర్ల (కృష్ణ) గొర్రెలను అధికారికంగా గుర్తించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఏదైనా కొత్త జాతిని గుర్తించాలంటే వాటి బాహ్య, జన్యు లక్షణాల నిర్ధారణ, జనాభా స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ దిశగా శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న మాచర్ల, గరివిడి పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు 15 ఏళ్లపాటు లోతైన అధ్యయనం చేసి శాస్త్రీయ ఆధారాలతో నివేదిక సమర్పించాయి.

అధికారిక గుర్తింపుతో ప్రయోజనాలివీ

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు పొందాలంటే గొర్రెల జాతులను స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఉత్తరాంధ్రా, పల్నాడు, రాయలసీమ ప్రాంతవాసులు తాము పెంచే జాతులను నాటు గొర్రెలుగా పేర్కొనాల్సి రావడంతో తగిన లబ్ధి, ఆశించిన ధర పొందలేకపోతున్నారు. ప్రస్తుతం వీటికి అధికారిక గుర్తింపు లభించడంతో వాటిని పెంచేవారు ఇకపై అన్ని రకాల లబ్ధి పొందగలరు. పునరుత్పత్తి కోసం ఉపయోగించే పొట్టేళ్ల ధర ప్రస్తుతం రూ.30 వేలు కాగా గుర్తింపుతో రూ.45 వేలు పలికే అవకాశం ఉంది. ఆడ గొర్రెలకు ప్రస్తుతం రూ.10 వేలు లభిస్తుండగా.. ఇకపై రూ.15 వేల వరకు పలుకుతాయి.

కీలక ముందడుగు



నాగావళి, మాచర్ల గొర్రె జాతులకు గుర్తింపు లభించడం ఏపీ పశు గణాభివృద్ధిలో కీలకమైన ముందడుగు. 15 ఏళ్లుగా వర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలు, అధ్యయనం ఎట్టకేలకు ఫలించాయి. గుర్తింపుతో ఈ జాతుల పరిరక్షణకు పెద్దఎత్తున నిధులు మంజూరవుతాయి.

– డాక్టర్ కె.సర్జన్‌రెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్, ఎస్వీవీ విశ్వవిద్యాలయం

కృష్ణ గొర్రెలకు వందేళ్ల చరిత్ర



మాచర్ల గొర్రెల జన్మస్థలం కృష్ణా నది పరీవాహక ప్రాంతం కావడంతో వీటిని కృష్ణ గొర్రెలుగా పిలుస్తారు. నదికి ఇరువైపులా రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఏపీలో 6.60 లక్షల సంపద ఉందని అంచనా. నెల్లూరు, ముజఫర్ నగర్ గొర్రెల కంటే అధిక బరువు కలిగి ఉంటాయి. నలుపు, తెలుగు, గోధుమ రంగుల్లో ఉంటాయి. తల కుంభాకారంగా, చెవులు, తోక గొట్టాల వలె ఉంటాయి. కొమ్ములు తలకి సమాంతరంగా వుంటాయి. మొదటి ఈత 18–24 నెలలకు వస్తాయి. 20 శాతంపైగా కవలలకు జన్మనిస్తాయి.ప్రతి రెండేళ్లకు 3 పిల్లల చొప్పున ఏడేళ్ల జీవిత కాలంలో 6–8 పిల్లలకు జన్మనిస్తాయి. పొట్టేలు 53.25 కేజీలు, ఆడ గొర్రె 40 కేజీల వరకు పెరుగుతాయి.

యుద్ధాలు చేసిన గొర్రెలివి



నాగావళి జాతి గొర్రెలకు శతాబ్దాల చరిత్ర ఉంది. కళింగుల కాలంలో ఈ గొర్రెలను యుద్ధాలు, పందేలకు వినియోగించేవారని చెబుతుంటారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర, ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాల్లో సుమారు 9.90 లక్షల నాగావళి గొర్రెలు ఉన్నట్టు అంచనా. బూడిద, గోధుమ, తెలుపు మిశ్రమ వర్ణం కలిపి ఉంటాయి. తల పాము పడగ ఆకారం ఉంటుంది. కళ్ల చుట్టూ నల్లటి వలయం, నోరు, ఉదరం, కాళ్ల చివర భాగం నల్లగా, తోక సన్నగా, కాళ్లు, గిట్టలు బలంగా పొడవుగా ఉంటాయి. ఏడేళ్ల పాటు జీవించే ఈ గొర్రెలు ఏడాదిన్నర నుంచి ప్రతి రెండేళ్లకు 6 పిల్లలకు జన్మనిస్తాయి. పొట్టేలు 2.5 అడుగులు ఎత్తు పెరిగితే.. ఆడ గొర్రెలు మగ గొర్రెల కంటే 2 అంగుళాల తక్కువ ఎత్తు ఉంటాయి. పొట్టేలు 42 కిలోలు, ఆడ గొర్రెలు 35 కిలోల వరకు బరువు పెరుగుతాయి. 12 నెలల వయసులోనే మంచి మాంసం దిగుబడి వస్తుంది. వీటి మాంసంలో కొవ్వు శాతం చాలా తక్కువ. పరాన్న జీవులు, సూక్ష్మజీవుల వల్ల వచ్చే రోగాలను తట్టుకునే శక్తి వీటికి ఉంది. వీటిలో వ్యాధి నిరోధక శక్తి కూడా ఎక్కువగా ఉంటుంది.

ఇక గ్రామాల వారీగా అభివృద్ధి సూచికలు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 2030 నాటికి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యక్రమం
- అంతర్జాతీయ ప్రమాణాల మేరకు గ్రామాల వారీగా పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ రూపకల్పన



సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి అజెండాకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం–నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించేలా 'పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ–గ్రామాభివృద్ధి సూచికలు)' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మొదటగా.. ప్రభుత్వం నిర్దేశించుకున్న 17 రకాల 'సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' (ఎస్‌డీజీ)కి సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల స్థితిగతుల వివరాలను గ్రామాల వారీగా కంప్యూటరీకరిస్తారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రస్తుత ప్రజల జీవన ప్రమాణాలను గ్రామాల వారీగా ఒకేచోట కంప్యూటరీకరించేందుకు చేసే ప్రక్రియ విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జీవో 558 ఉత్తర్వులు జారీ చేశారు.

577 కీలక అంశాల ఆధారంగా..

వైద్య, ఆరోగ్య, విద్య, మహిళా సంక్షేమం, వ్యవసాయం, పశు సంవర్థక, గ్రామీణ గృహ నిర్మాణం, భూములు, స్వయం సహాయక పొదుపు సంఘాలు, ఉపాధి–మౌలిక వసతుల కల్పన తదితర విభాగాలకు సంబంధించి 577 కీలక అంశాల ఆధారంగా గ్రామాల వారీగా అక్కడి ప్రజల జీవన ప్రమాణాల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలా సేకరించిన వివరాలతో రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీకి వేర్వేరుగా ప్రాథమిక పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ) 2023–24గా రూపకల్పన చేయనున్నట్టు ఉత్తర్వుల్లో వివరించారు. ఇప్పుడు రూపొందించే పీడీఐలను ప్రామాణికంగా తీసుకుని 2030 సంవత్సరం కల్లా అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితి సూచించే స్థాయిలో రాష్ట్రంలోనూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ శాఖల ఆధ్వర్యంలో భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలను కొనసాగుతాయని ఉత్తర్వుల్లో వివరించారు.

గ్రామసభల ఆమోదం తప్పనిసరి

వివిధ ప్రభుత్వ శాఖలకు అనుబంధంగా గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బంది అందరి సహకారంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు 17 రకాల సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ)కు సంబంధించి 577 రకాల అంశాలపై సమాచారం సేకరించి, ఎక్కడికక్కడ పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లు రూపొందిస్తారు. అనంతరం ఆయా వివరాలను సంబంధిత గ్రామంలో జరిగే గ్రామసభ ముందుంచి దానికి ఆమోదం తీసుకుంటారు. తర్వాత దశలో పంచాయతీ స్థాయిలో రూపొందించే పీడీఐలను ఎక్కడికక్కడ ఎంపీడీవో ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన మండల కమిటీ వాటికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. మండల స్థాయిలో ఆమోదం పొందిన వేర్వేరు పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లను జిల్లా స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలో ఆమోదం పొందాల్సి ఉంటుంది.

సీఎస్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ

ఇందులో భాగంగా రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు వేర్వేరుగా పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ)ల రూపకల్పన పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మరో 19 ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యదర్శులతో స్టీరింగ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి తోడు గ్రామాల వారీగా కచ్చితమైన సమాచారంతో పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌ల రూపకల్పనకు వీలుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో 17 ప్రభుత్వ శాఖల కమిషనర్లతో రాష్ట్ర స్థాయిలో మరో డేటా వేల్యూయేషన్ కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో వివరించారు. దీనికి కన్వీనర్‌గా పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కొనసాగుతారు.

గుమ్మిడి చుక్క @ 38 కేజీలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట వారపుసంతకు మత్స్యకారులు బుధవారం తీసుకువచ్చిన భారీ గుమ్మిడి చుక్క అందర్నీ ఆకట్టుకుంటోంది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని సముద్రంలో లభించే ఈ చేప గరిష్టంగా పది కేజీలు మాత్రమే ఉంటుంది. అటువంటిది ఏకంగా 38 కేజీల చేప దొరకడంతో మత్స్యకారులు మార్కెట్లో అధిక ధర ప్రకటించారు. దీంతో 25 మంది వాటాదారులుగా మారి రూ.12,500లకు దీన్ని కొనుగోలు చేశారు.

–సాక్షి అమలాపురం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయుల దాష్టీకం

- నంద్యాల జిల్లా కోటకందుకూరులో ఘటన



గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త శేఖర్

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లాలో తెలుగుదేశం పార్టీ వర్గీయుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో భారీ తేడాతో టీడీపీ ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేని ఆ పార్టీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. వీరిలో ఓ మహిళా కార్యకర్త కూడా ఉన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ రూరల్ మండలం కోటకందుకూరు గ్రామంలో బుధవారం రాత్రి ఈ దాడి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటకందుకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి గత నెలలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఓటమిని జీర్ణించుకోలేని టీడీపీ వర్గీయులు ఏదో విధంగా గ్రామంలో అల్లర్లకు పాల్పడి భయాందోళనలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఊరేగింపు జరుగుతోంది. ఇదే అదనుగా తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు పూటుగా మద్యం తాగి రాడ్లు, కర్రలతో ఊరేగింపులో జొరబడ్డారు. ఇంటి వద్ద నిలబడి దేవుడి ఊరేగింపు చూస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త సులోచనతో అసభ్యకరంగా మాట్లాడుతూ గొడవకు దిగారు. ఆమె ఇంట్లోకి వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తుండగా దాడికి దిగారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు అక్కడికి రావడంతో చుట్టూ ఉన్న మరో 30 మంది టీడీపీ వర్గీయులు పెద్దగా కేకలు వేస్తూ కర్రలు, ఇనుప రాడ్లు, రాళ్లతో వైస్సార్‌సీపీ కార్యకర్తలపై మూకుమ్మడిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో సులోచనతోపాటు 10 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ సులోచన, శేఖర్, వెంకటరమణ, నరేశ్, నరసింహ, లక్ష్మీదేవిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శేఖర్, వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. సులోచన ఫిర్యాదు మేరకు ఆర్ల పెద్దసుబ్బయ్య, నడిపి సుబ్బయ్య, సుబ్రమణ్యంతో పాటు మరో 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు.

మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: మెడికల్ పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నీట్ పీజీ–2023లో జీరో పర్సంటైల్‌కు అర్హతను కుదిస్తూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) బుధవారం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తగ్గించిన పర్సంటైల్‌కు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులు పీజీ మెడికల్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. https://pgcq.ysruhs.com/ వెబ్‌సైట్‌లో శనివారం రాత్రి తొమ్మిది గంటలలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలపై సందేహాల నివృత్తికి 89787 80501, 7997710168, 93918 05238, 9391805239 నంబర్లలో సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు.

కామాంధుడికి యావజ్జీవం

- బుద్ధిమాంద్యం బాలికపై అత్యాచారం కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు

అనంతపురం: బుద్ధిమాంద్యం గల ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయి యగిడి నాగరాజుకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి బుధవారం సంచలన తీర్పు చెప్పారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు వికలాంగుల పాఠశాలలో చదువుతున్న ఎనిమిదేళ్ల బుద్ధిమాంద్యం కలిగిన బాలికను అదే గ్రామానికి చెందిన నాగరాజు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిపెడతానని 2018 జూన్ 23వ తేదీన గ్రామ శివారులోని తోటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా అరవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక ఇంటి వద్ద కనపడకపోవడంతో తల్లిదండ్రులు గాలిస్తుండగా.. రక్తపు గాయాలతో తోటనుంచి బయటకు వచ్చింది. విచారించగా అసలు విషయం చెప్పింది. దీంతో నాగరాజుపై ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు సెక్షన్ 376 ఏ, బీ (2) (ఎల్) ఐపీసీ, సెక్షన్ 5, 6 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ రామకృష్ణ కేసు దర్యాప్తు చేసి, ముద్దాయిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్ కె.విద్యావతి బాధితురాలి పక్షాన 13 మంది సాక్షులను విచారించారు. ముద్దాయిపై అభియోగాలు రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి విజయవాడ సిటీ


ఎన్టీఆర్ జిల్లా

గురువారం ၊ 21 ၊ సెప్టెంబర్ ၊ 2023



ముగిసిన చవితి ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాలు మూడో రోజైన బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పాఠశాల అభివృద్ధికి విరాళం



విన్నన్నపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి గ్రామ ప్రముఖుడు జగ్గవరపు రంగారెడ్డి రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని పాఠశాల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ పత్రాన్ని హెచ్ఎం ప్రసాద్‌కు బుధవారం అందజేశారు.

సరికొత్తగా స్వచ్ఛవాడ


స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నం.1 లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు

- బెజవాడను చెత్త రహితంగా తీర్చి దిద్దేందుకు కృషి
- ఇప్పటికే నగరంలోని మూడు కాలువల ప్రక్షాళన
- తాజాగా కృష్ణా నది తీరాన్ని శుభ్రం చేస్తున్న వైనం
- సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధంపైనా ప్రజలకు అవగాహన
- అక్టోబర్ 2 వరకు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమాలు



కృష్ణా తీరంలో వ్యర్థాలను తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బెజవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 02 వరకు 15 రోజుల పాటు చెత్తరహిత విజయవాడ సాకారం దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రజలను చైతన్యం చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో అంతర్గత రోడ్లను అన్నింటినీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. నగరంలో కాంపాక్ట్ బిన్స్ లేకుండా తడి, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసి ఇంటి వద్దనే సేకరిస్తున్నారు. దీనికోసం 250 సీఎన్‌జీ ఆటోలను వినియోగిస్తున్నారు. నగరంలో రోడ్లను శుభ్రం చేసేందుకు స్వీపింగ్ యంత్రాలను వాడుతున్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని నగరంలో అమలు చేసేందుకు వీలుగా ఏడుగురి సభ్యులతో కూడిన ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ప్రధానంగా నగరంలో షాపులు, తయారీ కేంద్రాలు, ప్లాస్టిక్ కవర్లు వినియోగించే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు.



వ్యర్థాలు తొలగించిన తర్వాత కాలువలో ప్రవాహం

కాలువలకు కొత్త రూపు..

విజయవాడలో కాలువలు కొత్త రూపు సంతరించుకున్నాయి. మూడు ప్రధాన కాలువలు బందరు, ఏలూరు, రైవస్ కాలువలను ప్రక్షాళన చేశారు. కాలువల గుండా పరిశుభ్రమైన నీరు ప్రవహించేందుకు వీలుగా మార్గం సుగమమైంది. కాల్వల్లో చెత్త చెదారం, ప్లాస్టిక్, గుర్రపు డెక్క, తూటికాడ, దాదాపు 6వేలకు పైగా టన్నుల వ్యర్థాలను తొలగించారు.

నంబర్ వన్ లక్ష్యం..

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో విజయవాడ నగరపాలక సంస్థకు గత ఏడాది 5వ ర్యాంకు సాధించింది. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది మరింత మెరుగైన ర్యాంకింగ్ కోసం వీఎంసీ వినూత్న ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్య విధానం అవలంబిస్తోంది. కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటోంది. గ్రీనరీని మరింత అభివృద్ధి చేస్తోంది.

మిషన్ క్లీన్ కృష్ణా..

కృష్ణా నది తీరాన్ని శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకొంటున్నారు. ఇందుకోసం మిషన్ క్లీన్ కృష్ణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రకాశం బ్యారేజీ నుంచి యనమలకుదురు వరకు 8 డివిజన్‌ల పరిధిలో నదీ తీర ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నది వెంబడి రిటైనింగ్ వాల్‌ను నిర్మించారు. రిటైనింగ్ వాల్ వెంబడి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు వీలుగా పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు నదీ తీరం వెంబడి చెత్త, ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేస్తున్నారు. దీని కోసం రోజుకు 2వేల మంది కార్మికులను వినియోగిస్తున్నారు. సెప్టెంబర్ 17న 18వ డివిజన్ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో రివర్ ఫ్రంట్ ప్రాంతంలో చీపుర్లతో ఊడ్చి, వ్యర్థాలను తొలగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నదిలో కలిసే డ్రెయిన్‌లను ఎస్టీపీలకు అనుసంధానం చేశారు.



వారధి వద్ద రిటైనింగ్ వాల్ పక్కన పరిస్థితి

ప్రజలు సహకరించాలి..



చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే విధంగా అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛ విజయవాడ సాకారానికి నగర ప్రజలంతా సహకరించాలి. ఇందులో భాగంగానే 15 రోజుల పాటు నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా అన్ని రోడ్లను శుభ్ర పరుస్తున్నాం. కృష్ణా నది తీరం వెంబడి వ్యర్థాలను తొలగిస్తున్నాం. ఇప్పటికే నగరంలో ఉన్న మూడు ప్రధాన కాలువలను శుభ్రం చేశాం. కెనాల్ బండ్స్‌ను అందంగా తీర్చిదిద్దాం. ప్రజలు కాలువల్లో, ఇంటి పక్కన ఉన్న సైడ్ డ్రెయిన్లలో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

'గోరుముద్ద' పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులకు పౌష్టికాహారలోపం తలెత్తకుండా మంచి ఆహారం అందించడమే జగనన్న గోరుముద్ద పథకం ప్రధాన ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కేబీఎస్ ప్రగతి అన్నారు. బుధవారం ఆమె పటమటలోని కోనేరు బసవయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో రూ. కోట్లు వెచ్చిస్తున్నారని, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఉద్యోగోన్నతి



డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఏడీఎంఈ)గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు వైద్య కళాశాల జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ కంచర్ల సుధాకర్ ఈ ఏడాది మార్చి 1 నుంచి కళాశాలకు ఫుల్ అడిషనల్ చార్జి(ఎఫ్ఏసీ)పై ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించి సిద్ధార్థ వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌గానే నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఇక నుంచి అడిషనల్ డైరెక్టర్ హోదాలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్‌కు పలువురు ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు వెండి ఓంకార హారతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడ చుట్టుగుంటకు చెందిన నాగలక్ష్మి దంపతులు ఆలయ ఈఈ లింగం రమాదేవిని కలిసి సుమారు 1.280 కిలోల వెండితో తయారు చేయించిన వెండి ఓంకారాన్ని అందజేశారు. ఓంకార హారతిని ప్రతి రోజు సాయం సమయంలో అమ్మవారికి జరిగే సంచహారతుల సేవలో ఉపయోగించాలని దాత కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతలకు బహూకరించారు.

శరవేగంగా 'స్మృతివనం'



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మితమవుతున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో జరుగుతున్న పనులను బుధవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించారు. విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. స్మృతివనంలో మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ పనులను శరవేగంగా పూర్తి చేయాలని, పెయింటింగ్ పనులు కూడా ప్రారంభించాలని ఆదేశించారు. స్మృతివనానికి ప్రధాన ఆకర్షణగా ఉండే ఫౌంటెన్ పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ రాయ్, ఈఈ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక



గుడివాడ టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగింది. డీవైఈఓ వెంకట పద్మారాణి ఈ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా 16 నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు అండర్-14, అండర్-17 విభాగాల ఎంపికలో పాల్గొన్నారు. క్రీడలలో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట అజయ్‌కుమార్, దాసరి శ్రీనివాసరావు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు దోనేపూడి దయాకర్, ఖో-ఖో జిల్లా కార్యదర్శి మడకా ప్రసాదు పాల్గొన్నారు.

నరసింహునికి రూ.22 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): స్థానిక యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి వివిధ రకాల వేలం పాటల ద్వారా రూ. 22.04 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం పలు రకాల బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు రూ. 3.69 లక్షలు, తులసీ పూలు అమ్ముకునేందుకు రూ. 4.60 లక్షలు, ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్, స్వామి వారి పటాలు అమ్ముకునేందుకు రూ. 13.70 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఏడాది కాల పరిమితితో పాటదారులకై వసం చేసుకున్నట్లు తెలిపారు. కొబ్బరికాయలు, కిరాణా సామగ్రి అమ్ముకునే హక్కుకు సరైన పాట రానందున వాయిదా వేసినట్లు చెప్పారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ భూపాలరావు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

యార్డుకు 30.196 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,196 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 28,861 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,500 వరకు లభించింది.

భవిత కేంద్రాల్లో ఉద్యోగాలు

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 42 ఐఈఆర్పీ పోస్టులకు నోటిఫికేషన్
- ఈ నెల 21 వరకు దరఖాస్తుల స్వీకరణ

పెడన: ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి బాసటగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా కేంద్రాల్లో విద్యాబోధనకు రిసోర్స్ పర్సన్స్ నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఖాళీల భర్తీకి జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఏడేళ్ల తర్వాత మళ్లీ భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీల నియామకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన చేపట్టే ఈ నియామకాలకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. డిగ్రీ అర్హతతో స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసి, ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ఊరటనిచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 42 ఖాళీలు..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 42 ఐఈఆర్పీలను భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు.



గన్నవరంలోని భవిత కేంద్రం

కృష్ణా జిల్లాలో 25, ఎన్టీఆర్ జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో(ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి విడిపోయి ఏలూరు జిల్లాలో కలిసిన ప్రాంతాలు) 9 భవిత కేంద్రాలుండగా వీటిలో ప్రస్తుతం 42 ఖాళీలున్నాయి. ఎంఆర్(మానసిక వైకల్యం) విభాగంలో 20, హెచ్ఐ/వీఐ(వినికిడి, దృష్టిలోపం) విభాగంలో 22 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎంఆర్ విభాగానికి సంబంధించి కృష్ణాలో 10, ఎన్టీఆర్‌లో 6, ఏలూరులో నాలుగు పోస్టులు ఖాళీలున్నాయి. అలాగే హెచ్ఐ/వీఐ విభాగానికి సంబంధించి కృష్ణాలో 12, ఎన్టీఆర్‌లో 5, ఏలూరు జిల్లాలో ఐదు ఖాళీలున్నాయి. వీటన్నింటినీ ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేలా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ప్రతి కేంద్రంలో ఇద్దరు..

ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ఉండాలి. కానీ జిల్లాలో అక్కడక్కడ మాత్రమే ఇద్దరు చొప్పున ఉన్నారు. మిగతా కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల కేంద్రాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది.

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 21వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో (apic.apcfss.in) దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రతి పోస్టుకు ఐదుగురు చొప్పున రాష్ట్ర కార్యాలయం నుంచి మెరిట్ లిస్టును 23న జిల్లా కార్యాలయంలో అందుబాటులో ఉంచుతారు.
- అక్టోబర్ 3 నుంచి 5 వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలన ఉంటుంది.
- 6 నుంచి 9వ తేదీ వరకు స్కిల్ టెస్ట్, పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూలను జిల్లా కమిటీ నిర్వహిస్తుంది.
- 10న ఎంపికైన వారి తుది జాబితా విడుదల చేస్తారు.
- 11న ఎంపికైన వారికి ఉత్తర్వులు ఇస్తారు. 12న అగ్రిమెంట్‌లపై కాంట్రాక్టు ఒప్పంద పత్రాలపై సంతకాలు. 16న విధుల్లో చేరేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

అభ్యంతరాలను పరిష్కరిస్తున్నాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా నమోదైన క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నగరంలోని జిల్లా కలెక్టర్ చాంబర్ నందు కలెక్టర్ ఢిల్లీరావు ఇంచార్జి డీఆర్వో వెంకటేశ్వర్లుతో కలసి ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులకు సంబంధించిన ఫారం 6,7,8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జిల్లాలో ఫారం -6లో 63,330 దరఖాస్తులు రాగా వీటిలో 56,109 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఫారం 7, 8లకు సంబంధించి కూడా సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 22న తదుపరి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డీటీ రాజేశ్వరి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

22 నుంచి హెల్త్ వర్సిటీ స్పోర్ట్స్ మీట్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తాడేపల్లి గూడెంలోని ఏఎస్ఆర్ హోమియోపతి మెడికల్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, బీఎన్‌వైఎస్, ఫిజియోథెరపీ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారు. వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, రిలే రేస్ పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తామని వివరించారు.





జై గణేశా.. జైజై గణేశా.. గణపతి బప్పా మోరియా నినాదాలు మార్మోగాయి. రెండు జిల్లాల వ్యాప్తంగా గణనాథుల నిమజ్జనోత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా జరిగాయి. డప్పు చప్పుళ్లతో శోభాయాత్రలు అట్టహాసంగా సాగాయి. యువతీ యువకులు, చిన్నా పెద్దా తేడా లేకుండా ఆడిపాడి సందడి చేశారు. ఉత్సవ శోభతో వీధులు కళకళలాడాయి. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా నదిలో విగ్రహాల నిమజ్జన దృశ్యాలను చిత్రాలలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దుర్గమ్మకు రూ. 59.75లక్షల ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మకు భక్తులు సమర్పించే ముక్క చీరల టెండర్లను ఆలయ అధికారులు బుధవారం నిర్వహించారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో ముక్కచీరలను దక్కించుకునేందుకు రూ. 2 లక్షల ప్రథమ దరావత్తుగా చెల్లించిన వీఎల్‌డీ ఏజెన్సీ, దీప్తి జ్యూయలర్స్, శ్రీ పావనీ కలెక్షన్స్, ఎస్ ఇన్వర్టర్స్ అండ్ ఇన్‌ఫ్రాలు వేలంలో పాల్గొన్నాయి. పావని కలెక్షన్స్ రూ. 37.25 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియను ఏఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

వాటర్ బాటిల్ కౌంటర్ రూ.22.50 లక్షలు

దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద వాటర్ బాటిల్స్ విక్రయించుకునే కౌంటర్ కోసం అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ప్రథమ దరావత్తుగా రూ. 50 వేలు చెల్లించిన దేవి ఎంటర్‌ప్రైజర్స్, సాయి ఏజెన్సీస్, లక్ష్మీ వెంకటేశ్వర ఎలక్ట్రికల్, కోదండ రామా ఎంటర్‌ప్రైజర్స్, శ్రీశ్రీ నివాస స్టోర్స్, వీఎల్‌డీ ఏజెన్సీ టెండర్‌లో పాల్గొన్నారు. కోదండ రామా ఎంటర్ ప్రైజర్స్ రూ. 22.50 లక్షలకు టెండర్ దక్కించుకుందని అధికారులు పేర్కొన్నారు. ఈవో భ్రమరాంబ పరిశీలించిన తుది నిర్ణయం వెల్లడించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఆ రెండు మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

నీతి ఆయోగ్ అధికారులకు వివరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యాస్పిరేషనల్ బ్లాక్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం(బ్లాకులు) మండలాలను అత్యున్నత స్థాయికి తీసుకువచ్చేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు నీతి ఆయోగ్ ఉన్నతాధికారులకు వివరించారు. బుధవారం ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ ఉన్నతాధికారులు వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన ప్రధాన మంత్రి యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌పై దేశ వ్యాప్తంగా సందేశాన్ని ఇవ్వనున్నారన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ఎంపిక చేసిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలలో ప్రత్యక్ష ప్రసారానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆ రెండు బ్లాకులు అభివృద్ధి చెందిన అర్బన్ బ్లాక్ దగ్గరగా ఉన్నందున ఆ స్థాయిలో అత్యుత్తమ బ్లాక్‌లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సబ్‌కా ఆకాంక్షేయిన్ సబ్‌కా వికాస్ కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

- అక్టోబర్ 3వ తేదీ సంపూర్ణ స్వస్థ్య – ఏక్ సంకల్ప్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల వద్ద ఇమ్యూనైజేషన్ డ్రైవ్, రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత శాతాన్ని పరిశీలిస్తామన్నారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు.
- 4న అంగన్ వాడీ కేంద్రాలలో పోషణ్ మేళా కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులలో ఆరోగ్యకర ఎదుగుదలను పరిశీలిస్తామన్నారు.
- 5న పంచాయతీలలో పారిశుద్ధ్యం, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.
- 6వ తేదీన పంచాయతీ భవన్‌లో వర్క్ షాపులు, సెమినార్లు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ ప్రదర్శనలు, వ్యవసాయ పర్యటనలు ఫార్మ్-టు టేబుల్ ఫుడ్ ఫెస్టివల్, గోబర్ ధన్, బయో వ్యవసాయ వనరులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
- అక్టోబర్ 7న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ అక్షరాస్యతపై వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు జరుగుతాయన్నారు.
- 8న పీఎం విశ్వ కర్మ పథకంపై అవగాహన, డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ, ఆర్థిక అక్షరాస్యత, ఈ కామర్స్ కార్యక్రమాలు ఉంటాయన్నారు.
- 9వ తేదీన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రదర్శనలు, ఉత్తమ అభ్యాసాలు ఉంటాయన్నారు. వర్చువల్ సమావేశంలో సీపీవో వై శ్రీలత, ఎంపీడీఓ బీవీ రామకృష్ణ నాయక్, ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8న ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 8న ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ హాజరయ్యారు. తొలుత దివంగత ఐజేయూ నేత అంబటి ఆంజనేయులుకు నివాళులర్పించారు. అక్టోబర్ 2న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఎస్కె బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. జయరాజ్, విజయవాడ యూనిట్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్.వసంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, జి.రామారావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, విజయవాడ అధ్యక్షులు ఎంవీ సుబ్బారావు యూనియన్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మున్నేటిలో మహిళ మృతదేహం



నందిగామ: మున్నేటిలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌హెచ్‌ఓ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం... సుమారు 40 సంవత్సరాలు వయసు గల మహిళ ఒంటిపై బ్లూ కలర్ డ్రెస్ ఉందన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మతి స్థిమితం లేని మహిళ కాలకృత్యాల కోసం మున్నేటి తీరానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మహిళ మృతిపై కేసు నమోదు చేయడంతో పాటు ఆచూకీ కోసం అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం పంపినట్లు తెలిపారు.

టీడీపీ నేతల వ్యాఖ్యలకు న్యాయవాదుల నిరసన

వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కోర్టు భవనం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమరావతి ఉద్యమ నేత కొలికపూడి శ్రీనివాస్, టీడీపీ నేత ఆనం వెంకట రమణారెడ్డిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ విజయవాడ, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో కోర్టు భవనం వద్ద న్యాయవాదులు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ మాజీ జనరల్ సెక్రటరీ పిళ్లా రవి మాట్లాడుతూ ఇటీవల ఒక టీవీ చానల్ డిబేట్‌లో అమరావతి ఉద్యమ నేతగా చెప్పుకునే టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాస్, ఆనం వెంకట రమణారెడ్డిలు తమ స్థాయి మరిచి ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై పరుష పదజాలంతో అసభ్యకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సుధాకర్‌రెడ్డి రాజ్యాంగపరంగా నియమించిన న్యాయవాది అని తెలిపారు. అటువంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చట్టపరంగా నేరం అన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో ప్రభుత్వ న్యాయవాదిగా తన విధులు సక్రమంగా నిర్వర్తించారని పేర్కొన్నారు. దాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేతలు ఆయనపై ఆక్రోశాన్ని వెళ్లగక్కడం సరికాదన్నారు. ఇప్పటికైనా భేషరతుగా టీవీ చానల్ ద్వారా సుధాకర్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ లీగల్ సెల్ సభ్యులు సాయిరామ్, ఒగ్గు గవస్కర్, రమణి, రాజేష్, ఎస్.జ్యోతి, అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఓలో పార్కింగ్, డైనింగ్ హాల్ ప్రారంభం



కమిషనర్ కార్యాలయంలో పార్కింగ్ స్థలాన్ని ప్రారంభిస్తున్న సీపీ టీకే రాణా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పరిపాలన విభాగ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్, పార్కింగ్ ప్రదేశాన్ని ఆధునికీకరణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పోలీస్ కమిషనర్ టీకే రాణా చేతుల మీదుగా పార్కింగ్ స్థలం, డైనింగ్ హాల్‌ను ప్రారంభించి సిబ్బందికి అందుబాటులోకి తీసుకొచ్చారు. డీసీపీ విశాల్‌గున్ని, సీపీఎస్‌డబ్ల్యూ డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, క్రైమ్ ఏడీసీపీ పి.వెంకటరత్నం, సీఎస్‌బీ ఇన్‌చార్జ్ ఏడీసీపీ జీవీ రమణమూర్తి, ఏఓ టి.రంగారావు, ఏఏఓ పి.సునీత, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య, పరిపాలన విభాగ అసోషియేషన్ ప్రెసిడెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పేరుతో మోసం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కబేళా ప్రాంతంలో నగర పాలక సంస్థ నిర్మించిన జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి పలువురిని మోసం చేసిన ఆర్‌ఎంపీతో పాటు ఓ మహిళ బండారం బయట పడింది. బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ముఖం చాటేస్తున్న వీరిపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయింది. బాధితులు ఇచ్చిన సొమ్ముకు కార్పొరేషన్ అధికారుల పేర్లు, హోదాలతో సెక్యూరిటీ పత్రాలను సైతం ఇవ్వడంతో ఈ కేసులో కార్పొరేషన్ సిబ్బంది ఎవరైనా ఉన్నారా అనే దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు... కొత్తపేట పైలా వారి వీధికి చెందిన జిల్లెల్ల రామారావు ప్లాస్టిక్ వ్యాపారం చేస్తుంటాడు. ఇదే వ్యాపారం చేసే కోటి అనే వ్యక్తి ద్వారా ఆర్‌ఎంపీ మస్తాన్ పరిచయం అయ్యాడు. కార్పొరేషన్‌లో తనకు పెద్దపెద్ద ఆఫీసర్లతో పరిచయం ఉందని, ఏ పనైనా చేయిస్తానని మస్తాన్ నమ్మించాడు. దీంతో తనకు కబేళా వద్ద నిర్మించిన జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఇల్లు కావాలని అడగడంతో పని చేయిస్తానని చెప్పాడు. దీంతో రామారావు ఒక సారి రూ.50 వేలు, మరో సారి రూ.66 వేలు చెల్లించాడు. రామారావు చెల్లించిన డబ్బులకు ప్రాజెక్టు మేనేజర్, హౌసింగ్ సెల్ అనే రశీదు మస్తాన్ ఇచ్చాడు. ఇల్లు కేటాయించడానికి కొంత సమయం పడుతుందని చెప్పాడు. కట్టిన డబ్బులకు గ్యారంటీ ఏంటని అడగగా, పాత రాజరాజేశ్వరిపేటలోని జేపీ అపార్టుమెంట్‌లో ఉండే షకీలా అనే ఆమెను పరిచయం చేసి ఆమె ద్వారానే ఇల్లు వస్తున్నాయని నమ్మబలికాడు.

రామారావుతో పాటు అత్త పుష్పలత, యోగి, జానకీరావు, జాన్‌పాల్ వారితో పాటు మరి కొంత మంది మస్తాన్‌కు డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. మస్తాన్‌కు డబ్బులు చెల్లించిన తర్వాత ఇళ్లు ఇవ్వడం ఆలస్యం కావడంతో అనుమానం వచ్చి విజయవాడ కార్పొరేషన్‌లో విచారించారు. అసలు మస్తాన్‌కు, షకీలాకు కార్పొరేషన్ అధికారులతో ఎటువంటి సంబంధం లేదని తేలింది. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ వ్యవహారంలో కార్పొరేషన్ అధికారుల సంతకాలు, పత్రాలను ఇవ్వడంతో ఆ శాఖకు చెందిన వారు ఎవరైనా ఉన్నారా అనే దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి



చిలకలపూడి(మచిలీపట్నం): అక్టోబరు ఒకటో తేదీన నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు వీఆర్వోలు అందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్ (చంటి), ప్రధాన కార్యదర్శి జి.అనుపమ బుధవారం కోరారు. ఈ సమావేశానికి గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి డెప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పాల్గొనేందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. అక్టోబరు ఒకటి, రెండు తేదీల్లో రెవెన్యూ ఉద్యోగులకు సమావేశాలు, వీడియో, టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించవద్దని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారని తెలిపారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు ఉద్యోగులు తమ స్థానాల నుంచి విడిచి వెళ్లడానికి ప్రభుత్వం అనుమతి జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు పెద్ద సంఖ్యలో వీఆర్వోలు హాజరై ఐక్యతను చాటుకోవాలని కోరారు.

రౌడీషీటర్‌కు ఆరు నెలల జైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పోలీసు ఉత్తర్వులను ఉల్లంఘించి నగరంలోకి ప్రవేశించిన నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానా విధిస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సి.రమణారెడ్డి బుధవారం తీర్పు వెల్లడించారు. అజిత్‌సింగ్‌నగర్, రామనగర్ కాలనీకి చెందిన మల్లవరపు విజయ్ అలియాస్ జెమినిపై అనేక కేసులు ఉండటంతో రౌడీషీట్ తెరిచారు. అయినా తన నేరవృత్తిని మార్చుకోకుండా నేరాలకు పాల్పడుతున్నాడు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో కమిషనర్ టీకే రాణా ఈ ఏడాది జనవరి 17న నిందితుడిని నగర బహిష్కరణ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిందితుడు గత మార్చి నెల 5వ తేదీన బహిష్కరణ ఉత్తర్వులను దిక్కరిస్తూ నగరంలోకి ప్రవేశించాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్‌పై వచ్చిన నిందితుడు తిరిగి మార్చి 23వ తేదీ కూడా ఉత్తర్వులను దిక్కరిస్తూ నగరంలోకి ప్రవేశించడంతో కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేయడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అజిత్‌సింగ్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నలుగురు సాక్షులను విచారించగా నిందితునిపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

కేఈబీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

తోట్లవల్లూరు: కేఈబీ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని భద్రిరాజుపాలెంలో చోటు చేసుకుంది. గ్రామంలోని కేఈబీ కాలువ వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం చిక్కుకుంది. బ్లూ రంగు ప్యాంటు, తెలుపు రంగు బనియన్ ఉండటంతోపాటు శరీరం మొత్తం పాడైపోయి ఉంది. వీఆర్‌ఓ సమాచారం మేరకు ఎస్ఐ విశ్వనాథ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్రామ స్వరాజ్యానికి వైఎస్ జగన్ శ్రీకారం

జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యే సింహాద్రి



సచివాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

నంగేగడ్డ(నాగాయలంక): ప్రజలకు చేరువగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ లాంటి పరిపాలనా వ్యవస్థలను గ్రామాల్లో ఒకే గొడుగు కిందకి తెచ్చి సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని నంగేగడ్డ గ్రామంలో రూ.136.54 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే నూతన భవనాలు, సిమెంట్ రోడ్లను బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ తోట లంకమ్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పరిపాలన వ్యవస్థలను గ్రామస్థాయిలో కేంద్రీకరించడం ద్వారా గ్రామ స్వరాజ్య విప్లవానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కీర్తి దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని చెప్పారు. చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ నవరత్నాల సంక్షేమం గ్రామాల్లో గడప గడపకు తీసుకురావడంతో అన్ని వర్గాల పేద మధ్య తరగతి ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. సర్పంచ్ తోట లంకమ్మ నేతృత్వంలో గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం, గడపకు గడపకు మన ప్రభుత్వం –ఇతర నిధులు రూ.69 లక్షలతో నిర్మించిన ఎనిమిది సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, నాయకులు ఉప్పాల రాము, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), పార్టీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ అధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, తోట సాయిబాబు, గ్రామ పెద్ద తోట కృష్ణ, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మొవ్వ: ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపి సంతృప్తి స్థాయిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని బుధవారం గ్రామంలోని మండవ జానకి రామయ్య, క్షేత్రయ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై ప్రజలు కలెక్టరేట్ వరకూ రాకుండా మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం, శుక్రవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. నిడుమోలు, మొవ్వ, చినముత్తేవి, అవురుపూడి గ్రామాల నుంచి ఎక్కువగా రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు తదితర సమస్యలపై అర్జీలు అందించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా మొవ్వ పీహెచ్‌సీకి నిధులు మంజూరయినా పనులు జాప్యం వహిస్తున్నారని తెలిపారు. ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ఎలక్ట్రికల్ ఏఈ పోస్టు భర్తీ చేయాలని కోరారు. అలాగే పలు రోడ్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువ చేసి సమస్యల సత్వర పరిష్కారానికై జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నూతన పరిపాలనా విధానానికి ఇదే నిదర్శనమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, అలాగే స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ పోషణ శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. డీఆర్‌వో వెంకటరమణ, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆర్డీవో విజయ్ కుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, డీపీవో నాగేశ్వర నాయక్, డీసీవో ఫణికుమార్, డీఈవో తాహెరా సుల్తానాలతో పాటు పలు శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అక్కినేని జీవితం భావి నటులకు ఆదర్శం



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న రమా సత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నట జీవితాన్ని భావి నటులు ఆదర్శంగా తీసుకోవాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని నటించిన విభిన్నపాత్రలు మరే నటుడు చేయలేదన్నారు. సినీ నిర్మాతగా, స్టూడియో అధినేతగా తన ప్రతిభను చాటుకున్నారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సినీ సంగీత విభావరి 12 గంటల పాటు సాగింది. విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేశారు. ప్రభల శ్రీనివాస్, డాక్టర్ భాగ్యశ్రీ, స్వాతి, కొప్పుల ఆనంద్, ప్రసూనా రామన్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి ఎల్లా వెంకటేశ్వరరావు

ముగిసిన కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలు



ఎల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న బుచ్చయ్యాచార్యులు, రామానుజాచార్యులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు అని కృష్ణమాచార్య కళాపీఠం ఉపాధ్యక్షుడు టీకేవీ రామానుజాచార్యులు అన్నారు. కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శత జయంతి సందర్భంగా ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సంగీత సమ్మానోత్సవాలు బుధవారం ముగిశాయి. అంతర్జాతీయ మృదంగ విద్వాంసుడు డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావుకు కళాపీఠం పురస్కారం అందించారు. ఈ సందర్భంగా రామానుజాచార్యులు మాట్లాడుతూ తెలుగునాట మృదంగ విద్యకు గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి ఎల్లా అని అభివర్ణించారు. కళాపీఠం ప్రధాన కార్యదర్శి బుచ్చయాచార్యులు మాట్లాడుతూ కళాపీఠం ద్వారా అనేకమంది విద్వాంసులను సత్కరించే అవకాశం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షురాలు రంగనాయకి, నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. సంగీత ఉత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు కచేరీలు నిర్వహించారు. గురువందనం కార్యక్రమంలో విశిష్ట వాయిలీన పంచకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో టీకేవీ రామానుజా చార్యులు, ఎంఎస్ఎన్ మూర్తి, విష్ణుభొట్ల కృష్ణవేణి, ఎన్‌సీ మాధవ్, ఆర్. దినకర్ కీర్తనలు మధురంగా పలికించారు. డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై సహకరించారు. పలువురు సంగీతాభిమానులు పాల్గొన్నారు.

రైలులో మర్చిపోయిన హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

- టీటీఐ గుర్తించి బాధితులకు భద్రంగా అందజేసిన వైనం
- బ్యాగులో రూ. 40 వేలు నగదు, రూ. 6.5 లక్షల బంగారు ఆభరణాలు
- టీటీఐను అభినందించిన డీఆర్‌ఎం, సీనియర్ డీసీఎం



జీఆర్‌పీ పోలీసుల సమక్షంలో హ్యాండ్ బ్యాగును బాధితురాలి సోదరుడికి అందజేస్తున్న టీటీఐ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణంలో రూ. 40వేలు నగదుతో పాటుగా రూ. 6.5 లక్షల బంగారు ఆభరణాలు ఉన్న మహిళ హ్యాండ్ బ్యాగును విధుల్లో ఉన్న టీటీఐ గుర్తించి విచారణ అనంతరం బాధితులకు అప్పగించిన ఘటన చోటు చేసుకుంది. విజయవాడ డివిజన్‌కు చెందిన టీటీఐ జి.లక్ష్మయ్య ఈ నెల 18న ఎల్‌టీటీ–విశాఖపట్నం రైలులో ఎస్–1, బీ–4,5,6 కోచ్‌లలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉదయం 5.10 గంటలకు రైలు భీమవరం టౌన్ దాటిన తరువాత బీ6 కోచ్‌లో బెర్త్‌లు తనిఖీలు చేస్తుండగా బెర్త్ నంబర్ 26 పక్కన డైనింగ్ టేబుల్‌పై మహిళ హ్యాండ్ బ్యాగు ఉండటాన్ని గుర్తించారు. దీనిపై తోటి ప్రయాణికులను విచారించగా భీమవరంలో స్టేషన్‌లో దిగిన కుటుంబానిదిగా తెలిపారు. దీంతో విషయాన్ని ఆయన విజయవాడ కమర్షియల్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. బ్యాగులోని ఫోన్ రింగ్ అవుతుండటంతో తోటి ప్రయాణికుల సమక్షంలో మాట్లాడగా హ్యాండ్ బ్యాగు ట్రైన్‌లో మర్చిపోయినట్లు బాధితురాలు తెలిపింది. కోచ్‌లోని ప్రయాణికుల సమక్షంలో బ్యాగులో ఏముందో నిర్ధారించాల్సిందిగా తెలపడంతో అందులో రూ. 40 వేల నగదు, రూ. 6.50 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు చెప్పడంతో అవి సరిగా ఉండటంతో బ్యాగు బాధితురాలిదేనని నిర్ధారించారు. ఆమె అభ్యర్థన మేరకు రాజమండ్రిలో తన సోదరుడికి అప్పగించాలని టీటీఐని కోరటంతో విషయం రాజమండ్రి కమర్షియల్ కంట్రోలర్‌కు, స్టేషన్ ఆఫీసర్‌కు, జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైలు రాజమండ్రిలో ఆగిన తరువాత జీఆర్‌పీ పోలీసులు బాధితురాలి సోదరుడి నుంచి వివరాలు సేకరించి బ్యాగును అందజేశారు. విధుల్లో చిత్తశుద్ధి, అంకితభావంతో వ్యవహరించి రైలు ప్రయాణికురాలి నష్టాన్ని నివారించిన టీటీఐ లక్ష్మయ్యను డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

తూర్పులో అభివృద్ధికి పెద్దపీట

- శరవేగంగా అభివృద్ధి పనులు
- కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



రెవెన్యూ కాలనీలో భూమి పూజ చేసిన దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ తదితరుల

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని, రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గంలోని 8వ డివిజన్ రెవెన్యూ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో కలిసి దేవినేని అవినాష్ భూమిపూజ చేశారు.

బాబు పాపం పండింది..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. 8వ డివిజన్‌లోని కాలనీల్లో గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్, మేయర్ టీడీపీ వారు ఉన్నప్పటికీ అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. ఈ విషయమై టీడీపీ సానుభూతిపరులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గెలుపోటములతో సంబంధం లేకుండా అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని కాలనీ పెద్దలు, ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటే వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని చెప్పారు. ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకొన్న చంద్రబాబు, పాపం పండి నేడు జైలుకు వెళ్లారన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వంపై నిందలు వేస్తూ సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్ల రాష్ట్ర ప్రజలకు నమ్మకం ఉందని, వారి మద్దతుతో రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, టీడీపీ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు సీతారామరాజు, సుధాకర్, సురేష్, నాగేశ్వరరావు, పాషా, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా దేవినేని నెహ్రూ ట్రస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి అవసరాలకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తమ వంతు సహాయం అందిస్తూ అండగా నిలుస్తోంది. ఏదైనా అవసరమని తలుపు తట్టిన వారికి ట్రస్ట్ తరపున సాయం చేస్తూ భరోసా ఇస్తున్నారు. కాగా పటమట రైతు బజార్‌లో హమాలీగా పనిచేసే అలపల్లి అప్పారావు అనారోగ్యం బారిన పడగా, వైద్య ఖర్చుల కోసం దేవినేని నెహ్రూ ట్రస్ట్ తరఫున బుధవారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. 8వ డివిజన్ వెల్లంకి రామారావు వీధికి చెందిన దుర్గాప్రసాద్‌కు జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ గల టిఫిన్ బండిని ట్రస్ట్ ద్వారా దేవినేని అవినాష్ అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. తన తండ్రి దేవినేని నెహ్రూ మరణానంతరం ఆయన పేరు నిలబెట్టే విధంగా నగరంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా విస్తృతంగా సేవ కార్యక్రమాలు చేపట్టి పేదవారికి అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ 8, 12వ డివిజన్ల ఇన్‌చార్జులు యలమంచిలి జయప్రకాష్, మాగంటి నవీన్, నాయకులు పాల్గొన్నారు.



టిఫిన్ బండి అందజేస్తున్న అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ

క్లుప్తంగా

ఇష్టారాజ్యంగా బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఇష్టారాజ్యంగా బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని వీఎంసీ డెప్యూటీ సిటీప్లానర్ జుబేన్ రాయ్ హెచ్చరించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలువలు, ఇతర నీటి వనరుల్లో చెత్త, వ్యర్థాలను వేయకుండా అన్ని వంతెనలపై ఐరన్ మెష్‌లను ఏర్పాటు చేశామన్నారు. కొందరు ఐరన్ మెస్‌లపై అనధికారికంగా బ్యానర్లు, హోర్డింగ్‌లు అతికించడం, వేలాడ తీయడం చేస్తున్నారన్నారు. బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మందుల దుష్ఫలితాలపై అవగాహన పెరగాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): మందుల దుష్ఫలితాలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించేలా ప్రజల్లో అవగాహన పెరగాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ఫార్మకో విజిలెన్స్ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకుని వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ జెండా ఊపి ప్రారంభించగా, ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వరలత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నలంద డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాంది స్కిల్స్ ట్రైనర్ డి.భవానీ, రజనీలు 110 మంది విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, సెల్ఫ్ ఇంట్రడక్షన్, రెజ్యూమ్ ప్రిపరేషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ టిప్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్లేస్‌మెంట్స్ పొందుతారన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి, బి.రజనీప్రదీప పాల్గొన్నారు.

నిమజ్జనాలకు నిర్వాహకులు సహకరించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలు జరిపేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గుణదల సీఐ పి.కృష్ణమోహన్ కోరారు. స్థానిక మధురానగర్‌లోని గుణదల పోలీస్‌స్టేషన్‌లో వినాయక పందిరి ఏర్పాటు చేసిన నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సహకరిస్తామన్నారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు, గుణదల పోలీసులు పాల్గొన్నారు.

పటమటలో అన్నసంతర్పణ



పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పండుగ సందర్భంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్, ఆర్‌ఆర్ గార్డెన్స్, అచ్చం బజార్, 13వ డివిజన్ కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొని భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఆది దేవుని కరుణ కటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామయణపు శ్రీనివాసరావు, కోల ఉమ, కళ్యాణ్, చక్రవర్తి, శ్రీనివాసరావు, తరుణ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): రాబోయే ఎన్నికల్లో నగర వాసులు సజావుగా ఓటు హక్కు వినియోగించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చాలని వీఎంసీ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన సెంట్రల్ నియోజకవర్గంలోని శారద కళాశాల, చిత్తూరు పబ్లిక్ స్కూల్, టీవీ వెంకటేశ్వరరావు ఎంపీఎల్ స్కూల్, బిషప్ స్కూల్, మడోన్నా పబ్లిక్ స్కూల్, డాన్ బాస్కో స్కూల్‌తో సహా వివిధ విద్యా సంస్థల్లోని 187 నుంచి 257 వరకు ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు సులభంగా అందుబాటులో ఉన్నాయా లేదా, ఓటర్లకు మార్గనిర్దేశం చేయడానికి సరైన సంకేతాలు చూపడానికి వీలు ఉందా తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు, ఎన్నికల సిబ్బంది భద్రతపై ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, సీటింగ్ ఏర్పాట్ల లభ్యతను పరిశీలించి అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

రిషి కీర్తనకు అభినందన

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరెన్సీనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించింది. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో అండర్-13 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రిషి కీర్తన మొదటి బహుమతి సాధించింది. బుధవారం ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఏజీఎం మురళీకిషోర్, ఆర్ఐ మనోజ్‌కుమార్‌రెడ్డి, డీన్ అన్వర్, ఏఓ మధుబాబు విద్యార్థిని అభినందించారు.

వైఎస్సార్ సీపీ ర్యాలీ



మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టును స్వాగతిస్తూ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గొల్లపూడిలో సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి మద్దతుగా పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, సీనియర్ నాయకులు చిన్ని, శివాజీ ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, మాజీ ఎంపీపీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. – చిట్టినగర్(విజయవాడపశ్చిమ)

చిరుధాన్యాలతో ఆరోగ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, చిరుధాన్యాలు ఎంతో ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సెక్టార్-1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి పేర్కొన్నారు. 48, 51వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో ఐరన్ అధికంగా ఉండటం వల్ల తల్లి, బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు సమృద్ధిగా తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహార పదార్థాలు, వైఎస్సార్ కిట్‌లలో ఇచ్చే రాగిపిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరాలు, బెల్లంను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లకు గాయాలైన ఘటన బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుల తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తుంటాడు. వెంకటేశ్వరరావు పెద్ద కుమార్తె కల్పన నగరంలోని ఓ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తుంటుంది. బుధవారం ఉదయం కల్పనను కాలేజీ వద్ద దింపేందుకు చిన్న కుమార్తె స్పందన మోపెడ్‌పై బయలుదేరగా, చెరువు వద్దకు వచ్చే సరికి మోపెడ్ వెనుక టైర్ పంక్చరై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. చిన్న కుమార్తె స్పందనకు స్వల్పగాయాలు కాగా, కల్పన తలకు, కంటికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో కల్పనను బీఆర్టీఎస్ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

మరపురాని మహానటుడు అక్కినేని



అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలనచిత్ర పరిశ్రమలో మరపురాని మహానటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అని సీనియర్ లయన్స్ నాయకుడు కొల్లూరి కొనియాడారు. డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్‌తో కలిసి అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కినేని చేసిన సేవలను గుర్తు చేశారు. భారత చలనచిత్ర పరిశ్రమలో తెలుగు వారి ఖ్యాతిని చాటిన మహానటుడు అక్కినేని అన్నారు. సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ మాట్లాడుతూ తన నటనతో అక్కినేని అభిమానుల మనసుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారన్నారు. నేడు ఆయన భౌతికంగా లేకున్నప్పటికీ ప్రతీ ఒక్కరి హృదయాలలో నిలిచే ఉన్నారని చెప్పారు. అక్కినేని విగ్రహాన్ని కళాక్షేత్రంలో నెలకొల్పే విధంగా తమ సొసైటీకి అనుమతులు ఇవ్వాలని కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం దుర్గాపురంలో మొక్కలు నాటి, మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, బోడి ఆంజనేయరాజు, మండ రాము, పైడిపాటి వెంకన్న, డి.లక్ష్మీకుమారి, శెనగశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొండచరియల తొలగింపు



ఇటీవల కురిసిన వర్షాలకు దుర్గా ఘాట్ సమీపంలో భారీగా కొండచరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆ ప్రాంతంలో మరిన్ని కొండచరియలు విరిగి పడే అవకాశం ఉండడంతో ముందస్తుగా కొండచరియలను తొలగించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బీఎన్ సూరి స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న గౌతమ్‌రెడ్డి, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడకల్చరల్: శ్రీగణేష ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 42వ వార్షికోత్సవం సందర్భంగా సత్యనారాయణపురంలోని గిరివీధిలోని కళావేదికపై బుధవారం రంగస్థల నటీనటులు ఆచంట బాలాజీ నాయుడు, అమ్ముల పార్వతిలకు రంగస్థల ప్రముఖుడు బీఎన్ సూరి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాకు చెందిన బీఎన్ సూరి 700లకు పైగా సాంఘిక పౌరాణిక నాటకాలలో నటించి తన ప్రతిభను చాటుకున్నారన్నారు. నటుడిగా, దర్శకుడిగా అనేక మందిని రంగస్థలానికి పరిచయం చేశారని తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. పురస్కారాల సభలో మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్, గణేష ఉత్సవ కమిటీ నిర్వాహకులు గుడిపాటి రామచంద్ర దత్తు, కృష్ణమోహనరావు, పరిమి భాస్కర శర్మ బీఎన్ సూరి రంగస్థల సేవలను కొనియాడారు.

ఫొటో ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఫొటో ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా హఫీజుల్లా అన్నారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన నేచర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల్లో ఆయా రంగాలపై ఉన్న విజ్ఞానం, ఆసక్తి మరింత పెరుగుతుందన్నారు. తమ పాఠ్య పుస్తకాలకు మాత్రమే పరిమితమయ్యే విద్యార్థులకు ప్రపంచంలోని మిగిలిన విషయాలను కూడా ఫొటో ప్రదర్శన ద్వారా తెలియచేయడం హర్షణీయమన్నారు. ఫొటో ఎగ్జిబిషనతో చదువుపై ఆసక్తిని మరింత పెంచేందుకు దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కూడా ప్రపంచ స్థాయి అంశాలను వివరించాలనే స్ఫూర్తితో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే విధంగా నిరుపేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో రాణించాలనే ఆకాంక్షతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. స్కూల్ హెచ్‌ఎం ఎం.ఎస్.ఇమామ్ బాషా, ఫొటోగ్రఫీ అకాడమీ ఫౌండర్ చైర్మన్ టి.శ్రీనివాస రెడ్డి, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వాహకులు, స్టాఫ్ సెక్రటరీ డి.పూర్ణచంద్రరావు, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, స్వచ్ఛసర్వేక్షణ్ అధికారి రామకృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురం శరభయ్య గుడి వీధిలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజ స్థాపన సాధ్యమని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. నాయకులు జి.ఏడుకొండలు, బి.వసంత కుమార్, కె.రాము, ఎం.రాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ వినాయకనగర్‌లో వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం దీపోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు దీపోత్సవంలో పాల్గొని లింగాకారంలో దీపాలను వెలిగించి వినాయకునికి పూజలు చేశారు. కార్యక్రమాలను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి పర్యవేక్షించారు. శ్రీనగర్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కటారి వెంకట సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు జరిగాయి. చిన్నారుల ప్రదర్శనలు ఆద్యంతం భక్తులను ఆలరించాయి. కార్యక్రమాలను నిర్వాహకులు ఏపుగంటి సాయికృష్ణ పర్యవేక్షించారు.

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా విజయ వినాయకుడు చందన అలంకారంలో భక్తుల పూజలు అందుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో ముచ్చటిస్తున్న కమలానందభారతి స్వామి

విజయవాడకల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. స్వామి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం విశిష్టమైదని దానిని పరిరక్షించుకోవాలని సూచించారు. మంగళమూర్తి వినాయకుడని ఆయనను సేవించుకోవడం శ్రేయోదాయకమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. భారతీయ ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. వినాయక విగ్రహానికి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి, అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి దశరథ రమేష్, కోశాధికారి అనుమల శేఖర్ పాల్గొన్నారు.

316 మందికి వైద్య పరీక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంజే నాయుడు హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొని రోగులకు బీపీ, షుగర్, ఎముకల అరుగుదల పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 316 మందికి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హాస్పిటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ, పోస్టుమాస్టర్లు ఫణీ, ఏసు, ఇమ్మానుయేల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

తాడిగడపలో వృద్ధుడి అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వృద్ధుడు అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌లో పూర్ణచంద్రరావు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఆయనతో పాటు అతని తాత దూడల సుబ్బారావు (74) కలిసి ఉంటున్నాడు. కాగా ఈ నెల 4న పూర్ణచంద్రరావు బంధువుల పెళ్లికి మచిలీపట్నం వెళ్లాడు. తాత సుబ్బారావు 6వ తేదీన మచిలీపట్నానికి వస్తానన్నాడు. అయితే తాత సుబ్బారావు రాకపోయేసరికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. ఈ నెల 12న పూర్ణచంద్రరావు మచిలీపట్నం నుంచి తాడిగడప ఇంటికి వచ్చి చూడగా తాత సుబ్బారావు కనిపించలేదు. అతని ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జూ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6–3, 6–3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)–మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6–4, 7–6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)–మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం ● ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత

హాంగ్జూ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25–27, 29–27, 25–22, 20–25, 17–15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతోపాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.



రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సానాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.



అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగు తాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్ హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4–జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్–100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్


అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్–20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4–5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌ల్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3–2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10–0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9–6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...


● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

– నిర్మాత 'బన్నీ' వాసు


● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

– శ్రీకాంత్


● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ– ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్త్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ– ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ– ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడ బుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.


● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ– "ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు, క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం" అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ– ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.


● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ– ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ– ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారా స్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్, ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.